

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

తలసరి ఆదాయం టార్గెట్
రూ. 24 లక్షలు!
13
- 2047 కల్లా సాధించాలని సీఎం రేవంత్ లక్ష్యం
- ప్రస్తుత రూ.4.30 లక్షల నుంచి 6 రెట్లు పెరగాలి
- తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంట్లో ప్రస్తావన
- భారత్ ఫ్యూచర్ సిటీలో 30 లక్షల మంది జనాభా
- దక్షిణాసియా నైట్ లైఫ్ రాజధానిగా హైదరాబాద్


శుక్రవారం | 5-12-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 247


శ్రీ విశ్వావసునామసంవత్సరం, దక్షిణాయనం, హేమంతఋతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా.12.56 తదుపరి విదియ; నక్షత్రం: రోహిణి ఉ.11.46 తదుపరి మృగశిర; వర్జ్యం: సా.4.40-6.04; దుర్ముహూర్తం: ఉ.8.47-9.31, మ.12.27-1.11; అమృతఘడియలు: ఉ.8.59-10.22, రా.1.05-2.30; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.35; సూర్యాస్తమయం: 5.36

వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆకాశాన్నంటిన విమాన
టికెట్ ధరలు
ఇండిగో సంక్షోభంతో పైపైకి

- ఢిల్లీ నుంచి ముంబై టికెట్ ధర రూ.40,452!!
- పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్న పోటీ సంస్థలు
- ప్రధాన నగరాల మధ్య రూ.30-40 వేలుగా ధరలు
- బెంబేలెత్తుతున్న ప్రయాణికులు
- మూడో రోజు 550కి పైగా ఇండిగో సర్వీసుల రద్దు 14
- పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ సమీక్ష





25 ఒప్పందాలు!

పుతిన్ పర్యటన నేపథ్యంలో భారత్-రష్యా మధ్య కుదిరే అవకాశం


రష్యా అధ్యక్షుడు పుతిన్తో ప్రధాని నరేంద్ర మోదీ కరచాలనం

- ఢిల్లీ ఎయిర్పోర్టులో పుతిన్కు స్వయంగా స్వాగతం పలికిన మోదీ
- ప్రధాని కారులోనే ఆయన అధికారిక నివాసానికి పుతిన్
- రష్యా అధినేతకు మోదీ ప్రైవేటు విందు.. నేడు ఇరువురి మధ్య చర్చలు
- మరో ఐదు రెజిమెంట్ల ఎస్-400లు, రూపే-మిర్ అనుసంధానం, పౌర అణు సహకారం సహా పలు కీలక ఒప్పందాలపై సంతకాలు
- ఎస్-500లు, ఎస్యూ-57 యుద్ధవిమానాల కొనుగోలుపై చర్చ!
- ఇరుదేశాల మధ్య 2030కి 100 బిలియన్ డాలర్ల వాణిజ్యమే లక్ష్యం
- భారత్ 'రక్షణ'కు సహకారం.. రాజ్నాథ్తో భేటీలో రష్యా రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబరు 4: రెండు రోజుల పర్యటన నిమిత్తం రష్యా అధ్యక్షుడు పుతిన్ భారత్కు చేరుకున్నారు. గురువారం సాయంత్రం 6.35 గంటలకు ఢిల్లీలోని పాలం ఎయిర్పోర్టులో దిగిన పుతిన్కు.. ప్రొటోకాల్కు భిన్నంగా ప్రధాని నరేంద్రమోదీ సాదర స్వాగతం పలికారు. కళాకారులు సంప్రదాయ నృత్యం చేస్తుండగా.. విమానం దిగిన పుతిన్ను ఆత్మీయ ఆలింగనం చేసుకున్నారు. సాధారణంగా విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు తన సొంత కారును మాత్రమే వాడే పుతిన్ను.. ప్రధాని మోదీ తన టొయోటా ఫార్చ్యూనర్ కారులో తన అధికారిక నివాసానికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని తెలుపుతూ 'ఎక్స్'లో ఆయన ఒక పోస్టు పెట్టారు. "నా స్నేహితుడు, రష్యా అధ్యక్షుడు పుతిన్కు స్వాగతం పలికినందుకు ఆనందంగా ఉంది. ఈ రాత్రి, రేపు మా ఇద్దరి మధ్య జరిగే సమావేశాల కోసం నేనెంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. భారత్-రష్యా స్నేహం కాల పరీక్షకు నిలిచింది, మన ప్రజలకు అపారమైన మేలు చేకూర్చింది" అని ఆ పోస్టులో పేర్కొన్నారు. ఆ తర్వాత పుతిన్కు ఆయన ప్రైవేటు విందు ఇచ్చారు. పుతిన్ రాక సందర్భంగా మోదీ అధికారిక నివాసాన్ని విద్యుద్దీపాలు, పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. పుతిన్తోపాటు వచ్చిన బృందంలో ఏడుగురు రష్యన్ మంత్రులు, పెద్ద ఎత్తున వ్యాపారవేత్తలు, రష్యా సెంట్రల్ బ్యాంకు గవర్నర్ ఉన్నారు. కాగా.. శుక్రవారం ఉదయం 11 గంటలకు పుతిన్ రాష్ట్రపతి భవన్లో త్రివిధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. 11.30 గంటలకు రాజ్ఘాట్కు చేరుకుని మహాత్మాగాంధీకి నివాళులు అర్పిస్తారు. 11.50 గంటలకు హైదరాబాద్ హౌస్లో మొదలయ్యే ఇండియా-రష్యా 23వ వార్షిక శిఖరాగ్ర

మిగతా 2వ పేజీలో...

ఇంధన బంధం సుస్థిరం

2
- ఎన్ని ఆంక్షలు ఉన్నా చెక్కుచెదరలేదు
- ఇరు దేశాల ఇంధన వాణిజ్యంపై వ్లాదిమిర్ పుతిన్
- భారత్ ఎదుగుదల కొందరికి కంటగింపుగా మారింది
- ఇండియాకు మోదీ నాయకత్వం అదృష్టమని వ్యాఖ్య

ఆదిలాబాద్లో 'ప్రజాపాలన విజయోత్సవాల సభ'లో సీఎం రేవంత్రెడ్డి; హాజరైన ప్రజలు




ఎన్నికల్లో అడ్డగోలు
ఖర్చులొద్దు

- అవి వెనక్కి రావు.. నోరు మంచిగున్నోళ్లనే సర్పంచ్గా గెలిపించుకోండి
- అప్పుడు గొడవలుండవు.. అవసరమైతే సర్పంచ్ను ఏకగ్రీవంగా ఎన్నుకోండి
- దేవుడి ఆశీస్సులతో చిన్న వయసులోనే సీఎం.. రెండేళ్లలో ఒక్క సెలవూ తీసుకోలే
- ఆడబిడ్డలు సంతోషంగా ఉన్నారు.. అందుకే భారీ వర్షాలు పడ్డాయ్
- ప్రత్యేక రాష్ట్రం వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయనుకుంటే ఓ పెద్దాయన దెయ్యమై పట్టారు.. కాళేశ్వరంతో లక్ష కోట్లు గోదారిపాలు
- ఆదిలాబాద్లో ప్రజాపాలన సభలో రేవంత్.. రూ.260 కోట్లతో అభివృద్ధి పనులు

ఆదిలాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నోరు మంచిదైతే ఊరంతా చుట్టాలే అన్నట్టుగా, నోరు మంచిగున్నోళ్లనే సర్పంచ్గా గెలిపించుకోవాలని, అప్పుడు గొడవలు ఉండవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వీలైతే సర్పంచ్ను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. ఎన్నికల్లో అడ్డగోలుగా డబ్బు ఖర్చు పెట్టొద్దని, ఆ పెట్టుబడులు తిరిగిరావడం కష్టం అని అభ్యర్థులకు ఉద్బోధించారు. సర్పంచ్, వార్డు మెంబర్ ఎన్నికలంటూ యువకులు ఊర్లో తిరగొద్దని, పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని.. ఐఏఎస్, ఐపీఎస్లుగా ఎదగాలని హితబోధ చేశారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 'ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాల' బహిరంగ సభకు

మిగతా 12వ పేజీలో...

నేడు నర్సంపేటకు సీఎం రేవంత్

- 531 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు
- ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనానికి భూమి పూజ
- నీటిపారుదల శాఖపై రేపు సీఎం సమీక్ష

12

రాజు వెడలె..

దేశాధ్యక్షుడంటే రాజుతో సమానం! కానీ.. అందరి వైభోగం ఒకేలాగా ఉండదు!! చిన్నదేశాల అధ్యక్షుల పర్యటనలైతే.. ఎప్పుడొచ్చారో, ఎప్పుడెళ్లారో.. అనే విషయం కూడా సామాన్య జనానికి పెద్దగా తెలియకుండా గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోతాయ్! కానీ.. అమెరికా, రష్యా, చైనా లాంటి దేశాల అధ్యక్షుల పర్యటనలంటే మామూలుగా ఉండదు. వేరే లెవెల్ అంతే!! ఏంటా లెవెల్ అంటే.. ప్రస్తుతం మనదేశంలో పర్యటిస్తున్న పుతిన్ వైభోగాన్నే చూడండి..

పుతిన్ భద్రతా వలయం.. శత్రుదుర్భేద్యం..

రష్యా అధ్యక్షుడు తమ దేశానికి పర్యటనకు వస్తున్నారంటే.. ఏ దేశమైనా అత్యంత పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తుంది! అయితే, వాటికి అదనంగా రష్యా ప్రభుత్వం మరింత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తుంది. పుతిన్ పర్యటనకు చాలా రోజుల ముందే.. ఆ దేశానికి చెందిన 'ఫెడరల్ ప్రొటెక్టివ్ సర్వీస్ (ఎఫ్ఎస్‌వో)' రంగంలోకి దిగిపోతుంది. పర్యటన ఆద్యంతం భద్రతా ఏర్పాట్ల ప్రణాళికను అత్యంత కచ్చితత్వంతో రచిస్తుంది. ఐదంచెల భద్రతను ఆయన చుట్టూ ఏర్పరుస్తుంది. దానికితోడు.. రష్యా గూఢచార సంస్థ కేజీబీ ప్రోటోకాల్స్‌తో.. స్నైపర్లు, డ్రోన్ ఆపరేటర్లు, ఎలక్ట్రానిక్ ఇంటెలిజెన్స్ నిపుణులు, కమ్యూనికేషన్ యూనిట్స్‌తో కంటికి కనిపించని శత్రుదుర్భేద్యమైన మరో భద్రతావలయాన్ని కూడా ఏర్పాటు చేస్తుంది. ఇక.. పుతిన్ వ్యక్తిగత భద్రతా సిబ్బందిని.. 'ప్రెసిడెన్షియల్ సెక్యూరిటీ సర్వీస్ (ఎస్‌బీపీ)' నుంచి ఎంపిక చేస్తారు. వీరంతా సుశిక్షితులైన కమాండోలు. ఎస్‌బీపీకి ఎంపిక కావాలంటే.. 35 ఏళ్లలోపు వారై ఉండాలి. 180 సెంటీమీటర్ల కన్నా ఎత్తు ఉండాలి. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి. ఏ క్షణంలోనైనా పోరాటానికి సన్నద్ధంగా ఉండాలి. విదేశీ భాషలు వచ్చి ఉండాలి. ఈ ఎస్‌బీపీలోకి తీసుకునేవారి నేపథ్యాన్ని క్షుణ్నంగా పరిశీలిస్తారు. అధ్యక్షుడి పట్ల నిజాయితీగా వ్యవహరిస్తారని పూర్తిస్థాయిలో నిర్ధారించుకున్నాకే వారిని విధుల్లోకి తీసుకుంటారు.

ఆ విమానం.. ఎగిరే క్రెమ్లిన్

మాస్కోలోని రష్యా అధ్యక్షుడి కార్యాలయాన్ని 'క్రెమ్లిన్' అంటారు! మరి పుతిన్ విదేశాలకు వెళ్లినప్పుడు? ఆయన ప్రయాణించే విమానమే అధ్యక్ష భవనం అవుతుంది. అందుకే దాన్ని ఫ్లైయింగ్ (ఎగిరే) క్రెమ్లిన్‌గా వ్యవహరిస్తారు. అమెరికా ఎయిర్‌ఫోర్స్ వన్ విమానానికి దీటుగా ఉండేలా ఈ ఇల్యూషిన్ ఐఎల్ 96-300 పీయూ విమానాన్ని రూపొందించారు. శత్రుదేశాల రాడార్లు, క్షిపణి వ్యవస్థలకు దొరకకుండా దీంట్లో జామింగ్ వ్యవస్థలు ఉంటాయి. ఒక స్థాయి వరకు క్షిపణి దాడులను తట్టుకునేలా కవచం ఉంటుంది. నేరుగా శాటిలైట్ల అనుసంధానంతో కమ్యూనికేషన్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. లోపలిభాగంలో విలాసవంతమైన ఏర్పాట్లు ఉంటాయి. అధ్యక్షుడికి ప్రైవేటు బెడ్‌రూమ్, ఆఫీసు గది, రెండు కాన్ఫరెన్స్ గదులు, అతిథుల కోసం ఒక గది, మినీ జిమ్, కిచెన్, భోజనాల గది, చిన్న బార్, బాత్రూమ్‌లు ఉంటాయి. అంతేకాదు బయటి నుంచి చూస్తే అచ్చం ఈ విమానాన్ని పోలినట్టే మరో విమానం కూడా ఉంటుంది. పుతిన్ ఎక్కడికైనా వెళ్లినప్పుడు రెండు వేర్వేరు ప్రాంతాల నుంచి ఈ విమానాలు వేర్వేరు మార్గాల్లో ప్రయాణం ప్రారంభిస్తాయి. అధ్యక్షుడు ఎందులో ఉన్నారో శత్రువులకు చిక్కకుండా ఉండాలన్నదే దీని ఉద్దేశం.

పూప్‌కేస్

మనం ఏదైనా ఊరెళ్లేటప్పుడు సూట్‌కేస్ తీసుకెళ్తాం. పుతిన్ మాత్రం.. పూప్‌కేస్ కూడా తన వెంట తీసుకెళ్తారు! పూప్ అంటే తెలుసు కదా.. మలం. రష్యా అధ్యక్షుడు విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడి మరుగుదొడ్లలో కాలకృత్యాలు తీర్చుకుంటే.. ఆయన మలాన్ని సేకరించి, పరీక్షలు చేసి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి విదేశీ గూఢచార సంస్థలు తెలుసుకునే ప్రమాదం ఉంటుంది. అందుకే భద్రతా సిబ్బంది ప్రత్యేక టాయిలెట్లను ఏర్పాటుచేసి, ఆయన మలాన్ని కూడా సేకరించి తమతోపాటు రష్యాకు తీసుకెళ్తారు. అందుకోసం వారు వాడేదే పూప్‌కేస్. ఇప్పుడే కాదు.. పుతిన్ అధికార పగ్గాలు చేపట్టిన 1999 నుంచీ విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఆయన మలాన్ని ఇలాగే ప్రత్యేక కవర్లలో సేకరించి, పూప్‌కేస్‌లో పెట్టి రష్యాకు తరలిస్తున్నారు!

అప్పట్లో అలా..

వాజపేయి భారత ప్రధానిగా 2001లో రష్యా పర్యటనకు వెళ్లినప్పుడు తీసిన ఫొటో ఇది! అప్పట్లో గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న మోదీ.. ఆ పర్యటనకు వెళ్లి, వాజపేయి-పుతిన్ వెనుక నిల్చున్నారు. భారత్‌లో పుతిన్ తాజా పర్యటన నేపథ్యంలో ఆ ఫొటో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఆ పర్యటన గురించి మోదీ ఆ తర్వాతకాలంలో ఒక ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. పుతిన్ ఏ క్షణానా.. తనను భారత్‌లోని ఒక రాష్ట్రం నుంచి వచ్చిన వ్యక్తిలాగానో, తన ప్రాధాన్యం తక్కువని భావించేలాగానో వ్యవహరించలేదని.. అప్పట్నుంచే తమ మధ్య స్నేహపు తలుపులు తెరుచుకున్నాయని తెలిపారు.

వెంట ఫుడ్ ల్యాబ్.. టేస్టర్లు..

పుతిన్ ఎక్కడికి వెళ్లినా ఆయన తినే ఆహారాన్ని పరిశీలించేందుకు చిన్నపాటి ఫుడ్ ల్యాబ్ కూడా వెంట ఉంటుంది. వ్యక్తిగత షెఫ్ కూడా ఉంటారు. స్థానికంగా ఉండే వస్తువులేవీ ఉపయోగించరు. రష్యా నుంచి తెచ్చిన సరుకులతోనే వంట చేస్తారు. 'ఫుడ్ టేస్టర్'గా పిలిచే బాడీగార్డు ఆహారాన్ని తిని చూశాకే.. పుతిన్ భోజనం చేస్తారు. విష ప్రయోగం, కలుషితం కావడం వంటి జరగకుండా ఉండేందుకే ఈ ఏర్పాటు. ఇక ట్వారోగ్‌గా పిలిచే కాటేజ్ చీజ్, కౌజుపిట్ట గుడ్లు, పిస్తా ఐస్‌క్రీమ్‌లను పుతిన్ ఇష్టంగా తింటారు. పండ్ల రసాలు తాగుతారు. సాల్మన్ చేపలు, పొట్టేలు మాంసం, కూరగాయలతో చేసిన సలాడ్ కూడా తీసుకుంటారు.

మా ఇంధన బంధం సుస్థిరం

- ఎన్ని ఆంక్షలు ఉన్నా చెక్కుచెదరలేదు
- భారత్‌తో ఇంధన వాణిజ్యంపై రష్యా అధ్యక్షుడు పుతిన్



న్యూఢిల్లీ, డిసెంబరు 4: అమెరికా ఆంక్షలు, యూరోపియన్ యూనియన్ (ఈయూ) కఠిన చర్యల వల్ల అంతర్జాతీయంగా పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా.. భారత్, రష్యా మధ్య ఇంధన సంబంధాలు చెక్కుచెదరలేదని రష్యా అధ్యక్షుడు పుతిన్ తెలిపారు. ఈ విశ్వాసం ఇలాగే బలంగా సుదీర్ఘ కాలం కొనసాగుతుందని పేర్కొన్నారు. భారత పర్యటన నేపథ్యంలో గురువారం ఆయన.. ప్రముఖ ఆంగ్ల వార్తా సంస్థ ఇండియా టుడేకు ఇంటర్వ్యూ ఇచ్చారు. భారత్, రష్యా సంబంధాలు, అంతర్జాతీయ రాజకీయ, వాణిజ్య పరిణామాలపై తన అభిప్రాయాలను సూటిగా వెల్లడించారు. రష్యానుంచి భారత్ చమురు కొనుగోళ్లను ప్రభావితం చేయాలని కొందరు చేస్తున్న ప్రయత్నాలు పూర్తిగా రాజకీయ దురుద్దేశాలతో కూడుకున్నవని, వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. చాలాకాలం క్రితమే రష్యా చమురు కంపెనీ రోస్‌నెఫ్ట్ భారత్‌లోని నయారా ఎనర్జీలో వాటాలు కొనుగోలు చేసిందని, ఆ పెట్టుబడి రెండుదేశాల మధ్య విశ్వాసానికి ప్రతీకగా నిలుస్తోందని పేర్కొన్నారు.

భారత ఎదుగుదల కొందరికి ఇష్టంలేదు

అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో భారత ప్రాబల్యం రోజురోజుకూ పెరుగుతుండటం కొందరికి కంటగింపుగా మారిందని పుతిన్ విమర్శించారు. అందుకే వారు రాజకీయ కారణాలతో కృత్రిమ అవాంతరాలను సృష్టించి భారత ప్రాధాన్యాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. 'రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలును నిరసిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన ఆంక్షలు, పశ్చిమదేశాల ఆందోళనలన్నీ అంతర్జాతీయ వాణిజ్యంలో భారదేశ బలం పెరుగుదలను సూచిస్తున్నాయి. ఈ రంగంలో భారతదేశ ప్రాబల్యం పెరగటం వారికి అసౌకర్యంగా ఉంది' అని అన్నారు. అంతర్జాతీయంగా ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా.. మోదీతో తనకు ఉన్న సాన్నిహిత్యం భారత్- రష్యా మధ్య సంబంధాలు స్థిరంగా కొనసాగేందుకు ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. దేశమే శ్వాసగా, ప్రాణంగా భావిస్తున్న ప్రధానిగా నరేంద్రమోదీ ఉండటం భారతదేశ అదృష్టమని పుతిన్ అన్నారు. భారతదేశ అభివృద్ధి కోసం మోదీ అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆర్థిక, రక్షణ సహకారం.. మానవతా సంబంధాలు, అత్యాధునిక సాంకేతికత అభివృద్ధి వంటి అనేక రంగాల్లో భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకొనేందుకు కట్టుబడి ఉన్నట్లు చెప్పారు.

25 ఒప్పందాలు!

(మొదటిపేజీ తరువాయి)



సమావేశంలో పుతిన్-మోదీ పాల్గొననున్నారు. రెండు గంటలపాటు సాగే ఈ సమావేశంలో.. ఇరుదేశాల మధ్య రక్షణ సంబంధాలను బలోపేతం చేయడం, బయటి ఒత్తిళ్ల నుంచి ఇరుదేశాల వాణిజ్యాన్ని కాపాడడం, పౌర అణు ఇంధన సహకారం, ఎరువుల రంగంలో సహకారం పెంపు, యురేషియన్ ఎకనమిక్ యూనియన్‌తో భారత్ ప్రతిపాదించిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం సహా పలు అంశాలు కీలకంగా చర్చకురానున్నాయి. రష్యా నుంచి భారత్ పెద్ద ఎత్తున ముడిచమురును కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో భారీగా పెరిగిపోతున్న వాణిజ్య లోటు గురించి భారత్ ఈ భేటీలో ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది (ప్రస్తుతం మనదేశం రష్యా నుంచి ఏటా 65 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.5.8 లక్షల కోట్ల) విలువైన దిగుమతులు చేసుకుంటుండగా.. రష్యాకు మన ఎగుమతులు కేవలం 5 బిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.45 వేల కోట్లు) ఉన్నాయి). 2030 నాటికి ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు చేర్చడమే లక్ష్యంగా ఈచర్చ జరగనుంది. అలాగే.. రష్యా నుంచి భారత్ ముడిచమురు కొనుగోళ్లపై అమెరికా విధిస్తున్న ఆంక్షల ప్రభావంపైనా ఈ భేటీలో చర్చించనున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా చేస్తున్న ప్రయత్నాల గురించి పుతిన్ మోదీకి వివరించనున్నట్టు సమాచారం.

కీలక అంకం.. ఒప్పందాలు

భేటీ అనంతరం.. రష్యా నుంచి కొత్తగా మరో ఐదు రెజిమెంట్ల ఎస్-400ల కొనుగోలు, 'ఆపరేషన్ సిందూర్' సమయంలో వినియోగించిన క్షిపణుల స్థానంలో కొత్త మిస్సైళ్ల కొనుగోలు, రష్యాలో ప్రస్తుతం నిపుణుల కొరత తీవ్రంగా ఉన్న నేపథ్యంలో భారతీయ కార్మికులు, పలు రంగాల నిపుణులు రష్యాకు వెళ్లడాన్ని సులభతరం చేసే, వారి హక్కులకు రక్షణ కల్పించే మొబిలిటీ ఒప్పందం, ఇరుదేశాల మధ్య రక్షణ సహకారం, ఇరు దేశాల చెల్లింపు వ్యవస్థలైన 'రూపే-మిర్' అనుసంధానం సహా... 25 (10 ప్రభుత్వ, 15 వాణిజ్య) కీలక ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. ఈ ఒప్పందాల ఫలితంగా ఫార్మా, వ్యవసాయం, ఆహార ఉత్పత్తులు తదితర రంగాల్లో రష్యాకు భారత ఎగుమతులు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. అలాగే.. రష్యా నుంచి అత్యంత అధునాతన ఎస్-500ల కొనుగోలు, ఐదో తరం యుద్ధవిమానాలైన ఎస్‌యు-57ల కొనుగోలు, ఉమ్మడి ఉత్పత్తి, సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, అంతరిక్ష రంగం, అణు ఇంధనం, సైన్స్ అండ్ టెక్నాలజీ, పోర్టుల అభివృద్ధి తదితర అంశాలకు సంబంధించి కూడా శుక్రవారంనాటి భేటీలో చర్చ జరిగే అవకాశం ఉంది. శిఖరాగ్ర సమావేశం ముగిశాక మధ్యాహ్నం 1.50 గంటలకు పుతిన్-మోదీ సంయుక్త ప్రకటన విడుదల చేస్తారు. అనంతరం.. రష్యా ప్రభుత్వ రంగ సంస్థకు చెందిన భారత చానల్‌ను పుతిన్ ప్రారంభిస్తారు. సాయంత్రం ఏడు గంటలకు రాష్ట్రపతి భవన్‌కు బయలుదేరి వెళ్లి.. ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము ఇచ్చే విందుకు హాజరై రాత్రి 9 గంటలకు మాస్కోకు తిరుగుప్రయాణం అవుతారు. కాగా.. గురువారం సాయంత్రం రష్యా, భారత్ రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. రష్యా నుంచి అదనంగా ఎస్-400 మిసైల్ సిస్టమ్స్, కీలక మిలటరీ హార్డ్‌వేర్ కొనుగోలుపై ప్రధానంగా వారు చర్చించినట్టు సమాచారం. భారత సైనిక దళాల ఆధునికీకరణకు, రక్షణ ఉత్పత్తుల రంగంలో స్వావలంబనకు సహకరిస్తామని రష్యా రక్షణ మంత్రి అంద్రేయ్ బెలొసోవ్ ఈ భేటీలో హామీ ఇచ్చారు. ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింతగా పెంపొందించుకునే దిశగా కొత్త అవకాశాలను అన్వేషిద్దామని రాజ్‌నాథ్ సింగ్ ప్రతిపాదించారు. రష్యా నుంచి చమురు కొనుగోలుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ భారత్‌పై అమెరికా అదనపు సుంకాలు విధించిన వేళ.. ఇరు దేశాల మధ్య సుదీర్ఘకాలంగా జరుగుతున్న వాణిజ్య ఒప్పందం ఒక కొలిక్కి వస్తున్న దశలో జరుగుతున్న పుతిన్-మోదీ భేటీని పాశ్చాత్య దేశాలు కూడా నిశితంగా పరిశీలిస్తున్నాయి.

11 ఏళ్లలో ఆరుగురికి ఆహ్వానం

ప్రొటోకాల్‌కు భిన్నంగా గురువారం సాయంత్రం ప్రధాని మోదీ ఎయిర్‌పోర్టుకు వెళ్లి రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను ఆహ్వానించడాన్ని అంతా ఆసక్తిగా చూశారు. అయితే, మోదీ ఇలా వేరే దేశాల అధినేతలను ఆహ్వానించడానికి విమానాశ్రయానికి వెళ్లడం ఇదే మొదటిసారి కాదు. గడిచిన 11 ఏళ్లలో ఆయన 6 సందర్భాల్లో ఇలా వెళ్లారు. 2015లో అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామాను, 2017లో బంగ్లాదేశ్ పీఎం షేక్ హసీనాను, జపాన్ ప్రధాని షింజో అబెను, 2020లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను, 2024 జనవరిలో యూఏఈ అధ్యక్షుడు మొహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్‌ను, 2025 ఫిబ్రవరిలో ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీని స్వయంగా ఆహ్వానించారు.

అప్పుడాయన.. ఇప్పుడీయన..

కిందటి సంవత్సరం మన ప్రధాని మోదీ రష్యా పర్యటనకు వెళ్లినప్పుడు.. మాస్కోలో ఆయనకు పుతిన్ ప్రైవేట్ డిన్నర్ ఇచ్చారు! దానికి ప్రతిగా మోదీ.. గురువారం రాత్రి పుతిన్‌కు ప్రైవేటు డిన్నర్ ఇచ్చి తమ స్నేహబంధాన్ని మరింత పటిష్ఠం చేసుకున్నారు! ఇక.. మూణ్నెల్ల క్రితం చైనాలోని టియాన్జిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సమయంలో.. మోదీని పుతిన్ తన కారులో ఎక్కించుకుని దాదాపు 45 నిమిషాల పాటు అందులోనే చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. ఇదే కోవలో.. గురువారం రాత్రి ప్రధాని మోదీ పుతిన్‌ను తన టొయోటో ఫార్చ్యూనర్ కారులో ఎక్కించుకుని తన అధికారిక నివాసానికి తీసుకెళ్లడంతో.. సామాజిక మాధ్యమాల్లో పలువురు 'కార్‌పూలింగ్ 2.0' జరిగిందంటూ రెండు ఫొటోలూ పెట్టారు.



రష్యాలో భారత సంతతి ఎమ్మెల్యే..

- ఎస్-500 వ్యవస్థ కొనుగోలుకు భారత్ ప్రయత్నించాలన్న అభయ్‌సింగ్



న్యూఢిల్లీ, డిసెంబరు 4: రష్యా నుంచి అత్యాధునికమైన క్షిపణి రక్షణ వ్యవస్థ ఎస్-500ను కొనుగోలు చేయడానికి భారత్ ప్రయత్నించాలని రష్యాలోని భారత సంతతి ఎమ్మెల్యే అభయ్ సింగ్ సూచించారు. ఎస్-500 వ్యవస్థను రష్యా ఇప్పటివరకు ఎవరికీ ఇవ్వలేదని, దాన్ని పొందితే భారత్‌కు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఎస్‌యూ-57 యుద్ధ విమానాలు కూడా అద్భుతమని చెప్పారు. రష్యాలో నిపుణుల కొరత ఉందని, భారతీయులకు అక్కడ మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పుతిన్ భారత పర్యటన నేపథ్యంలో రష్యాలో భారత సంతతి ఎమ్మెల్యే ఈ ప్రకటన చేయడంతో ఆయన ఎవరనే దానిపై అంతటా ఆసక్తి నెలకొంది. బిహార్‌లోని పట్నాకు చెందిన అభయ్‌సింగ్ 1991లో అప్పటి సోవియట్ యూనియన్‌కు వెళ్లి.. అక్కడే స్థిరపడ్డారు. తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. పుతిన్‌కు చెందిన యునైటెడ్ రష్యా పార్టీ తరఫున 2017లో తొలిసారిగా ఉక్రెయిన్ సరిహద్దుల్లోని కర్స్క్ ప్రాంత శాసనసభ్యుడిగా గెలిచారు. 2022లో మరోసారి విజయం సాధించారు. సోవియట్ యూనియన్ పతనం సమయంలోనే తాను పుతిన్‌ను చూశానని, ఆయనను ఆదర్శంగా తీసుకునే రాజకీయాల్లోకి వచ్చానని అభయ్‌సింగ్ చెప్పారు. భారత్‌లో జరిగే ఎన్నికల తరహాలోనే తాను ప్రచారం చేశానని, ప్రతిఒక్కరినీ కలిసి మద్దతు కూడగట్టుకుని, గెలిచానని పేర్కొన్నారు.

కారు కాదది.. రోడ్డుపై కదిలే పడవ!



పుతిన్ ఏ దేశానికి వెళ్లినా.. ఆయన బుల్లెట్ ప్రూఫ్ 'ఆరస్ సెనాట్' లైమోజిన్ కారును విమానంలో అక్కడికి తరలిస్తారు. అక్కడ కూడా ఆయన ఆ కారులోనే పర్యటిస్తారు. పుతిన్ కారుపై గ్రెనేడ్‌లు పడ్డా చెక్కు చెదరదు. అద్దాలన్నీ పూర్తిగా బుల్లెట్ ప్రూఫ్. ఇంధన ట్యాంకుకు కూడా ప్రత్యేకమైన రక్షణ ఉంటుంది. టైర్లు పంక్చర్ కావు. నాలుగు టైర్లూ పంక్చరైనా కారు ఆగకుండా దూసుకుపోతుంది. క్లిష్టమైన వాతావరణ పరిస్థితుల్లోనూ, ఎలాంటి నేలపై అయినా దూసుకుపోయేలా 4 వీల్ డ్రైవ్, హైడ్రాలిక్ సస్పెన్షన్ వ్యవస్థ ఉంటుంది. అత్యంత శక్తివంతమైన వీ8 ట్విన్ టర్బో ఇంజన్‌తో కూడిన ఈ వాహనం.. అంత బరువుతోనూ కేవలం 6 సెకన్లలో 100 కి.మీ. వేగాన్ని అందుకుంటుంది. కారు లోపల అత్యంత అధునాతన, భద్రతాపరమైన ఫీచర్లతో సీట్లు, లైటింగ్, ఇతర ఏర్పాట్లు ఉంటాయి.

భారత్ 'రక్షణ'కు పూర్తి సహకారం

రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబనకు తోడ్పడుతాం.. సైనిక దళాల ఆధునికీకరణకు సాయం చేస్తాం

- రష్యా రక్షణ మంత్రి ఆంద్రే బెలొసోవ్ హామీ
- దేశీయంగా రక్షణ పరికరాల ఉత్పత్తి, ఎగుమతులపై దృఢ సంకల్పంతో ఉన్నాం: రాజ్‌నాథ్
- వార్షిక సదస్సుకు ముందస్తుగా రక్షణ మంత్రుల భేటీ



రష్యా రక్షణ మంత్రి ఆంద్రే బెలొసోవ్‌తో రాజ్‌నాథ్

న్యూఢిల్లీ, డిసెంబరు 4: భారత్ రక్షణ ఉత్పత్తుల్లో స్వావలంబన సాధించేందుకు రష్యా రక్షణ పరిశ్రమ తోడ్పడుతుందని ఆ దేశ రక్షణ మంత్రి ఆంద్రే బెలొసోవ్ హామీ ఇచ్చారు. భారత సైనిక దళాల ఆధునికీకరణకు రష్యా పూర్తిస్థాయిలో సహకారం అందిస్తుందని చెప్పారు. భారత్, రష్యా వార్షిక సదస్సుకు ముందు సన్నాహకంగా.. ఇరుదేశాల రక్షణ మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, ఆంద్రే బెలొసోవ్ గురువారం సాయంత్రం భేటీ అయ్యారు. శుక్రవారం జరిగే సదస్సులో ప్రధాని మోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ అయి తీసుకునే కీలక నిర్ణయాలు, జరగనున్న ఒప్పందాలపై చర్చించారు. 'భారత్-రష్యా అంతర ప్రభుత్వ కమిషన్ ఆన్ మిలటరీ, మిలటరీ సాంకేతిక సమావేశం'లో భాగంగా ఈ భేటీ జరిగింది. ఈ సందర్భంగా భారత రక్షణ పరిశ్రమ సామర్థ్యాన్ని పెంచుకోవడంతోపాటు దేశీయ ఉత్పత్తి, ఎగుమతులపై దృఢ సంకల్పంతో ముందుకు సాగుతామని రాజ్‌నాథ్ పునరుద్ఘాటించారు. అధునాతన సాంకేతికతల్లో భారత్, రష్యా మధ్య సహకారాన్ని మరింతగా పెంచుకునేందుకు కొత్త అవకాశాలను అన్వేషిద్దామని ప్రతిపాదించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలు గాఢమైన నమ్మకం, పరస్పర గౌరవంతో కూడుకున్నాయని.. ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇది నిదర్శనమని రక్షణ మంత్రులు ఈ సందర్భంగా అభిప్రాయానికి వచ్చారు. భారత్ రక్షణ ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు రష్యా రక్షణ పరిశ్రమ తోడ్పడుతుందని ఆంద్రే బెలొసోవ్ హామీ ఇచ్చారు. భారత సైనిక దళాల ఆధునికీకరణకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ అస్థిరతలు నెలకొన్న సమయంలోనూ భారత్, రష్యా రక్షణ సహకారం బలంగా ముందుకు సాగుతోందన్నారు. భారత్, రష్యా మధ్య దృఢమైన స్నేహం కాలపరీక్షను తట్టుకుని నిలిచిందని.. దక్షిణాసియా ప్రాంతంలో సమతుల్యతకు ఇది మార్గం వేసిందన్నారు. భేటీ అనంతరం రక్షణ శాఖ ఈ వివరాలు వెల్లడించింది. ఈ సమావేశానికి ముందు రాజ్‌నాథ్, బెలొసోవ్ నేషనల్ వార్ మెమోరియల్ వద్ద నివాళి అర్పించారు. కాగా, ఆపరేషన్ సిందూర్‌లో అద్భుత పనితీరు చూపిన రష్యా ఎస్-400 క్షిపణి రక్షణ వ్యవస్థలు మరిన్నింటిని కొనేందుకు భారత్ ఆసక్తి చూపినట్టు సమాచారం.

విదేశాల అధినేతలను కలవకుండా చేస్తున్నారు

- ప్రతిపక్ష నేతతో సమావేశం కావొద్దని ప్రభుత్వం వారికి చెబుతోంది : రాహుల్ గాంధీ
- రాహుల్ ఆరోపణలు పచ్చి అబద్ధం: బీజేపీ



న్యూఢిల్లీ, డిసెంబరు 4: విదేశాల ప్రధానులు, అధ్యక్షులు వంటివారు భారత్‌కు వచ్చినప్పుడు.. వారు ప్రతిపక్ష నేతను కలవకుండా ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఇది ఎన్డీయే ప్రభుత్వ అభద్రతా భావానికి నిదర్శనమని విమర్శించారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ పర్యటన నేపథ్యంలో రాహుల్ గురువారం పార్లమెంటు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. "విదేశాల అధినేతలు భారత్‌కు వచ్చినప్పుడు ప్రతిపక్ష నేతను కూడా కలవడం మన సాంప్రదాయం. వాజ్‌పేయి, మన్మోహన్‌సింగ్ ప్రధానులుగా ఉన్న సమయంలో అది కొనసాగింది. ప్రధాని మోదీగానీ, విదేశాంగ మంత్రి జైశంకర్‌గానీ ఆ సాంప్రదాయాన్ని పాటించడం లేదు. ఇప్పుడు విదేశాల నేతలు ఇక్కడికి వచ్చినా, నేను విదేశాలకు వెళ్లినా.. ప్రతిపక్ష నేతను కలవవద్దని వారికి ప్రభుత్వం సూచిస్తోంది. నన్ను కలవవద్దని ప్రభుత్వం చెప్పిందంటూ విదేశాల నేతల నుంచి నాకు సమాచారం వస్తోంది" అని వ్యాఖ్యానించారు. కాగా, భారత్‌కు వచ్చే విదేశాల అధినేతలు ఇక్కడి ప్రతిపక్ష నేతను కలవడం ప్రొటోకాల్‌లో భాగమని, కానీ మోదీ ప్రభుత్వం దీనిని ఉల్లంఘిస్తోందని ప్రియాంకగాంధీ విమర్శించారు. కాగా, రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ ఖండించింది. "రాహుల్ వ్యాఖ్యలు పచ్చి అబద్ధం. గత ఏడాదిన్నర కాలంలో మలేషియా, న్యూజిలాండ్, మారిషస్, వియత్నాం ప్రధానులు సహా పలువురు విదేశాల నేతలను రాహుల్ కలిశారు" అని బీజేపీ అధికార ప్రతినిధి అనిల్ బలుని అన్నారు.

బీఎల్‌వోలపై 'సర్' ఒత్తిడిని తగ్గించే బాధ్యత రాష్ట్రాలదే!

- ఈసీకి అదనపు సిబ్బందిని సమకూర్చాలి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, డిసెంబరు 4: ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ(ఎస్ఐఆర్-సర్)ను నిర్దీత గడువులోగా పూర్తిచేయాల్సి రావడంతో తీవ్ర ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న బూత్ స్థాయి అధికారు(బీఎల్‌వో)లకు రాష్ట్రప్రభుత్వాలే ఉపశమనం కలిగించాలని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ)కి అదనపు సిబ్బందిని సమకూర్చడం ద్వారా బీఎల్‌వోలపై ఒత్తిడి తగ్గించాలని ఆదేశించింది. తమిళ సినీ హీరో విజయ్‌కు చెందిన టీవీకే పార్టీ దాఖలుచేసిన దరఖాస్తుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. బీఎల్‌వోల్లో అత్యధికులు టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలైనందున.. వారి రెగ్యులర్ పనులకు తోడు 'సర్' సంబంధ విధులు కూడా నిర్వర్తించాల్సి వస్తున్నందున.. సమయం చాలక తీవ్ర ఒత్తిడికి గురై ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆ పార్టీ తరఫు సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్ కోర్టు దృష్టికి తెచ్చారు. అంతేగాక విధి నిర్వహణలో విఫలమైన బీఎల్‌వోలపై ఈసీ ఎఫ్ఐఆర్‌లు నమోదుచేస్తోందని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ పై ఆదేశాలిచ్చింది. ఈసీకి అదనపు సిబ్బందిని డిప్యుటేషన్‌పై పంపడం ద్వారా రాష్ట్రాలు బీఎల్‌వోలపై ఒత్తిడి తగ్గించాలని పేర్కొంది.

సర్ జరుగుతోంది ఇక్కడే..

9 రాష్ట్రాలు.. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గోవా, రాజస్థాన్, యూపీ, అసోం.. మూడు కేంద్ర పాలిత ప్రాంతాలు పుదుచ్చేరి, అండమాన్-నికోబరా దీవులు, లక్ష దీవుల్లో 'సర్'కు ఈసీ అక్టోబరు 27న ఆదేశించింది. వీటిలో తమిళనాడు, పుదుచ్చేరి, బెంగాల్, కేరళ, అసోంలో 2026లో ఎన్నికలు జరగాల్సి ఉంది. 'సర్' గడువు నవంబరు 30న ముగియాల్సి ఉండగా.. మరో వారం పొడిగిస్తూ ఈసీ ఆదేశాలు జారీచేసిన సంగతి తెలిసిందే. 51 ఓట్ల మంది ఓటర్లతో కూడిన జాబితాల ప్రక్షాళన ప్రక్రియ ప్రస్తుతం తుది దశలో ఉంది.

యాసిడ్ దాడుల కేసులపై నిర్లక్ష్యం వ్యవస్థకే సిగ్గుచేటు

- దేశ రాజధానిలోనే 16 ఏళ్ల జాప్యమా?
- సుప్రీంకోర్టు సీరియస్



న్యూఢిల్లీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): యాసిడ్ దాడి కేసుల విచారణలో జాప్యంపై గురువారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 16 ఏళ్లుగా బాధితురాలు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరుగుతుండడంపై తీవ్రంగా స్పందించింది. ఇది దేశానికే సిగ్గుచేటని, ముమ్మాటికీ వ్యవస్థను అపహాస్యం చేయడమేనని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న యాసిడ్ దాడుల కేసులపై నివేదిక ఇవ్వాలని అన్ని హైకోర్టులను ఆదేశించింది. ఢిల్లీలోని రోహిణి ప్రాంతం కోర్టులో పెండింగ్‌లో ఉన్న యాసిడ్ దాడి కేసును దృష్టిలో పెట్టుకొని ఈ వ్యాఖ్యలు చేసింది. ఢిల్లీకి చెందిన షహీన్ మాలిక్ అనే మహిళపై 2009లో యాసిడ్ దాడి జరిగింది. దీనిపై రోహిణీ కోర్టులో కేసు నమోదు కాగా, 2013 వరకు ఎలాంటి విచారణ జరగలేదు. 16 ఏళ్ల తరువాత ప్రస్తుతం తుది దశ విచారణ జరుగుతోంది. తన కేసుపై పోరాటం చేస్తుండడంతో పాటు, యాసిడ్ దాడి బాధితులను దివ్యాంగులుగా గుర్తించి, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరుతూ ఆమె ప్రజా ప్రయోజన వ్యాజ్యం కూడా దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం దేశ రాజధానిలోనే ఇంతటి నిర్లక్ష్యం చోటుచేసుకోవడంపై అసహనం వ్యక్తం చేసింది. బాధితురాలు స్వయంగా కోర్టుకు హాజరయి తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు.

ఆమె బాధను విన్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ విచారణ జరుగుతున్న తీరుపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "యాసిడ్ దాడి అనేది ఎంతో క్రూరమైన నేరం. ఇటువంటి కేసుల్లోనూ జాప్యమంటే.. ఇది వ్యవస్థను అపహాస్యం చేయడమే. అలాంటి వ్యక్తుల (నిందితుల) పట్ల సానుభూతి ఉండకూడదు. ఇటువంటి క్రూరత్వానికి పాల్పడే వ్యక్తులపై ఈ దేశమూ అంతే నిర్దయతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది." అని వ్యాఖ్యానించారు. పెండింగ్ కేసుల వివరాలను వచ్చే ఏడాది జనవరి 27లోపు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దేశంలోని అన్ని హైకోర్టుల రిజిస్ట్రార్ జనరళ్లకు నోటీసులు జారీ చేశారు.

డేంజర్‌లో శ్రీశైలం డ్యాం!



- ఆనకట్టవైపు దూసుకొస్తున్న ప్లంజ్‌పూల్ రంధ్రం
- ప్లంజ్‌పూల్ వద్ద 45 మీటర్ల మేర భారీ గొయ్యి
- ఆనకట్ట భద్రతపై నిపుణుల కమిటీ ఆందోళన
- అధ్యయన నివేదికను వెల్లడించిన కమిటీ

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిపై శ్రీశైలం వద్ద నిర్మించిన ఆనకట్టకు ప్లంజ్‌పూల్ రంధ్రం ప్రమాదకరంగా పరిణమిస్తోందని నిపుణుల కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. డ్యాం దిగువన ప్లంజ్ పూల్ ప్రమాదకరంగా మారిందని, ఆ ప్రాంతంలో భారీగా ఏర్పడిన గొయ్యి డ్యాం భద్రతను ప్రశ్నార్థకం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. తాజాగా నిర్వహించిన అండర్ వాటర్ పరిశీలనలో ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ఏడాది జూన్‌లో ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ తన అధ్యయన నివేదికను వెల్లడించింది. డ్యాం నుంచి దిగువకు లక్షల క్యూసెక్కుల నీరు వేగంగా పడటం వల్ల ఆ ఒత్తిడికి ప్లంజ్‌పూల్ 35-45 మీటర్ల లోతు గొయ్యి ఏర్పడినట్లు గుర్తించారు. ఇది అప్రాన్ ముగిసిన 15 మీటర్ల తరువాత మొదలై.. సుమారు 150 మీటర్ల వరకు విస్తరించినట్లు నిపుణులు వెల్లడించారు. దీని వల్ల 36 మీటర్ల వెడల్పు ఉన్న అప్రాన్‌కు ముప్పు ఏర్పడిందని, దాని కింద 4 మీటర్ల లోతు రంధ్రం ఉందని కమిటీ పేర్కొంది. ఈ రంధ్రం డ్యాంవైపు 14-15 మీటర్ల మేర విస్తరించి ఉండటంతో కమిటీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అప్రాన్ వెడల్పులో సుమారు సగభాగం ఎలాంటి మద్దతు లేకుండా గాల్లో వేలాడుతున్నట్లు ఉందని పేర్కొంది. రక్షణ కోసం ఏర్పాటు చేసిన స్టీల్ సిలిండర్లు కూడా దెబ్బతిన్నాయని తెలిపింది. అప్రాన్‌ను కాపాడేందుకు గతంలో ఏర్పాటు చేసిన 62 సిలిండర్లలో అనేకం దెబ్బతిన్నాయని గుర్తించారు. ఇప్పటికే ఐదు సిలిండర్లు వరదలో కొట్టుకుపోయాయని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ గతంలో ఇచ్చిన నివేదికలో పేర్కొంది.

డ్యాం పునాదులకంటే ఎక్కువ లోతు

2018లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ చేసిన అధ్యయనంలో వాయిడ్ లోతు 32 మీటర్లు ఉన్నట్లు గుర్తించింది. అది ఆనకట్ట పునాది లోతును మించి పోయిందని తెలిపింది. ఇప్పుడు 45 మీటర్లకు చేరడంతో పరిస్థితి ఆందోళనకరమని పేర్కొంది. విశాఖపట్నం కేంద్రంగా ఉన్న సీలైన్ ఆఫ్‌షోర్ డైవింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ ఇచ్చిన 200 పేజీల అధ్యయన నివేదికలో పలు హెచ్చరికలు చేసింది. డ్యాంకు తక్షణ మరమ్మతులు అవసరమని సిఫార్సు చేసింది. ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దాల్సి ఉందని సిఫార్సు చేసింది.

సాయుధ పోరాటం విఫలం

దేశంలో ప్రస్తుత పరిస్థితులు పోరాటానికి అనుకూలంగా లేవు.. నేటి పరిస్థితికి మావోయిస్టు పార్టీ గత తప్పులే కారణం

- మొండిగా ప్రాణాలు బలివ్వటం సరికాదు
- ఆయుధాలు వదలాలని మావోయిస్టులందరికీ విజ్ఞప్తి చేస్తున్నా
- ఈ దేశంలో అత్యంత ప్రమాదకర ఆయుధం కులమే
- ఎవరైనా తన లక్ష్యాల సాధనకు ఎన్నికలను ఎంచుకోవచ్చు
- 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' ఇంటర్వ్యూలో మాజీ మావోయిస్టు నేత మల్లోజుల వేణుగోపాల్



హైదరాబాద్, డిసెంబరు 4: మనదేశంలో సాయుధ పోరాట విప్లవ పంథా విఫలమైందని సీపీఐ మావోయిస్టు పార్టీ మాజీ నాయకుడు, పార్టీ సిద్ధాంతకర్త మల్లోజుల వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. గత 50 ఏళ్లలో పార్టీ చేస్తూ వచ్చిన తప్పిదాలే ప్రస్తుత పరిస్థితికి కారణమని తెలిపారు. ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కు ఆయన ఈమెయిల్ ద్వారా ఇంటర్వ్యూ ఇచ్చారు. సాయుధ ఉద్యమం, పార్టీ.. గత, ప్రస్తుత పరిస్థితులు, తన వ్యక్తిగత జీవితం గురించిన వివరాలను ఆయన పంచుకున్నారు.

ప్రశ్న: మీరు దాదాపు 50 ఏళ్లపాటు అడవుల్లోనే జీవించారు. ఆ జీవితం ఎలా ఉండేది?

మల్లోజుల: అడవిలో నా ఉద్యమ కాలం నాకు స్వర్ణయుగం లాంటిది. అనాగరికులుగా ముద్ర పడి, ప్రధాన సమాజానికి దూరంగా ఉండిపోయిన ఆదివాసీలను దాదాపు 50 ఏళ్ల క్రితం కలిశాను. ఆ తర్వాత వారితో నా జీవితం విడదీయలేనంతగా పెనవేసుకుపోయింది. ఆ గిరిజనులే అడవిలోని సకల వనరులకు యజమానులని నమ్మిన మావోయిస్టు పార్టీ.. అణచివేతకు గురైన వర్గాల తరఫున పోరాడటానికి అదే సరైన వేదిక అని గుర్తించింది. అక్కడ పనిచేయటం నాకు గొప్ప సంతోషాన్ని, సంతృప్తిని ఇచ్చింది.

ప్రశ్న: మీ లొంగుబాటుకు ప్రధాన కారణం?

మల్లోజుల: నేను లొంగిపోవాలని అనుకోలేదు. కానీ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పార్టీ సిద్ధాంతం, ఆచరణలో మార్పు తీసుకురావటంలో మేం విఫలమయ్యాం. 1980లో ఉన్న పరిస్థితులు నేటి 21వ శతాబ్దంలో లేవు. గత 25 ఏళ్లలోనే దేశ ఆర్థిక వ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయి. వరుస దెబ్బలతో ఉద్యమం తీవ్రంగా బలహీనపడింది. ఇంకా అదే పంథాలో వెళ్లటం సరికాదు. మా పార్టీ జనరల్ సెక్రెటరీ నంబాల కేశవరావు (బసవరాజు) సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని భావించారు. దానిని అమలుచేసే ప్రయత్నంలో ఉండగానే పోలీసు బలగాల దారుణ ఎన్‌కౌంటర్‌లో మరణించారు. దీంతో నంబాలతో సిద్ధాంతపరంగా, రాజకీయంగా, వ్యవస్థాగతంగా ఏకీభవించిన మేము లొంగిపోవాలని నిర్ణయించుకున్నాం. గత 25 ఏళ్లుగా నాకు పార్టీ విధానాలతో అభిప్రాయ బేధాలున్నాయి.

ప్రశ్న: మావోయిస్టు పార్టీ ప్రజాదరణ కోల్పోవటానికి కారణం?

మల్లోజుల: చాలాకాలంగా చేస్తూ వచ్చిన తప్పుల వల్ల పార్టీ తన మూల సిద్ధాంతం నుంచి పక్కకు వెళ్లిపోయింది. భారత ప్రభుత్వాన్ని మేము తక్కువగా అంచనా వేశాం. ప్రజలను ఏకం చేసేందుకు ఉన్న చట్టబద్ధమైన అవకాశాలను తిరస్కరించాం.

ప్రశ్న: మీ సోదరుడు కిషన్‌జీ 2011లో ఎన్‌కౌంటర్‌లో మరణించినప్పుడూ మీరు లొంగిపోలేదు. అప్పుడు మీరు ఎలా ఆలోచించారు?

మల్లోజుల: నా సోదరుడు మరణించినప్పుడు మాలో ఎవరూ లొంగిపోవాలని అనుకోలేదు. అయితే, అప్పటి నుంచే పార్టీ చేసిన పొరపాట్లను నేను అర్థం చేసుకున్నాను. సెంట్రల్ కమిటీ (సీసీ), పొలిట్‌బ్యూరో సభ్యుడిగా వాటిని సరిదిద్దాలని భావించి, నా అభిప్రాయాలను సీసీ ముందు పెడితే ఏకగ్రీవంగా తిరస్కరించారు. కొంతకాలానికి సీసీ నా వాదనను ఆమోదించి, తప్పులను సరిదిద్దాలని యత్నించింది. కానీ, అప్పటికే పరిస్థితులు దిగజారడంతో సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమించాలని మా కార్యదర్శి నిర్ణయించినప్పటికీ దానిని బహిరంగంగా ప్రకటించకపోవటంతో భారీ మూల్యమే చెల్లించుకోవాల్సి వచ్చింది.

ప్రశ్న: హిడ్మాతో మీకున్న అనుబంధం ఏమిటి?

మల్లోజుల: హిడ్మాతో నాకు 20 ఏళ్ల నుంచి సాన్నిహిత్యం ఉంది. అతడు అద్భుతమైన గెరిల్లా పోరాట నాయకుడు. హిడ్మా దండకారణ్యాన్ని వీడి వెళ్లాలని నిర్ణయించుకోవటం పెద్ద తప్పు అని నా అభిప్రాయం.

ప్రశ్న: నేడు మిమ్మల్ని కొందరు ద్రోహి అంటున్నారు. ఈ పరిస్థితుల్లో మీ వ్యక్తిగత భద్రత గురించి భయపడుతున్నారా?

మల్లోజుల: పార్టీ గురించి తప్ప నా జీవితం గురించి నాకు ఎలాంటి భయం లేదు. నా జీవితం గురించే ఆలోచించి లొంగుబాటు నిర్ణయం తీసుకోవాలనుకుంటే ఎప్పుడో లొంగిపోయేవాడిని. నాకు ఏ భయమూ లేదు. ఎందుకు భయపడాలి? ఉద్యమకారులను, ఉద్యమాన్ని కాపాడుకోవటం గురించే నా ఆలోచన. నన్ను ద్రోహి అని నిందిస్తున్న వారికి వాస్తవ పరిస్థితులు తెలియవు. ఇటీవల పొలిట్‌బ్యూరో ఇచ్చిన సర్క్యులర్‌తోపాటు నేను విడుదల చేసిన 22 పేజీల డాక్యుమెంటును వారు చదివితే సంతోషిస్తాను. నిన్నటివరకు నేను ఎలా ఉంటానో ఎవరికీ తెలియదు. కానీ, ఇప్పుడు నేను ప్రజలందరికీ తెలియాలి అనుకుంటున్నాను. నా ఇల్లు, బంధువులు అంతా ఈ దేశ ప్రజలే.

ప్రశ్న: ఇప్పటికీ అండర్‌గ్రౌండ్‌లోనే ఉన్న తిప్పిరి తిరుపతి వంటి వారికి మీరిచ్చే సలహా ఏమిటి?

మల్లోజుల: దేశంలో సాయుధ పోరాట ప్రయోగం విజయవంతం కాలేదు. ఆ మార్గాన్ని వదిలి బయటకు రావాలని వారికి మళ్లీ విజ్ఞప్తి చేస్తున్నా.

ప్రశ్న: మీరు బ్రాహ్మణులు కదా? పార్టీలో కుల ప్రభావం ఎలా ఉండేది?

మల్లోజుల: బ్రాహ్మణుడిగా అవకాశం ఉంటే రోజూ స్నానం చేసేవాడిని. దీనిని నా సహచరులు కొందరు 'బ్రాహ్మణ అలవాటు' అని హేళన చేసేవారు. మనదేశంలో కులం కంటే ప్రమాదకరమైన ఆయుధం లేదు.

ప్రశ్న: మీ సతీమణి తారక్క మీకంటే ముందే లొంగిపోయారు. వచ్చే పదేళ్లలో మీరు ఏం చేయాలనుకుంటున్నారు?

మల్లోజుల: దానిని కాలమే నిర్ణయిస్తుంది.

ప్రశ్న: మీరు ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారా?

మల్లోజుల: ఎవరైనా తన లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లటానికి ఎన్నికలను సాధనంగా వాడుకోవచ్చు.

బైరంగఢ్ ఎన్‌కౌంటర్.. 18కి చేరిన మృతుల సంఖ్య

- 16 మంది మావోయిస్టుల మృతదేహాల గుర్తింపు
- వీరందరిపై కోటి 12లక్షల రివార్డు: బస్తర్ ఐజీ

చర్ల/చింతూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బైరంగఢ్ అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో మరణించిన వారి సంఖ్య గురువారం నాటికి 18కి చేరుకుంది. వీరిలో 10 మంది పురుషులు, 8 మంది మహిళలున్నారు. బీజాపూర్, దంతెవాడ జిల్లా సరిహద్దుల్లో బుధవారం జరిగిన ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు, ముగ్గురు డీఆర్‌జీ జవాన్లు మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ఉదయం ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో మరో ఆరుగురు మావోయిస్టుల మృత దేహాలను కేంద్ర బలగాలు గుర్తించాయి. ఘటనా స్థలం నుంచి 19 తుపాకులను స్వాధీనం చేసుకున్నాయి. ఈ సందర్భంగా బస్తర్ ఐజీ సుందర్ రాజ్ మాట్లాడుతూ.. బైరంగఢ్ అడవుల్లో మావోయిస్టులు ఉన్నారన్న సమాచారంతో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా, బలగాలు కూబింగ్ చేపట్టాయన్నారు. మృతి చెందిన మావోయిస్టులను పీఎల్‌జీఏ 2బెటాలియన్‌కు చెందిన సభ్యులుగా గుర్తించామన్నారు. ఇది పోలీసు బలగాలు సాధించిన పెద్ద విజయమని సుందర్ రాజ్ పేర్కొన్నారు. అయితే 18మందిలో 16మంది వివరాలను గుర్తించగా.. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు. అంతకు ముందు.. ఈ ఎదురుకాల్పుల్లో మరణించిన జవాన్ల మృతదేహాలకు బీజాపూర్‌లో పోలీస్ ఉన్నతాధికారులు ఘన నివాళలర్పించారు.

మారేడుమిల్లి, రంపచోడవరం ఎన్‌కౌంటర్లు బూటకం

- హిడ్మాను చిత్రహింసలు పెట్టి హత్య చేశారు
- వికల్ప్ పేరుతో మావోయిస్టు పార్టీ లేఖ విడుదల

మంథని, చర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని మారేడుమిల్లి, రంపచోడవరంలో జరిగిన ఎన్‌కౌంటర్లు బూటకమని మావోయిస్టు పార్టీ ఆరోపించింది. హత్యలపై న్యాయ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గత నెల 27న దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ మీడియా అధికార ప్రతినిధి వికల్ప్ పేరిట లేఖ విడుదల కాగా గురువారం అది వెలుగులోకి వచ్చింది. మావోయిస్టు నేత హిడ్మా ఆయనతో ఉన్న మరో ఐదుగురిని ఏపీ పోలీసులు నవంబరు 15న అరెస్టు చేశారని, మూడు రోజులపాటు చిత్రహింసలు పెట్టి 18న హత్య చేశారని ఆరోపించారు. అలాగే నవంబరు 19న రంపచోడవరం మండలంలో మరో ఏడుగురు మావోయిస్టులు చనిపోయారని, నిరాయుధులైన ఏవోబీ-ఎస్‌జెడ్‌సీ నేత శంకర్‌తోపాటు మరో ఆరుగురిని అరెస్టు చేసి బూటకపు ఎన్‌కౌంటర్‌లో హత్య చేశారన్నారు. ఈ ఎన్‌కౌంటర్లకు విజయవాడకు చెందిన కలప-ఫర్నిచర్ వ్యాపారి, బిల్డర్-సివిల్ కాంట్రాక్టర్, అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఐటీడీఏ కాంట్రాక్టర్, లొంగిపోయిన మావోయిస్టు కోసాల్ కారణమన్నారు. అరెస్టు అయిన వారిలో అగ్రనేతలు దేవ్‌జీ, సంగ్రాం అలియాస్ మల్లా రాజిరెడ్డిలు లేరని స్పష్టం చేశారు.

రేవంత్ వ్యాఖ్యలపై రగడ

- రాహుల్‌గాంధీ స్పందించాలని బీజేపీ డిమాండ్

న్యూఢిల్లీ, డిసెంబర్ 4: హిందూ దేవుళ్ల గురించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ మౌనం వీడి తన వైఖరిని స్పష్టం చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. లేదంటే జీహాద్ పక్షాన నిలిచినట్టే భావించాల్సి వస్తుందని వ్యాఖ్యానించింది. బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా గురువారం పార్లమెంట్ హౌజ్ కాంప్లెక్స్‌లో మాట్లాడుతూ.. రేవంత్ వ్యాఖ్యలు సనాతన ధర్మాన్ని తప్పుబట్టేలా ఉన్నాయన్నారు. తమ పార్టీ నేతలు హిందూ ధర్మంపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినప్పుడు.. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ స్పందించాలని డిమాండ్ చేశారు.

టీచర్లకు టెట్ తప్పనిసరిపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచించాలి

- 2010కి ముందు వారిని మినహాయించాలి: చామల
- సైబర్ ముఠాలపై కఠినచర్యలు తీసుకోండి: అర్వింద్

న్యూఢిల్లీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీచర్లకు టెట్ తప్పనిసరి చేయడంపై కేంద్రం పునరాలోచించాలని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కోరారు. గురువారం లోక్‌సభలో ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను ఆయన ప్రస్తావించారు. 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులకు అకస్మాత్తుగా టెట్ తప్పనిసరనే నియమం పెట్టడంతో లక్షలాది మంది టీచర్లు ఆందోళనలో ఉన్నారన్నారు. గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సార్లు ఉద్యోగం చేసే టీచర్లకు టెట్ నిబంధన విధించబోమని చెప్పారని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడేమో రెండేళ్లలో టెట్ ఉత్తీర్ణత సాధించాలని.. లేనిపక్షంలో ఉద్యోగాల నుంచి వైదొగాలనడం సరికాదన్నారు. తెలుగు రాష్ట్రాల యువతకు థాయ్‌లాండ్‌లో ఉద్యోగాలు కల్పిస్తామని నమ్మబలికి, ఏజెంట్లు రూ.లక్షలు వసూలు చేసి మయన్మార్ సైబర్ నేర శిబిరాలకు విక్రయిస్తున్నారని బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ చెప్పారు. లోక్‌సభలో ఆయన మాట్లాడుతూ.. బాధితులకు ఆహారం పెట్టకుండా తీవ్రంగా హింసిస్తూ చీకటి గదుల్లో నిర్బంధిస్తున్నారని తనకు సమాచారముందన్నారు. అమాయకులతో సైబర్ నేరాలు చేయిస్తున్న ఈ ముఠాలపై కఠిన చర్యలు చేపట్టాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

పదేళ్లలో ఎస్ఎల్‌బీసీని పట్టించుకోని కేసీఆర్

- కమీషన్ల కోసమే కాళేశ్వరం నిర్మాణం: మంత్రి కోమటిరెడ్డి
- దేవరకొండలో సీఎం సభా స్థలం, ఏర్పాట్ల పరిశీలన

దేవరకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం సొరంగమార్గాన్ని కుర్చీ వేసుకుని కూర్చుని తవ్విస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ తన పదేళ్ల పాలనలో ఎస్ఎల్‌బీసీని పట్టించుకోలేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండలో ఈ నెల 6వ తేదీన దేవరకొండలో నిర్వహించనున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతున్నందున ఏర్పాట్లను దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. హెలిప్యాడ్ నిర్మాణంతో పాటు సభ ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం విలేకరులతో మంత్రి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ ఒక్క రేషన్‌కార్డు కూడా మంజూరు చేయలేదని, కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే శ్రీశైలం సొరంగమార్గాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించినట్లు తెలిపారు. కాళేశ్వరంపై పెట్టిన శ్రద్ధ ఎస్ఎల్‌బీసీపై పెడితే ఎప్పుడో పూర్తయ్యేదన్నారు. ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ముందుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు.

మదీనా, షార్జా విమానాలకు బాంబు బెదిరింపులు

శంషాబాద్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మదీనా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న 6ఈ 58 ఇండిగో విమానాన్ని బాంబులతో పేల్చేస్తామని ఉదయం జీఎంఆర్ కస్టమర్ కేర్‌కు మెయిల్ వచ్చింది. భద్రతా సిబ్బంది విమానాన్ని అహ్మదాబాద్‌కు దారి మళ్లించారు. అహ్మదాబాద్‌లో తనిఖీ చేయగా బాంబులేదని నిర్ధారణ కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అలాగే షార్జా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న 6ఈ 1422 విమానాన్ని బాంబులతో పేలుస్తామని జీఎంఆర్ కస్టమర్ కేర్‌కు మెయిల్ వచ్చింది. భద్రతా బలగాలు, విమానం ల్యాండైన తర్వాత ప్రయాణికులను దింపి తనిఖీలు నిర్వహించగా బాంబు లేదని తేలింది.

అందరివాడు రోశయ్య

- కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్
- వీహెచ్‌కు రోశయ్య స్మారక పురస్కారం ప్రదానం



రోశయ్య 4వ వర్ధంతి సభలో ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న స్పీకర్ ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి తదితరులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో సభ్యుల భాష మంచిగా అనిపించడం లేదని, కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు (వీహెచ్) అన్నారు. ప్రతిపక్ష నేతలను దూషించకుండా, హుందాగా విమర్శను వ్యక్తం చేయడంలో ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య ఆదర్శనీయుడని, ఆయన అందరివాడు అని కొనియాడారు. రోశయ్యను ముఖ్యమంత్రిగా కొందరు వ్యతిరేకించిన సమయంలో తాను ఆయన పక్షాన నిలిచి మద్దతు పలికానని చెప్పారు. తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతిలో రోశయ్య నాలుగో వర్ధంతి సభ నిర్వహించారు. రోశయ్య జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడాన్ని వీహెచ్ అభినందించారు. ఈ సందర్భంగా వీహెచ్‌కు రోశయ్య స్మారక పురస్కారాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేతులమీదుగా ప్రదానం చేశారు. రోశయ్య వ్యక్తిత్వం ఈతరానికి స్ఫూర్తిదాయకమని పొన్నం అన్నారు. నూతన శాసన సభ్యులకు ఆయన ఒక మార్గదర్శిఅని ప్రసాద్ కుమార్ అన్నారు. రోశయ్య పెద్ద కుమారుడు శివ సుబ్బారావు పేద విద్యార్థుల చదువుకు ఆర్థిక సాయం అందజేశారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, తెలంగాణ ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఆర్య వైశ్యసంఘాల నేతలు హాజరయ్యారు. కాగా, రోశయ్య సేవలను ఏపీ ప్రభుత్వం విస్మరించిందని చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం రోశయ్య జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించడం ఏపీ ప్రభుత్వానికి చెంపపెట్టు అని అన్నారు.

వచ్చే నెల 11న వరంగల్‌లో

ఓసీల సింహగర్జన సభ

బర్కత్‌పుర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఓసీల సమస్యలను పరిష్కరించాలని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకోవాలని డిమాండ్ చేస్తూ జనవరి 11న వరంగల్‌లో 'చలో ఓసీల సింహగర్జన సభ' నిర్వహిస్తున్నట్లు ఓసీ జేఏసీ నేతలు ప్రకటించారు. లక్ష మందితో కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో సాయంత్రం 3 గంటలకు ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో ఓసీ జేఏసీ జాతీయ చైర్మన్ నల్ల సంజీవరెడ్డి, అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దుబ్బ శ్రీనివాస్ మాట్లాడారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఓసీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు పోటీ పరీక్షల్లో వయో పరిమితిని పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల ఆదాయ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని, టెట్ పరీక్ష అర్హత 90 నుంచి 70 శాతం తగ్గించాలన్నారు. ఈ సందర్భంగా చలో వరంగల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

పేరుమార్పుతో సరా..?

వలసపాలనాకాలపు వాసనలను వదిలించుకొనే పేరిట కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. గవర్నర్ల అధికారిక నివాసం రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మార్చాలని కేంద్రం నుంచి సూచన పేరిట ఆదేశాలు అందడంతో రాష్ట్రాలు ఆ పనిలో ఉన్నాయి. పేరులో ఏమున్నది, మార్చితే పోయేదేమున్నది అనుకోవచ్చును గానీ, అంతా పేరులోనే ఉందని అనుకోబట్టే కేంద్రం ఈ పథకాన్ని ప్రకటించిన మాట నిజం. పేరు మార్చినంతనే ప్రయోజనం లేదు, పేరు కాదు, ముందు బుద్ధి మారాలి, మీ తీరుమారాలి అని తమిళనాడు పాలకుడు స్టాలిన్ వంటివారు గిల్లుతున్నారు కానీ, పేరు మార్పుతో తమకు మరింత మన్నన దక్కుతుందని, రాజకీయ పెన్నిధి సమకూరుతుందని బీజేపీ నమ్ముతోంది.

కొత్త నామఫలకం తీర్చిదిద్దిన ఆ భవనంలో ఇకముందు కూడా ఉండేది, ఉండబోయేది ఆ గవర్నరే. మారింది నివాసం పేరే కానీ ఆ వ్యవస్థ కాదు. గవర్నర్ వ్యవస్థే బ్రిటిష్ వలసపాలనా కాలం అవశేషం. బ్రిటిష్‌కాలంలో గవర్నర్లంటే అధికారం, అహంకారం, అణచివేత, అమానుషత్వాల కలబోత. ఆ వ్యవస్థను మనం ఇంకా కొనసాగించుకుంటూ, మరో పక్క కేవలం పేరుమార్చడం ద్వారా అది ప్రజలపక్షమని సందేశం ఇవ్వదల్చుకున్నట్టు ఉంది. రాజ్ స్థానంలో లోక్ అనడం ద్వారా దీనిని జన భవనంగా జనులందరూ విశ్వసించాలని కేంద్రం ఆలోచన కావచ్చు. బాగానే ఉంది కానీ, జనంతో ప్రత్యక్ష సంబంధం లేని, వారు నేరుగా ఎన్నుకోని, ఇంకా చెప్పాలంటే ప్రజలకు పరిచయం కూడా లేని గవర్నర్ అధికారిక నివాసాన్ని ప్రజాభవనంగా నామకరణం చేయడంలో ఔచిత్యమేమిటని లోకుల అనుమానం.

కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ఇష్టాయిష్టాలకు అనుగుణంగా, తమకు నచ్చినవారిని, సైద్ధాంతికంగా తాము మెచ్చినవారిని ఈ పదవిలో నియమిస్తుంది. వారు మేధావులు కావచ్చు, సకలవిద్యాపారంగతులు కావచ్చును కానీ, ప్రధానంగా ప్రధాని ఎంపికలో తమ మాట వినే లక్షణం పనిచేస్తుంది. ఆయన సూచనమేరకు రాష్ట్రపతి వద్దు కాదు లేదు వంటి సంశయాలకు తావు ఇవ్వకుండా ఆ నియామకాలు జరుపుతారు. రాష్ట్రపతికి నచ్చినంతకాలం గవర్నర్లు పదవిలో ఉంటారు తప్ప, ప్రజలు మెచ్చినంతకాలం కాదు. తన నియామకంతో సంబంధంలేని ప్రజలకు సహజంగానే గవర్నర్ జవాబుదారీ కాదు. వారు తనకు ఓటువేయరు కనుక, నేరుగా బాధ్యత వహించాల్సిన బాధ కూడా లేదు. ఆయన జవాబు చెప్పుకోవాల్సింది రాష్ట్రపతికీ, కట్టుబడాల్సింది రాజ్యాంగానికే. ప్రజలు ఎన్నుకొనే పార్టీలు, అవి ఏర్పాటు చేసే ప్రభుత్వాలు, మంత్రివర్గాలు మాత్రం ప్రజలకు తలవంచాలి, శాసనసభకు జవాబు చెప్పుకోవాలి, ప్రజాభీష్టానికి తలొగ్గాలి. కేవలం సమన్వయకర్తగా, కేంద్రం దూతగా, నామమాత్రపు పాలకుడుగా ఉంటున్న గవర్నర్ ఇంటిని జన భవనం అనడం జనానికి సరైనదిగా కనిపించడం లేదు.


విపక్షాల విమర్శలను అటుంచితే, కేంద్రం ప్రతిపాదించిన ఈ మార్పుకు పౌరసమాజం నుంచి, సామాన్యజనం నుంచి సానుకూల స్పందన రాకపోవడానికి కారణం గవర్నర్ వ్యవస్థ పనితీరు. అస్మదీయులే గవర్నర్లుగా నియమితులవుతారు కనుక డబుల్ ఇంజన్ సర్కార్లకు ఏ సమస్యా రాకపోవడం సహజం. కానీ, విపక్షపార్టీల ఏలుబడిలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లు మరొక ప్రత్యామ్నాయ పాలనావ్యవస్థగా తయారై, ఎలా వ్యవహరిస్తున్నారో చూస్తున్నాం. తమిళనాడు నుంచి పశ్చిమబెంగాల్ వరకూ గవర్నర్లు తామే ప్రతిపక్షంగా, ప్రతిపక్షనాయకుడిలాగా వ్యవహరిస్తూ, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను విమర్శించడం, ఘర్షణపడుతూండటం, బిల్లులను తొక్కిపెట్టి, ఎటూ తేల్చకుండా వదిలేసి పాలనను స్తంభింపచేయడం గమనిస్తున్నాం. 'రాజ్' అన్నది రాజరికాన్నో, బ్రిటిష్ రాజ్యాన్నో ప్రతిబింబిస్తున్నదని, గవర్నర్‌ను అలా చూడటం, ఆయన నివాసాన్ని రాజభవనం అనడం తగదని కేంద్రం అనుకుంటున్నందుకు సంతోషించాల్సిందే. అది పాలకుడి భవనం కాదు, ప్రజల భవనమనీ, ప్రజాసేవకుడి భవనమనీ కేంద్రం సందేశాన్ని ఇవ్వదల్చుకున్నందుకు మెచ్చాల్సిందే. తదనుగుణంగా ఈ అమృతభారతంలో గవర్నర్ వ్యవస్థను ప్రజానుకూల, ప్రజాకేంద్రిత వ్యవస్థగా సరిదిద్దాలి. గవర్నర్ అధికారాలు, విధులు, బాధ్యతల్లో మార్పులేవీ లేకుండా, వారి వ్యవహారశైలి అలాగే కొనసాగుతూంటే, కేవలం ఇంటిపేరుకు జనాన్ని తగిలించినమాత్రాన వారు పండుగ చేసుకోలేరు. 'లోక్‌భవన్' అన్నందుకు ఆ మార్పు కనబడాలి.

ప్రపంచీకరణ రథచక్రం వెనక్కేనా!

మూడున్నర దశాబ్దాల చరిత్రను ఒక్కమాటలో చెప్పుకోవటం కష్టం. కానీ ఆ ఒక్కమాట చుట్టూనే ఎన్నో వివాదాలూ విమర్శలూ విరామం లేకుండా చెలరేగుతూనే ఉన్నాయి. అందరూ వింటున్న పదమే అది. తేలికగా అర్థమయినట్టూ అనిపిస్తుంది. అందరి అనుభవంలోనూ ఉన్నట్టూ కన్పిస్తుంది. కానీ హాస్యం వెనకాల లోతైన గాంభీర్యం దాక్కొన్నట్టుగా ఆ పదం సూచించే పరిణామం ఆషామాషీ అయినది కాదు. గ్లోబలైజేషన్‌గా మనందరమూ పిలిచే ఆ పదం 1990ల నుంచి విపరీతంగా ప్రాచుర్యంలోకి వచ్చినా, అప్పటి నుంచి ఇప్పటి వరకూ ప్రపంచ పరిణామాలన్నీ దాని కేంద్రంగానే జరుగుతూనే ఉన్నా.. ఆ పదం విస్తృతార్థంలోకి వెళ్లగలిగితే వెనుకటి యుగాలు కనపడతాయి. 1990ల్లో బలం పుంజుకుని 2000ల నుంచి రాటుతేలిన గ్లోబలైజేషన్‌తో మనకు తెలిసేది ఒక యుగం చరిత్రే. ప్రపంచం చూసిన అనేక గ్లోబలైజేషన్లలో అది ఒకటి మాత్రమే.

మన అనుభవంలోని గ్లోబలైజేషన్ ఎంతో ప్రగాఢమైంది. కాదనలేం. అన్ని సంస్కృతులనూ అది రోడ్డురోలర్‌లాగా సమం చేసేస్తోంది. అలవాట్లలో, ఆకాంక్షల్లో, కట్టూబొట్టులో, వేషభాషల్లో, విశ్వసించే విలువల్లో ఏకత దిశగా మనుషులను పరుగులు పెట్టిస్తోంది. సొంత సంస్కృతులను కోల్పోతున్న వారిలో ఒక పట్టాన అర్థంకాని అశాంతికీ, అభద్రతకూ కారణమూ అవుతోంది. ఒక మార్పునకు అనుగుణంగా మనుషులు కుదురుకునే లోపలే మరో మార్పును గ్లోబలైజేషన్ వారి నెత్తిమీదకు తీసుకువస్తోంది. ఇవాళ్టి ఉద్యోగం రేపు ఉంటుందో ఊడుతుందో తెలియదు. ఈ ఏడాది టెక్నాలజీ వచ్చే ఏడు బతికి బట్టకట్టగలదా? లేదా? అన్నది ఎవ్వరూ చెప్పలేరు. వ్యక్తులూ, కంపెనీలతో పాటు దేశాలూ ఎగుడుదిగుడులకు గురవుతున్నాయి. అందుకే డీగ్లోబలైజేషన్ కావాలంటూ దాన్ని వ్యతిరేకించే ధోరణులూ పెరుగుతున్నాయి. దేశాల మధ్య వాణిజ్యానికి అడ్డుగోడలు కట్టాలనే వాదనలూ ఎక్కువవుతున్నాయి. మనుషుల రాకపోకలపై కట్టడులూ మొదలవుతున్నాయి. ఇప్పటి గ్లోబలైజేషన్ అర్థంకావాలంటే దీనికంటే ముందు మనుషులను ప్రభావితం చేసిన ఆరు గ్లోబలైజేషన్ల వ్యవహారాలను తెలుసుకోవాలి. మొత్తంగా సప్త ప్రపంచీకరణల మంచి చెడులను స్థూలంగా అర్థం చేసుకుంటేనే భవిష్యత్తు రూపురేఖలు బోధపడతాయి. వర్తమానంలో ఏ అడుగులు వేయాలో తెలుసుకోగలం. కొందరు గాఢంగా కోరుకుంటున్నట్టుగా ప్రపంచీకరణ రథచక్రాన్ని వెనక్కి మళ్లించటం సాధ్యమో, అసాధ్యమో తేలిపోతుంది.

భౌగోళికంగా విడివిడిగా ఉన్న సమాజాల మధ్య వస్తువులూ, భావాలూ, సాంకేతిక పరిజ్ఞానాల మార్పిడులూ, మనుషుల రాకపోకలూ చరిత్ర పొడవునా ఏదో ఒకస్థాయిలో జరుగుతూనే ఉన్నాయి. అందుకే వస్తు, భావాల మార్పిడితో, మనుషుల రాకపోకలతో జన సమూహాల మధ్య సంబంధాలు బలంగా ఏర్పడటమే గ్లోబలైజేషన్ అని స్థూలంగా చెప్పుకోవచ్చు. అయితే అది అన్ని సందర్భాల్లోనూ ప్రశాంతంగా జరగలేదు. ఇచ్చిపుచ్చుకునే రీతిలో మొదలవ్వలేదు. యుద్ధాలు, ఆధిపత్యాలు, అణచివేతలు, కిరాతకాలతో గ్లోబలైజేషన్లు ముడిపడిపోయాయి. రక్తాలూ, కన్నీళ్లతోనే దాని చరిత్ర తడిసింది. సుదీర్ఘ దృష్టితో చూస్తే మానవ సమాజాలన్నీ కాలక్రమంలో ప్రగతిమెట్లు ఎక్కినట్లు కనపడతాయి. కానీ ప్రతి ప్రగతిమెట్టు కిందా కొందరు నలిగిపోయారు. విజేతలూ, పరాజితులూ లేకుండా గ్లోబలైజేషన్ లేదు. సప్తప్రపంచీకరణల్లో ఈ రెండు సమూహాలూ ఉన్నాయి. వేల సంవత్సరాల చరిత్రలో ప్రపంచీకరణలు అనదగిన పరిణామాలను విడివిడిగా వివరించే రచనలు బోలెడు ఉన్నాయి. వాటికి భిన్నంగా ప్రపంచీకరణను ఏడుయుగాలుగా (ద ఏజెస్ ఆఫ్ గ్లోబలైజేషన్) వర్గీకరించి బాగా ప్రాచుర్యంలోకి తీసుకువచ్చింది ప్రముఖ అమెరికన్ ఆర్థికవేత్త జఫరీ డి.శాక్స్ అనే చెప్పుకోవాలి.



ఏడు గ్లోబలైజేషన్లలో మొదటిది పాతరాతియుగం, రెండోది కొత్తరాతియుగం... మూడోది గుర్రాల యుగం. నాలుగోది సంప్రదాయ (క్లాసికల్) యుగం. అయిదోది సముద్రాన్వేషణ యుగం. ఆరోది పారిశ్రామిక యుగం. ఏడోది డిజిటల్ యుగం. పాతరాతియుగంలో మానవ సమూహాలు ఆహార అన్వేషణ కోసం ఒకచోట నుంచి ఇంకోచోటికి వెళ్లటం చాలా సాధారణం. ఆ క్రమంలోనే కొత్త వాతావరణ పరిస్థితులనూ, కొత్త జంతుప్రపంచాన్నీ, కొత్త సూక్ష్మక్రిములనూ, కొత్త వైరస్‌ల లోకాన్నీ ఎదుర్కొన్నారు. వాటి ప్రభావానికీ గురయ్యారు. వారికి తారసపడ్డ నియాండర్తల్, డెనిసోవన్స్ లాంటి పురాతన మానవ జాతులు కొన్ని అంతరించిపోయాయి. కొత్తవారితో యుద్ధాలూ, కొట్లాటలూ జరిగాయి. బతికిబట్టకట్టిన వారితో క్రమేపీ సాంస్కృతిక, శారీరక సంపర్కాలూ జరిగాయి. క్రీస్తుపూర్వం 70వేల సంవత్సరాల నుంచి 10,000 సంవత్సరాల వరకూ అంటే 60 వేల ఏళ్లు మనుషులు రాతి ఆయుధాలతో కొత్త ప్రాంతాలకు సంచరిస్తూనే ఉన్నారు.

> ఏడో ప్రపంచీకరణ యుగం అంతులేని సంపదను సృష్టిస్తోంది. అదే సమయంలో ఆదాయంలో తీవ్ర అసమానతలు, పర్యావరణ విధ్వంసం, అణ్వస్త్ర యుద్ధభూతం అనేవి తీవ్ర అస్థిరతకు కారణం అవుతున్నాయి. ప్రపంచాన్ని ప్రమాదం అంచున నిలబెడుతున్నాయి. వీటిని పరిష్కరించగలిగిన స్థాయిలో సామాజిక, వైజ్ఞానిక అవగాహనా సంపద మనకుంది. ధనిక వర్గాల మితిమీరిన స్వార్థం, లాభకాంక్షలు ఆ సంపదను ఉపేక్షిస్తే భవిష్యత్తు అగమ్యగోచరమే!

అప్పుడే ఒక విచిత్రం జరిగింది. మానవ ప్రమేయం లేకుండానే జరిగిన ఒక పరిణామం రెండో గ్లోబలైజేషన్‌కు కారణమైంది. క్రీస్తుపూర్వం 10,000 ఏళ్ల నాటికి మంచుయుగం ముగిసింది. వాతావరణం వేడెక్కింది. వ్యవసాయానికి అనువైన పరిస్థితులు ఏర్పడ్డాయి. జంతువులను మచ్చికచేసుకోవటం మొదలైంది. ఆహార అన్వేషణ పోయి ఆహార ఉత్పత్తి మొదలైంది. స్థిరనివాసం కోసం గ్రామాలు ఏర్పడ్డాయి. శ్రమవిభజన సర్వసామాన్యమైంది. దీన్నే కొత్తరాతి యుగంగా పిలిచారు. ఇది ఏడువేల ఏళ్లు (క్రీస్తుపూర్వం 10,000 నుంచి 3,000 వరకూ) కొనసాగింది. సుదూర ప్రాంతాలతో వ్యాపారాలు కూడా మొదలయ్యాయి. గ్రామాల మధ్య వస్తుమార్పిడులూ సాధారణమయ్యాయి. వ్యవసాయ గ్రామాలు విస్తరిస్తున్న కొద్దీ ఆదిమతెగలతో యుద్ధాలూ మొదలయ్యాయి. మార్పును అంగీకరించకుండా పాతజీవితాన్ని అంటిపెట్టుకున్న తెగలు ఆ యుద్ధాల్లో అంతరించటమో, దూర ప్రాంతాలకు తరలివెళ్లటమో జరిగింది. కొత్త జీవితాన్ని అంగీకరించిన తెగలు వ్యవసాయాన్ని నేర్చుకుని గ్రామాల్లో కుదురుకున్నాయి.

రాగి, కాంస్యం లాంటి లోహాల వాడకంతో సమాజం కొత్త మలుపు తిరిగిందని మనందరమూ భావిస్తాం. కానీ వాటి కంటే గుర్రాలను మచ్చికచేసుకోవటంతోనే ప్రపంచీకరణ మూడో యుగం మొదలైందని శాక్స్ కొత్త ప్రతిపాదన చేశారు. ఆ అశ్వయుగం క్రీస్తు పూర్వం 3000–1000 వరకూ అంటే రెండువేల ఏళ్లు కొనసాగింది. దీని అర్థం తదనంతర కాలంలో గుర్రాల పాత్ర తగ్గిందని కాదు. వేరే ఇతర పరిణామాలకు ప్రాధాన్యం లభించింది. అశ్వయుగంతో రథాలు వాడుకలోకి వచ్చాయి. గుర్రాలపై సవారీ మొదలైంది. సుదూర ప్రాంతాల మధ్య సమాచార సౌకర్యాలు మెరుగుపడ్డాయి. నేలను దున్నటంలో గుర్రాలు కీలక పాత్రను పోషించాయి. ఇక గుర్రాల ప్రవేశంతో యుద్ధరీతులే మారిపోయాయి. తెగల పెద్దల పెద్దరికం స్థానంలో రాజులు వచ్చి రాజ్యాలు ఏర్పడటంలో గుర్రాలు కీలకపాత్రను పోషించాయి. మంచి గుర్రాలు అందుబాటులో ఉన్న రాజ్యాలు ఇతర ప్రాంతాల మీద ఆధిపత్యాన్ని సంపాదించాయి. గుర్రాలతోనే గ్రామాలపై ప్రభుత్వాలు అదుపు ఆజ్ఞలను సాధించగలిగాయి.

క్రీస్తుపూర్వం 1000 ఏళ్ల నుంచి క్రీస్తుశకం 1500 దాకా కొనసాగిన సంప్రదాయ యుగంలో రాజ్యాలూ సామ్రాజ్యాలూ విజృంభించాయి. ఇప్పుడు ప్రపంచంలో ప్రబలంగా ఉన్న మతాలన్నీ ఈ యుగంలో పుట్టి, బలపడి, విస్తరించినవే. తత్వశాస్త్రాలు, రాజకీయ సిద్ధాంతాలు అప్పుడే తలెత్తాయి. రాజరికాలు నిలదొక్కుకునేందుకు అవి ఎంతగానో తోడ్పడ్డాయి. రాజులు దైవాంశసంభూతులనే భావాలకు ప్రాచుర్యం అలాగే వచ్చింది. సామ్రాజ్యాలతో విడివిడి సమాజాల మధ్య సంబంధాలు బలపడి సంస్కృతులు విపరీతంగా ప్రభావితం అయ్యాయి. మధ్య ప్రాచ్యంలో పుట్టిన క్రైస్తవం యూరప్ అంతటా విస్తరించటమూ అందులో భాగమే. ఇస్లాం ఆసియా, ఆఫ్రికాలకు శరవేగంగా పాకింది. బౌద్ధం భారత్‌ను దాటి తూర్పు, ఆగ్నేయాసియాలను విపరీతంగా ప్రభావితం చేసింది. సముద్రయాన యుగంలో (1500–1800) యూరప్ దేశాలు అమెరికా ఖండాన్ని కనుగొంటమే కాదు ఆసియా, ఆఫ్రికా దేశాలపై ఆధిపత్యాన్ని సాధించాయి. బానిసలుగా లక్షలాది ఆఫ్రికన్లను అమెరికాకు తరలించారు. ఖండాతర యుద్ధాలు మొదలయ్యాయి. యూరోపియన్లు అంటించిన జబ్బులతో, చేసిన యుద్ధాలతో అమెరికా ఖండంలో స్థానికజాతులన్నీ అంతర్థానమైపోయాయి. బలవంతపు వ్యాపారలావాదేవీలు అన్నిచోట్లా మొదలయ్యాయి. చైనా, భారత్ లాంటి సుదీర్ఘ నాగరికత గల దేశాల ప్రాబల్యం క్షీణించింది. తుపాకీ, మరఫిరంగులు, శతఘ్నుల దాటికి ఆసియా, ఆఫ్రికాలు కకావికలయ్యాయి.



■ రాహుల్ కుమార్

పారిశ్రామిక యుగంతో (1800–2000) ప్రపంచమే కుగ్రామంగా మారిపోయింది. బొగ్గు వినియోగంతో మొదలైన పారిశ్రామిక విప్లవం ఆవిరియంత్రంతో వడివడిగా అడుగులు వేసి.. మోటారు వాహనాలు, కరెంటు, రైళ్లు, విమానాలు, టెలిఫోన్లు, అత్యాధునిక యుద్ధ ఆయుధాల వినియోగంతో ప్రపంచ చిత్రాన్నే మార్చివేసింది. రెండు వందల ఏళ్ల చరిత్రలో రెండు దేశాలకు (బ్రిటన్, అమెరికా) అది ప్రపంచ ఆధిపత్యాన్ని కట్టబెట్టింది. దానికి వ్యతిరేకంగా ఉద్యమాలు తలెత్తాయి. వలసపాలనలు అంతమయ్యాయి. ఆ రెండు వందల ఏళ్లలోనే ప్రపంచ జనాభా విపరీతంగా పెరిగింది. దేశాల మధ్య అసమానతలు గతంలో ఎన్నడూ లేనంతగా తలెత్తాయి. పర్యావరణ విధ్వంసమూ పతాకస్థాయికి చేరింది.

> యుద్ధాలు, ఆధిపత్యాలు, అణచివేతలు, కిరాతకాలతో గ్లోబలైజేషన్లు ముడిపడిపోయాయి. రక్తాలూ, కన్నీళ్లతోనే దాని చరిత్ర తడిసింది. మానవ సమాజాలన్నీ కాలక్రమంలో ప్రగతిమెట్లు ఎక్కినట్లు కనపడతాయి. కానీ ప్రతి ప్రగతిమెట్టు కిందా కొందరు నలిగిపోయారు. విజేతలూ, పరాజితులూ లేకుండా గ్లోబలైజేషన్ లేదు. సప్తప్రపంచీకరణల్లో ఈ రెండు సమూహాలూ ఉన్నాయి.

2000 సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ ఉన్నది డిజిటల్ యుగం. కంప్యూటర్లు, ఇంటర్‌నెట్, మొబైల్స్, కృత్రిమమేధతో దేశాల మధ్యా, దేశాల లోపలా సంబంధాలు, పరస్పర ఆధారితాలు పెరిగిపోయాయి. బొగ్గు స్థానంలో సౌర, పవన విద్యుత్తు ప్రాధాన్యం పెరుగుతోంది. ఏ దేశమూ మరో దేశంపై ఆధారపడకుండా మనగలిగే పరిస్థితి వచ్చేసింది. ఏకదేశ ఆధిపత్యానికి కాలం చెల్లుతోంది. శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానాల మీద గుత్తాధిపత్యం కొనసాగించే పరిస్థితి కనపడటం లేదు. అమెరికాను అన్నింటా సవాల్ చేస్తున్న చైనా పురోగతే దీనికి నిదర్శనం. ప్రపంచంపై ఆధిపత్యాన్ని చెలాయించిన అమెరికా, బ్రిటన్‌లకు ఉన్న అనుకూల పరిస్థితులు చైనాకు ఎన్నడూ లేవు. దోపిడీ చేయటానికి బ్రిటన్‌లాగా వలసరాజ్యాల్లేవు. అమెరికాకు లభించిన ఆఫ్రికా బానిసల శ్రమ చైనాకు లేదు. విలువైన వనరులున్న సువిశాల భూభాగాన్ని స్థానిక జాతుల నుంచి అమెరికాలాగా దక్కించుకునే అవకాశమూ రాలేదు. అయినా చైనా అమెరికాను అన్నింటా దాటిపోయే పరిస్థితే కనిపిస్తోంది.

ఏడో ప్రపంచీకరణ యుగం అంతులేని సంపదను సృష్టిస్తోంది. అదే సమయంలో ఆదాయంలో తీవ్ర అసమానతలు, పర్యావరణ విధ్వంసం, అణ్వస్త్ర యుద్ధభూతం అనేవి తీవ్ర అస్థిరతకు కారణం అవుతున్నాయి. ప్రపంచాన్ని ప్రమాదం అంచున నిలబెడుతున్నాయి. వీటిని పరిష్కరించగలిగిన స్థాయిలో సామాజిక, వైజ్ఞానిక అవగాహనా సంపద మనకుంది. ధనిక వర్గాల మితిమీరిన స్వార్థం, లాభకాంక్షలు ఆ సంపదను ఉపేక్షిస్తే భవిష్యత్తు అగమ్యగోచరమే! ప్రపంచీకరణ రథాన్ని వెనక్కితిప్పలేం. కానీ నిర్లక్ష్యం వహించి, యథాతథస్థితిని కొనసాగిస్తే దాని రథచక్రాల కింద అందరమూ నలిగిపోయే ప్రమాదాన్నీ కొట్టేయలేం!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

> సామాజిక న్యాయం అనేది నినాదం కాదు, ఆచరణీయ విధానం. అభివృద్ధి, సంక్షేమం, సాంస్కృతిక వైభవం... ఇలా బహుముఖాలుగా రేవంత్‌రెడ్డి ప్రజాపాలన సాగుతోంది. అధికారం అనేది ఆధిపత్యం కాదు, బాధ్యత అని చాటిచెప్పిన ఘనత ఈ రెండేళ్ళ పాలనకే దక్కుతుంది.

ప్రజాపథంలో రెండేళ్ల పాలన

తెలంగాణ గడ్డపై దశాబ్దాల రాజకీయ చరిత్రను తిరగరాస్తూ, సామాన్యుడి స్వప్నాలకు సాక్షాత్కారంగా, ప్రజాస్వామ్య స్వేచ్ఛకు చిరునామాగా నిలిచిన నాయకుడు రేవంత్‌రెడ్డి. ఆయన ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన ఈ రెండేళ్ళ ప్రయాణం కేవలం ఒక కాలమానం కాదు, అది తెలంగాణ అస్తిత్వ ఆత్మగౌరవానికి, ప్రజాపాలనకు పట్టం కట్టిన ఒక చారిత్రక ఘట్టం.

ప్రగతి భవన్ చుట్టూ ఉన్న ఇనుప కంచెలను తొలగించి, దానికి 'ప్రజాభవన్'గా నామకరణం చేయడంతోనే ఆయన పాలనా విధానం ఎటువైపు ఉన్నదో స్పష్టమైంది. సామాన్యుడు తన గోడు చెప్పుకోవడానికి రోజుల తరబడి వేచి చూసే పరిస్థితిని మార్చి, 'ప్రజావాణి' ద్వారా ప్రజల సమస్యలను నేరుగా వినే సంస్కృతికి ఆయన శ్రీకారం చుట్టారు. అధికారం అనేది ఆధిపత్యం కాదు, బాధ్యత అని చాటిచెప్పిన ఘనత ఈ రెండేళ్ళ పాలనకే దక్కుతుంది.

'ఆడబిడ్డ కంట కన్నీరు తుడిస్తేనే ఆ ఇల్లు సిరులొలికే సామ్రాజ్యం అవుతుంది' అని నమ్మిన రేవంత్‌రెడ్డి మహిళల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించి, వారి ఆర్థిక స్వాతంత్ర్యానికి బాటలు వేశారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందించి వంటింటి కష్టాలు తీర్చారు. నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ ద్వారా భరోసా కల్పించడం మాత్రమే గాక పారదర్శకంగా నియామకాల ప్రక్రియలు చేపట్టడం రేవంత్‌రెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనం. రైతు రుణమాఫీ, రైతు భరోసా పథకాలతో వ్యవసాయాన్ని పండుగలా మార్చారు. 24 గంటల ఉచిత విద్యుత్, సాగునీటి పారుదలపై ప్రత్యేక దృష్టి సారించి రైతన్నకు వెన్నుదన్నుగా నిలిచారు. ఇందిరమ్మ ఇళ్ళ పథకాన్ని పునరుద్ధరించి, ప్రతి పేదవాడికి గూడు కల్పించే దిశగా ఈ రెండేళ్ళలో వడివడిగా అడుగులు వేశారు.

తెలంగాణ ఉద్యమ ఊపిరిగా నిలిచిన 'జయ జయ హే తెలంగాణ.. జననీ జయకేతనం' గీతాన్ని అధికారిక రాష్ట్ర గీతంగా ప్రకటించడం గర్వించదగ్గ అంశం. ఈ పాట నాలుగుకోట్ల తెలంగాణ బిడ్డల గుండె చప్పుడని ఆయన బలంగా విశ్వసించి, ఎలాంటి తాత్సారం లేకుండా ఈ గీతానికి రాజముద్ర వేసి, సకల ప్రభుత్వ లాంఛనాలతో ఆవిష్కరించారు. అందెశ్రీ గీతానికి పట్టం కట్టడం ద్వారా రేవంత్‌రెడ్డి సాహిత్యానికి, కళాకారులకు ఇస్తున్న విలువను చాటిచెప్పారు. అందెశ్రీ ఆకస్మికంగా మరణించినప్పుడు అంతిమయాత్రలో పాడె మోయటం ద్వారా ముఖ్యమంత్రి ఒక కవికి ఇవ్వగల అత్యున్నత గౌరవాన్ని అందించారు, సాహితీలోకంలోనూ, సమాజంలోనూ రేవంత్‌రెడ్డి చెరగని ముద్ర వేశారు. తెలంగాణ ఉద్యమ ధ్రువతార గద్దర్ మరణించినప్పుడు రేవంత్‌రెడ్డి స్పందించిన తీరు ప్రతి ఒక్కరినీ కదిలించింది. గద్దర్ పార్థివ దేహానికి అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగేలా ఒత్తిడి పెంచి చేయించారు. ఆ తర్వాత ఆయన స్మారకార్థం 'గద్దర్ అవార్డులు' నెలకొల్పి ఉద్యమకారుల త్యాగాలను ఎన్నటికీ మరువనని నిరూపించుకున్నారు.



రేవంత్‌రెడ్డి పాలన సంక్షేమానికే పరిమితం కాలేదు; అది సమాజంలోని అట్టడుగు వర్గాలకు ఆత్మగౌరవాన్ని, విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించే దిశగా సాగింది. 'చదువు సామాజిక ఆస్తి, రిజర్వేషన్ సామాజిక హక్కు' అనే సూత్రాన్ని ఆయన ఆచరణలో అమలుపరిచి చూపారు. గత దశాబ్ద కాలంగా నిస్తేజంగా మారిన తెలంగాణ విశ్వవిద్యాలయాలకు కొత్త ఊపిరి పోశారు. ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న వైస్ చాన్స్‌లర్ పోస్టులను భర్తీ చేసి, విద్యా వ్యవస్థలో జవాబుదారీతనాన్ని పెంచారు. అట్టడుగు వర్గాలకు చెందిన విద్యావేత్తలకు యూనివర్సిటీల పగ్గాలు అప్పగించారు. పరిశోధనలకు పెద్దపీట వేస్తూ, తెలంగాణ విద్యార్థులు ప్రపంచంతో పోటీపడేలా తీర్చిదిద్దారు. వెయ్యి కోట్లతో ఉస్మానియా యూనివర్సిటీ దశ దిశనే మార్చే గొప్ప సంకల్పానికి శ్రీకారం చుట్టారు.

మాదిగ సామాజిక వర్గం దశాబ్దాలుగా చేస్తున్న 'ఎస్సీ వర్గీకరణ' పోరాటానికి రేవంత్‌రెడ్డి పరిపూర్ణ న్యాయం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే కాలయాపన చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేసి, వర్గీకరణ అమలుకు అంకితభావంతో పనిచేశారు. ఉద్యోగ నియామకాల్లో అత్యంత వెనుకబడిన దళిత బిడ్డలకు న్యాయం చేకూర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. దేశానికే ఆదర్శంగా నిలిచేలా తెలంగాణలో 'సమగ్ర కుల గణన' చేపట్టిన ఘనత రేవంత్‌రెడ్డిది. 'ఎంతమంది జనాభా ఉంటే, వారికి అంత వాటా దక్కాలి' (జిత్నీ ఆబాదీ ఉత్నా హక్) అనే రాహుల్‌గాంధీ మాటను తుచ తప్పకుండా అమలు చేశారు. కులగణన బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచడానికి వేసిన బలమైన పునాది. బీసీల రిజర్వేషన్లను 42శాతానికి పెంచే దిశగా అడుగులు వేస్తూ, బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన 'బహుజన బంధువు' రేవంత్‌రెడ్డి.

విశ్వవిద్యాలయాల్లో విద్యా కుసుమాలు వికసించేలా చేయడం నుండి, ఎస్సీ వర్గీకరణ ద్వారా అంత్యోదయానికి (చివరి మనిషికి) న్యాయం చేయడం వరకు, కులగణన ద్వారా బీసీలకు రాజ్యాధికారంలో వాటా కల్పించడం వరకు ఈ రెండేళ్ళలో రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలు సువర్ణాక్షరాలతో లిఖించదగ్గవి. ఆయన పాలనలో సామాజిక న్యాయం అనేది నినాదం కాదు, ఆచరణీయ విధానం. అభివృద్ధి, సంక్షేమం, సాంస్కృతిక వైభవం... ఇలా బహుముఖాలుగా రేవంత్‌రెడ్డి ప్రజాపాలన సాగుతోంది. ప్రజల దీవెనలతో ఇది పదికాలాలు సాగాలి.

• చనగాని దయాకర్
టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

ముఖ్యమంత్రి ఓయూకు వస్తున్న వేళ

నూట ఎనిమిది సంవత్సరాల ఓయూ సమాజ మార్పులతో పాటు, విద్యారంగంలో వచ్చిన అనేక మార్పులను తనలో ఇముడ్చుకున్నది. ప్రకృతి, జీవ, సామాజిక శాస్త్రాలలోనే కాకుండా వివిధ సాహిత్యాంశాలకు వేదికగా ఉండి సమాజంతో సంవాదం నడిపింది. అధ్యయనం, పరిశోధన మాత్రమే కాకుండా ఇక్కడి అధ్యాపకులు, విద్యార్థులు తమ సామాజిక బాధ్యత పట్ల కూడా నిబద్ధతతో ఉండటం చరిత్ర నిరూపించిన సత్యం. నిజాం వ్యతిరేక పోరాటానికి, జాతీయోద్యమానికి, ప్రత్యేక తెలంగాణ సాధనకు, నక్సల్బరీ మేఘ గర్జనకు, అస్తిత్వ వసంత గానాలకు కావలసిన మేధోపరమైన, నిర్మాణపరమైన అవసరాలను ఓయూ తీర్చింది. భారతదేశంలో ఏ విశ్వవిద్యాలయానికీ దక్కని అరుదైన ఘనతను ఉస్మానియా సొంతం చేసుకున్నది. సమాజానికి, విశ్వవిద్యాలయానికి ఉండవలసిన సజీవ సంబంధాన్ని కొనసాగిస్తూ, సమాజం ఎదుర్కొన్న రాజకీయార్థిక, సాంస్కృతిక సవాళ్లకు పరిష్కార మార్గాన్ని చూపింది. అపురూపమైన నాయకత్వాన్ని రూపొందించి, ఈ దేశానికి అందించిన తొలితరం విద్యాలయం ఓయూనే.

ఇంతటి కీర్తి కలిగిన ఓయూ చరిత్ర గత మూడు దశాబ్దాల నుంచి మసకబారుతూ వస్తోంది. ప్రపంచీకరణ విసిరిన సవాళ్లను తట్టుకుని నిలబడలేక తాను నిర్దేశించుకున్న ప్రమాణాలు ప్రశ్నార్థకమయ్యే స్థితికి చేరుకుంది. సరైన నిధులు లేక, ఉత్తమమైన అధ్యాపకుల నియామకం జరగక విద్యాసంబంధ కార్యకలాపాలకు అనేక పరిమితులు ఏర్పడ్డాయి. తెలివైన విద్యార్థులు విద్యాభ్యాసం కోసం ప్రవేశిస్తున్నా వారి అవసరాలను తీర్చే బోధన, పరిశోధన కుంటుపడింది. ఫలితంగా విద్యార్థులు శాస్త్రాల అధ్యయనం కంటే పోటీ పరీక్షలకు సిద్ధం కావడానికే మొగ్గు చూపుతున్నారు. రాను రాను ఓయూ షెల్టర్ జోన్‌గా మారిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. విద్యా సంబంధం లేని కార్యకలాపాలకు ఉస్మానియా కేంద్రంగా మారింది. కొందరు అధ్యాపకులలో కూడా వృత్తి నిబద్ధత, సామాజిక బాధ్యత లోపించి అలసత్వం ప్రవేశించింది. మరికొందరు విశ్వవిద్యాలయాన్ని తమ రాజకీయ కార్యకలాపాలకు కేంద్రంగా ఉపయోగించుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. ప్రతిపక్ష పార్టీలు తమ అసమ్మతిని వ్యక్తం చేయడానికి ఈ విద్యాలయాన్ని వనరుగా వాడుకుంటున్నారు. సైద్ధాంతిక వాదన, సంవాదం, చైతన్యం ఉండవలసిన చోట రాజకీయ నాయకుల, కొందరు ప్రైవేట్ వ్యక్తుల బర్త్‌డే వేడుకలు నిర్వహించుకునే చోటుగా ఆర్ట్స్ కళాశాల మారిపోయింది. బయటి వ్యక్తులు ఎలాంటి పరిమితులు లేకుండా క్యాంపస్ లోపలికి ప్రవేశించి విద్యా సంబంధ కార్యకలాపాలకు విఘాతం కలిగిస్తున్నారు. విద్యార్థుల భద్రతకు సవాళ్లు విసురుతున్నారు. కొందరు మతవాదులు కూడా ఓయూను తమ కార్యకలాపాలకు కేంద్రంగా మలుచుకుంటున్నారు. దీంతో వేలాది మంది విద్యార్థులు, విద్యార్థినులు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓయూ పరిసరాల్లో నడుచుకుంటూ వెళ్లటానికి భయపడుతున్నారు. ఆకతాయిల ఈవ్‌టీజింగ్‌ను ఎదుర్కొంటున్నారు.

> ఈ నెల 7న ఓయూలో జరగబోయే సభ మేధో సమ్మేళనంగా ఉండాలి. హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి యూనివర్సిటీ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి. గతంలో ఉస్మానియాకు కేటాయించిన రూ. వెయ్యికోట్ల నిధులకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడకపోతే పౌరసమాజం, విశ్వవిద్యాలయ సమూహాల నుంచి అనేక ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుంది.



ఈ స్థితిలో, ఘన చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని కాపాడుకోవాల్సిన సామాజిక బాధ్యత పౌరసమాజం మీద ఉన్నది. తెలంగాణ సమాజానికి జ్ఞానాన్ని అందించడానికి ఉన్న ప్రధాన విశ్వవిద్యాలయం ఓయూనే. ప్రైవేట్ విశ్వవిద్యాలయాలకు దీటుగా ఉస్మానియాను నిలబెట్టాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 25న టాగోర్ ఆడిటోరియంలో ప్రకటించినట్లుగా ఓయూను ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్ స్థాయిలో రూపొందించాలంటే స్వయంగా ఆయనే చొరవ తీసుకోవాలి. కొందరు అధికారులు, కొన్ని కమిటీలు, మరికొందరు వ్యక్తులు పూనుకుంటే సమస్యలు పరిష్కారమయ్యే స్థాయిలో ఓయూ లేదు. సమాజం నుంచి అనేక పరిమితులు ఎదుర్కొని, తపనతో విద్యనార్జించి వీసీ స్థాయికి ఎదిగిన ప్రొఫెసర్ కుమార్ మొలుగరం ఓయూను సరిదిద్దడానికి చేస్తున్న ప్రయత్నానికి ప్రభుత్వం వైపు నుంచి ఆదాన, ప్రదానాలు ఉండాలి. అట్టడుగు సామాజిక సమూహం నుంచి ఎదిగిన వ్యక్తులకు అవకాశం లభించినప్పుడు వ్యవస్థలను రక్షించడానికి ఎంతటి నిబద్ధతతో పనిచేస్తున్నారో వర్తమాన ముఖచిత్రం అద్దంపడుతోంది. విద్యాసంబంధం లేని అధ్యాపకుల, విద్యార్థుల, రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గకుండా ఈ విశ్వవిద్యాలయాన్ని కాపాడటమే అధికారులకు మొదటి ప్రాధాన్యంగా మారింది. ప్రతి వ్యవస్థలోనూ అరాచక శక్తులు ఉంటాయి. కానీ, వాటికి పరిమితులు విధించడం వల్ల రాజ్యాంగబద్ధ ప్రజా వ్యవస్థలను రక్షించగలం.

డిసెంబర్ 7న ఓయూలో జరగబోయే సభ కాంగ్రెస్ ప్రజాపాలన ప్రచారానికి ముగింపు పలికే సమావేశంగా మారకూడదు. ఇదొక మేధో సమ్మేళనంగా ఉండాలి. అనేక సవాళ్లను ఎదుర్కొంటూ, సమస్యల సుడిగుండంలో ఉన్న ఉన్నత విద్యారంగానికి విజన్ ప్రకటించే కార్యక్రమంగా ఉండాలి. గతంలో ఉస్మానియాకు ముఖ్యమంత్రి కేటాయించిన రూ. వెయ్యికోట్ల నిధులకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడకపోతే పౌరసమాజం, విశ్వవిద్యాలయ సమూహాల నుంచి అనేక ప్రశ్నలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఆ డబ్బులతో హాస్టళ్లు, తరగతి గదులు, కార్యాలయాలు, పరిశోధన కేంద్రాలు, సమావేశ మందిరాలు నిర్మాణం చేయడం వరకే పరిమితం కాకుండా బోధనా పరికరాలను సమకూర్చడం మీద సీఎం దృష్టి పెట్టాలి. ఓయూలో ఖాళీగా ఉన్న వెయ్యి అధ్యాపక పోస్టులను ఎలాంటి రాజకీయ జోక్యం, బంధుప్రీతి లేకుండా– ప్రతిభ కలిగిన వారితోనే భర్తీ చేయాలి. తెలంగాణ సమాజంలో యువత నైపుణ్య లేమితో కొట్టుమిట్టాడుతోంది. కాబట్టి స్కిల్డ్ బేస్డ్ విద్యకు కావాల్సిన సిలబస్‌లను రూపొందించాలి. ఓయూ చుట్టూ పటిష్ఠమైన ప్రహరీని నిర్మించి, క్లోజ్డ్ క్యాంపస్‌గా మార్చి విద్యార్థులకు భద్రత కల్పించాలి. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సీపీఎస్ సమస్యను పరిష్కరించాలి. ఓయూలో కాంట్రాక్టు, పార్ట్ టైం అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగులు తమ సమస్యకు సీఎం తార్కిక ముగింపును ఇవ్వాలని ఆశిస్తున్నారు. తెలంగాణ నలుమూలల నుంచి ప్రతిభావంతులైన విద్యార్థులు ఓయూకు విద్యనభ్యసించడానికి వస్తున్నారు. వారి తెలివితేటలు ప్రపంచంతో పోటీపడాలంటే నాణ్యమైన బోధన, పరిశోధన జరగాలి. పీజీ విద్యార్థులకు నెలకు మూడువేల రూపాయల ప్రోత్సాహకం, పరిశోధకులకు పదివేల ఫెలోషిప్ అందిస్తే వారిలో నిబిడీకృతమైన ప్రతిభ వెల్లివిరియడానికి అవకాశం ఉంటుంది. ఆర్ట్స్ కళాశాల ముందు రాజకీయ నాయకుల ఫొటోలకు క్షీరాభిషేకాలు, బర్త్‌డే కేక్ కటింగులు, టపాకాయలు కాల్చడం లాంటి విద్యేతర కార్యకలాపాలు జరపకూడదని తమ అనుచర గణానికి అధికార పార్టీ నుంచే గట్టి సందేశం వెళ్లాలి. ఓయూ అభివృద్ధి అంటే కేవలం నిధుల కేటాయింపు విషయంగా కాకుండా తెలంగాణ విజ్ఞాన భాండాగారంగా భావించాలి.

■ ప్రొఫెసర్ సి. కాశీం
ప్రిన్సిపాల్, ఆర్ట్స్ కళాశాల, ఓయూ

చివరకు మిగిలేది ?



- గత ఎన్నికలకన్నా రెండింతలు పెరిగే పరిస్థితులు
- మద్యం, విందులకే ఎక్కువ
- కనీస ఖర్చు రూ.10 లక్షలపైనే..
- మేజర్ పంచాయతీల్లో రూ.50 లక్షల వరకు..
- రెండు, మూడో విడత అభ్యర్థులపై మరింత భారం
- గెలుపే లక్ష్యంగా ఎంత వెచ్చించేందుకైనా సిద్ధం
- జనరల్ స్థానాల్లో అపరిమితంగా వ్యయం

ఖర్చు తడిసి మోపెడు..

భరించేదెలా.. అని అభ్యర్థుల మల్లగుల్లాలు



హనుమకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థుల ప్రచారం ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. సర్పంచ్ పదవులపై దృష్టిసారించిన ఆశావహులు చాలా రోజుల ముందు నుంచే ఓటర్లను, మద్దతుదారులను ప్రసన్నం చేసుకోవడానికి ఇప్పటికే కొంత మేరకు ఖర్చు పెట్టారు. అభ్యర్థులు గెలుపు కోసం చావోరేవో తేల్చుకోవడానికి సిద్ధపడుతున్నారు. ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు ఎంతఖర్చయినా పెట్టేందుకు సైతం పూనుకుంటున్నారు. అయితే అంగబలం, ఆర్థిక బలం ఉన్నవారు ఖర్చు విషయంలో వెనుకాడకపోవచ్చుకానీ పేద, మధ్య తరగతి అభ్యర్థుల పరిస్థితే ఇబ్బందికరంగా మారనున్నది. ఆస్తులు అమ్మి ఖర్చు చేసే స్థితిలో లేని వీరికి డబ్బులు జమ చేసుకోవడం, పెద్దఎత్తున ప్రచారానికి ఖర్చు పెట్టడం సాధ్యం కాక ఏం చేయాలో పాలుపోని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

చేతులెత్తేస్తున్న నేతలు

పంచాయతీ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగటం లేదు. కనుక అభ్యర్థులు ఏ పార్టీ నుంచి ప్రత్యక్షంగా నిధులు అడగలేరు. అధికార, ప్రతి పక్ష పార్టీల ప్రోత్సాహంతో బరిలో నిలిచే అభ్యర్థులకు కూడా పెద్దగా నిధులు సమకూరే (మిగతా 6లో..)



నర్సంపేటలోని మెడికల్ కళాశాల వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బహిరంగ సభకు ఏర్పాట్లు జరుగుతున్న దృశ్యం

నేడు నర్సంపేటకు
సీఎం రాక

- రూ.531 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మెడికల్ కళాశాల సమీపంలో బహిరంగ సభ
- ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎమ్మెల్యే దొంతి
- సీఎం హోదాలో తొలిసారిగా నర్సంపేటకు రేవంత్‌రెడ్డి



నర్సంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ కేంద్రానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శుక్రవారం రానున్నారు. నియోజకవర్గ పరిధిలో రూ.531 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఆయన పట్టణ శివారులోని మెడికల్ కళాశాల సమీపంలో శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం అక్కడే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. పట్టణంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ బిల్డింగ్, (మిగతా 6లో..)

ఇదీ షెడ్యూల్

- మధ్యాహ్నం 1.15 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరుతారు.
- 2 గంటలకు నర్సంపేటలోని బంజారాభవన్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 2.15 గంటల నుంచి 3.55 వరకు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం బహిరంసభలో పాల్గొంటారు.
- 4 గంటలకు హెలీకాప్టర్‌లో తిరుగుప్రయాణం అవుతారు.



ముల్కనూర్ బాద్‌షా
ఎవరో?

సర్పంచ్ బరి

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ హోరాహోరీ
- మంత్రి పొన్నంకు ప్రతిష్ఠాత్మకం
- 11న తేలనున్న భవితవ్యం



జాలి ప్రమోద్ రెడ్డి (కాంగ్రెస్)
దార్న శ్రీనివాస్ (బీఆర్‌ఎస్)

భీమదేవరపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవిని ఎవరు గెలుచుకుంటారోనని మండల ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మండలంలోని ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీ దక్కించుకోవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీలో 10వేలకు పైగా జనాభా ఉండగా, 7623మంది ఓటర్లు ఉన్నారు. 14 వార్డులు ఉండగా, మాడ్గుల కవిత, ముడిక బిక్షపతిలు ఏకగ్రీవంగా వార్డు మెంబర్లుగా ఎన్నికయ్యారు. మిగితా 12 వార్డుల్లో హోరాహోరీగా పోరు సాగుతోంది. నామినేషన్లు కాంగ్రెస్, బీఆర్ఎస్ నుంచి సర్పంచ్ పదవి కోసం ఆశవాహులు అనేక మంది పోటీ పడ్డారు. కానీ మంత్రి పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ అభ్యర్థిగా (మిగతా 8లో..)

ఉప సర్పంచ్ పదవి
ఉత్తదేమీ కాదు!

చెక్‌పవర్ ఉండడమే కారణం

రిజర్వేషన్ కలిసిరాని చోట మారుతున్న వ్యూహాలు 7

జోరుగా నామినేషన్లు..

- రెండో రోజు సర్పంచ్‌కు 100, వార్డు సభ్యుల స్థానాలకు 414
- దాఖలుకు నేడే చివరి రోజు
- రసవత్తరంగా మారుతున్న 3వ విడత పోరు

హనుమకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మూడో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి గురువారం సర్పంచ్,వార్డు సభ్యుల స్థానాలకు జోరుగా నామినేషన్లు దాఖలయ్యాయి. శాయంపేట, ఆత్మకూరు, నడికూడ, దామెర మండలాల్లోని మొత్తం 68 సర్పంచ్, 634 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు వేయడానికి అభ్యర్థులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు దాఖలు చేశారు. సర్పంచ్ స్థానాలకు (మిగతా 8లో..)

మూడో విడత నామినేషన్ కౌంటర్ | రెండో రోజు 04-12-25

మండలం పేరు	సర్పంచ్ స్థానాలు	దాఖలైన నామినేషన్లు	వార్డు సభ్యులు	దాఖలైన నామినేషన్లు
దామెర	14	19 (31)	132	96 (107)
శాయంపేట	24	42 (72)	212	143 (167)
నడికూడ	14	19 (31)	138	89 (120)
ఆత్మకూరు	16	24 (32)	152	92 (112)

నోట్:(బ్రాకెట్)లో ఇప్పటి వరకు దాఖలైన మొత్తం నామినేషన్ల సంఖ్య

అప్పీళ్ల స్వీకరణ

రెండో విడత ఎన్నికల నామినేషన్ల దాఖలు బుధవారంతో ముగిసింది. రెండో విడత ఎన్నికలు జరిగే ధర్మసాగర్, హసన్‌పర్తి, ఐనవోలు, వేలేరు, పరకాల మండలాల పరిధిలోని మొత్తం 73 గ్రామ పంచాయతీలకు 402 నామినేషన్లు, 694 వార్డుసభ్యుల స్థానాలకు 1,795 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటికి సంబంధించి ఈ రోజు అప్పీళ్లను స్వీకరించారు. వీటిని శుక్రవారం పరిష్కరిస్తారు. ఈనెల 6న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు.

'పేట'లో సమస్యల మేట

సెకండ్ గ్రేడ్ మునిసిపాలిటీగా ఎదిగినా నర్సంపేటలో వెల్లివిరియని ప్రగతి



- అంతర్గత రోడ్లు అధ్వానం.. అస్తవ్యస్తంగా డ్రైనేజీలు
- పట్టణ ప్రజలను పీడిస్తున్న తాగునీటి ఎద్దడి
- కలగా మిగిలిన మినీ పార్కు.. అండర్ డ్రైనేజీ నిర్మాణం
- డీ ఫ్లోరైడ్ ప్రాజెక్టును వినియోగంలోకి తెస్తే తాగునీటి సమస్యకు పరిష్కారం
- సీఎంకు పలు సమస్యలతో పోరుగడ్డ స్వాగతం

7

ముందస్తు మొక్కుల సందడి

- మేడారానికి వేల సంఖ్యలో భక్తుల రాక
- గోవిందరాజు గద్దె స్థల చలనానికి ప్రత్యేక పూజలు
- పగిడిద్దరాజు గద్దెకు గత నెలలోనే పూజల పూర్తి
- 24న పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల పునఃప్రతిష్ఠ



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

తాడ్వాయి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారానికి గురువారం భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. సమ్మక్క, సారలమ్మ పగిడిద్దరాజు గోవిందరాజులను దర్శించుకొని ముందస్తు మొక్కులు చెల్లించు కున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తల్లుల భక్తులు తరలి వచ్చి దేవతల గద్దెలకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కళ్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం ఎత్తు బంగారం(బెల్లం)తో గద్దెలకు చేరుకున్నారు. ఈ క్రమంలో తల్లులకు (మిగతా 8లో..)

24న పునఃప్రతిష్ఠ

మేడారం దేవస్థానంలో పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెల పునఃప్రతిష్ఠకు పూజారులు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో ముహూర్తం గురువారం ఖరారు చేశారు. అయితే దేవస్థానం పరిసరాల్లోని షెడ్‌లో దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వీరస్వామి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి పూజారులు హాజరయ్యారు. దేవస్థానం మాస్టర్ ప్లాన్ ప్రణాళికలతో చేపట్టిన రాతి కట్టడాల నిర్మాణ అభివృద్ధి పనుల్లో భాగంగా గద్దెల నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. కాగా ఈ నెల 23న పగిడిద్దరాజు, గోవిందరాజుల పునఃప్రతిష్ఠకు పూజారులు ముహూర్తం ఖరారు చేసుకున్నారు.

కదం తొక్కిన కమలదళం



శివనగర్-ఖమ్మం రోడ్‌పై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

- అండర్ డ్రైనేజీ పనులు పూర్తిచేయాలని ధర్నా
- ప్రధాన రహదారిపై స్తంభించిన రాకపోకలు
- కమీషన్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి పనులపై లేదు..
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఫైర్

6

న్యూమోనియా పంజా

పిల్లల్లో పెరుగుతున్న వ్యాధి

- గత నెలలో 239 మందికి నిర్ధారణ
- ఎంజీఎం పిల్లల వార్డులో చికిత్స

వరంగల్ మెడికల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిన్నపిల్లల్లో న్యూమోనియా పెరుగుతోంది. దగ్గు, జ్వరం, అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతినొప్పి లాంటి లక్షణాలతో చిన్నారులు బాధపడుతున్నారు. ఈ మేరకు ఎంజీఎం ఆస్పత్రి పిల్లల వార్డు న్యూమోనియా వ్యాధి సోకిన పిల్లలతో రద్దీగా మారింది. నవంబరు 1వ తేదీ నుంచి 30 వరకు 239 మంది పిల్లలు న్యూమోనియా వ్యాధితో ఎంజీఎం వార్డులో చేరారు. అదే విధంగా గత నెలలో 780 మంది పిల్లల్లో లోయర్ రెస్పిరేటరీ ట్రాక్ ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతూ ఎంజీఎం ఓపీ సేవలు పొందారు. ప్రతీరోజు ఏడు, ఎనిమిది మంది పిల్లలు ఇప్పటికీ ఎంజీఎంలో న్యూమోనియాతో చేర్చుతున్నారు. అధిక జ్వరం, కొన్నిసార్లు చలితో కూడిన (మిగతా 6లో..)



ఎంజీఎం పిల్లల వార్డు

ట్రాఫిక్ జరిమానాలపై ఎలాంటి రాయితీ లేదు..



వరంగల్ క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ ట్రాఫిక్ చలాన్లు ఉంటే ఈనెల 13 జరిగే లోక్‌అదాలత్‌లో డిస్కౌంట్‌తో పరిష్కరించుకోవచ్చని సామాజిక మాధ్యమాల్లో వస్తున్న ప్రచారాలు అసత్యమని హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ సీతారెడ్డి తెలిపారు. పెండింగ్ చలాన్లు ఉన్న వాహనదారులు తప్పుడు సమాచారంతో సమయాన్ని వృథా చేసుకోకుండా సకాలంలో జరిమానాలు చెల్లించాలని సూచించారు. పెండింగ్ చలాన్లు ఉంటే కొత్త చట్టం ప్రకారం లైసెన్స్ రద్దు చేయడంతోపాటు వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి వాహన యాజమాని పేరు మార్పు చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎలాంటి రాయితీ ఉత్తర్వులు ఇవ్వలేదని ఆయన తెలిపారు.

ఎనిమిదేళ్లుగా
నత్త నడకన..

కమిషనరేట్ నూతన కార్యాలయ నిర్మాణంలో జాప్యం

- రూ.50 కోట్ల నిధుల అంచనాతో 2017లో పనులు ప్రారంభం
- నిధులు విడుదలలో జాప్యంతో కాంట్రాక్టర్ల ఇబ్బందులు
- ఐదంతస్థులకు స్లాబ్.. రెండంతస్థుల ఆధునీకరణకే పరిమితం
- అధికారులకు సరిపడా గదులు లేని వైనం
- ఒక్కొక్క గదిలో ఇద్దరేసి చొప్పున విధులు

వరంగల్ క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రూపుదిద్దుకున్న ఈ భవనం.. నిధుల కొరతతో అవస్థపడుతోంది. దశల వారీగా నిర్మాణం.. కాంట్రాక్టర్ల మార్పుతో గడ్డు పరిస్థితి ఎదురవుతోంది. ప్రభుత్వాలు మారినా.. సీపీలు మారినా.. భవన నిర్మాణంలో వేగం పెరగడం లేదు. ఎనిమిదేళ్లుగా బాలారిష్టాలను ఎదుర్కొంటోంది.

తెలంగాణ ఆవిర్భావం తర్వాత..

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలను కలుపుకొని మూడు జోన్‌లు (ఈస్ట్, సెంట్రల్, వెస్ట్)గా విభజించి 2015 డిసెంబర్ 12న వరంగల్ పోలీస్ కమిషనరేట్‌గా ఏర్పాటు చేశారు. హనుమకొండలో ఇంతకుముందే ఉన్న పోలీ స్ హెడ్‌క్వార్టర్‌లో కమిషనరేట్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఎప్పుడో నిర్మించిన ఈ భవనాలు కమిషనరేట్‌కు సౌకర్యంగా లేవు. అంతేకాక పోలీసు హెడ్‌క్వార్టర్స్ ఆవరణలో విసిరేసినట్లుగా ఉన్న భవనాల్లో అధికారుల చాంబర్స్, డీపీవో సెక్షన్స్ ఉండటంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఒకే భవనంలో సీపీ నుంచి డీసీపీలు, డీపీవో సెక్షన్, ఇతర విభాగాలు ఉండడం ఇబ్బందిగా మారింది. దీంతో డీపీవో కార్యాలయం ఒకే దగ్గర ఉండేలా నూతన భవనం నిర్మించాలని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో 2017లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ మొదటి సీపీ గొట్టె సుధీర్‌బాబు సమక్షంలో అప్పటి హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి సమక్షంలో హెడ్‌కార్వర్టర్స్‌లోనే పోలీసు కమిషనరేట్ ఐదు అంతస్తుల నూతన భవన నిర్మాణానికి రూ.50కోట్ల అంచనాతో భూమి పూజ చేశారు.



నత్తనడకన..

హైదరాబాద్‌కు చెందిన ఓ నిర్మాణ సంస్థ టెండర్ పనులు దక్కించుకొని 2017 నుంచి 18వరకు (మిగతా 6లో..)

కదం తొక్కిన కమల దళం

● అండర్ డ్రెయినేజీ పనులు పూర్తిచేయాలని ధర్నా ● ప్రధాన రహదారిపై స్తంభించిన రాకపోకలు
● కమీషన్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధి పనులపై లేదు.. ● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఫైర్



శివనగర్-ఖమ్మం రోడ్‌పై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఖిలావరంగల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖిలావరంగల్ నుంచి శివనగర్ మీదుగా ఐదేళ్లుగా కొనసాగుతున్న అండర్ డ్రెయినేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం భారీ ఎత్తున ధర్నా చేపట్టారు. శివనగర్ వాటర్ ట్యాంకు ఖమ్మం రోడ్ వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు ఎమ్డీ.రఫీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై ఆందోళన చేపట్టారు. దీంతో వాటర్ ట్యాంకు నుంచి ఖిలావరంగల్ పెట్రోల్‌పంపు వరకు, వాటర్ ట్యాంకు నుంచి చింతల్ బ్రిడ్జి వరకు భారీ వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు, కార్లు, ఆటోలు, బైక్‌లు పెద్దఎత్తున నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న మిల్స్‌కాలనీ ఎస్‌ఐ సిబ్బందితో వచ్చి ధర్నాను విరమించాలని బీజేపీ నాయకులు, కార్యకర్తలను కోరారు. బీజేపీ నాయకులు విరమించకపోగా, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వచ్చి పనులను పర్యవేక్షించాలని పట్టుబట్టారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా అధ్యక్షుడు గంటరవికుమార్, పలువురు నాయకులను అరెస్టు చేసి మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. స్వంత పూచీకత్తుతో వారిని విడుదల చేశారు.

ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ ఐదేళ్ల నుంచి నత్తనడకన సాగుతున్న శివనగర్ అండర్ డ్రెయినేజీ పనులు ఎప్పుడు పూర్తిచేస్తారని మండిపడ్డారు. ఖమ్మం రోడ్‌పై నుంచి చింతల్, ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు, నర్సంపేట, ఖానాపురం, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులకు నరకం కనిపిస్తోందన్నారు. ఈ రోడ్డుపై ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయన్నారు. వరంగల్ బస్టాండ్‌ను కూల్చి రెండేళ్లు అవుతున్నా అతీగతి లేదన్నారు. కాంగ్రెస్ నాయకులకు కమీషన్ల మీద ఉన్న శ్రద్ధ అభివృద్ధి పనులపై లేదన్నారు.

ఈ ధర్నాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, జిల్లా ఉపాధ్యక్షులు కనుకుంట్ల రంజిత్, గడల కుమార్, మాచర్ల దీన్‌దయాళ్, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మార్టిన్ లూథర్, జిల్లా నాయకులు బైరి శ్యాంసుందర్, ఆడెపు వెంకటేష్, బైరి నాగరాజు, ఉప్పుల సురేందర్, రఫీ, మండల నాయకులు వైట్ల గణేష్, సూర శ్రీనివాస్, తమ్మిశెట్టి క్రాంతి, తాళ్లపెల్లి శ్రీను, నవీన్, మార్త ఉషారాణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఇరగదీసిన 'ఇరిగేసి'

జెరూసలేం మాస్టర్స్ చెస్ చాంపియన్‌షిప్‌లో సత్తా

ప్రపంచ మాజీ చెస్ చాంపియన్ విశ్వనాథన్‌పై విజయం

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయిల్‌లో జెరూసలెం మాస్టర్స్ 2025 చెస్ చాంపియన్‌షిప్ ఫైనల్ టోర్నీలో భారత చెస్ గ్రాండ్ మాస్టర్ (జీఎం), ఓరుగల్లు క్రీడా ముత్యం ఇరిగేసి అర్జున్.. చెస్ దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్‌పై విజయం సాధించి టైటిల్‌ను ముద్దాడాడు. యూఎస్ చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇజ్రాయిల్ దేశంలో నిర్వహించిన ఈ చాంపియన్‌షిప్‌లో హనుమకొండకు చెందిన అర్జున్, విశ్వనాథన్ ఆనంద్ మధ్య జరిగిన రెండు ర్యాపిడ్ గేమ్‌లు డ్రా గా ముగిశాయి. ఆ తర్వాత మ్యాచ్ బ్లిట్జ్ టై బ్రేక్‌లో జరిగింది. దీంతో 22ఏళ్ల అర్జున్ టైబ్రేక్‌లో అద్భుత ప్రదర్శన చేసి 2.5-1.5 తేడాతో విజయం సాధించాడు. టైటిల్‌తో పాటు 55000 యూఎస్ డాలర్స్ ప్రైజ్ మనీని అందుకొని చరిత్ర సృష్టించాడు.

చిన్నతనం నుంచే..

హనుమకొండ అడ్వకేట్స్ కాలనీకి చెందిన అర్జున్.. తన స్నేహితులతో సరదాగా చెస్ ఆడటం మొదలు పెట్టాడు. అర్జున్‌కు చెస్‌లో ఉన్న ఆసక్తిని చూసిన అతడి తండ్రి డాక్టర్ శ్రీనివాసరావు 11 ఏళ్ల వయస్సు నుంచే చెస్‌లో శిక్షణ ఇప్పించాడు. దీంతో అర్జున్ చెస్‌లో అంచలంచెలుగా ఎదిగాడు. అర్జున్ తన అద్భుత ప్రతిభతో 2017 తరువాత 14ఏళ్ల వయస్సులోనే గ్రాండ్ మాస్టర్ (జీఎం)హోదాను సాధించాడు.

రవాణా సదుపాయాలకు నిధులివ్వండి

పార్లమెంట్‌లో ఎంపీ కావ్య

హనుమకొండ, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యంగా వరంగల్ జిల్లాలో రవాణా వ్యవస్థ విస్తరణ, రోడ్లకు మరిన్ని నిధులు కేటాయించాలని, జాతీయ రహదారులపై పెరుగుతున్న ప్రమాదాలను నివారించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కేంద్రాన్ని కోరారు. గురువారం లోక్ సభలో ఈ అంశాన్ని లేవనెత్తారు. కేంద్ర రహదారి రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్ గడ్గరీ సమాధానం ఇస్తూ.. దేశం లోని 25 నగరాల్లో 1,083 కి.మీ. మెట్రో మార్గాలు ప్రస్తుతం నడుస్తున్నాయని, వాటిలో హైదరాబాద్ మెట్రో కూడా ఉందని చెప్పారు. 2023 ఆగస్టులో ప్రారంభించిన పీఎం-ఈబస్ సేవా పథకం కింద 10వేల ఎలక్ట్రిక్ బస్సులు అందించేందుకు రూ. 20వేల కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 106నగరాలకు 9,360 ఈ-బస్సులను ఇప్పటికే ఆమోదించనట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో వరంగల్ నగర రవాణా సేవలు మరింత మెరుగయ్యే అవకాశం ఉందన్నారు.

యువకుల మధ్య ఘర్షణ

ఒకరికి తీవ్ర గాయాలు

కాజీపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కలిసి మద్యం సే వించిన ముగ్గురు యువకులు మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి మెడపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ మండలం శాయిపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ పి.రాజ్‌కుమార్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేసే నేపాల్‌కు చెందిన అర్జున్, అదే గ్రామానికి చెందిన సాయి అనే ముగ్గురు స్నేహితులు మడికొండలో మద్యం సేవించారు. బుధవారం రాత్రి రాజ్‌కుమార్ ఆటోలో అర్జున్, సాయి కాజీపేటకు వస్తున్న క్రమంలో భవానీ థియేటర్ వద్దకు రాగానే ఆటో ఆపుకుని ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడ్డారు. ఈ దాడిలో ఆటోడ్రైవర్ రాజ్‌కుమార్ మెడపై అర్జున్ నెయిల్‌కట్టర్‌తో దాడిచేశారు. దీంతో రాజ్‌కుమార్‌కు మెడపై తీవ్రగాయమై రక్తస్రావం జరిగింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు గాయాలపాలైన రాజ్‌కుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

రేపు హెచ్‌సీఎల్-టెక్‌బీ జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హెచ్‌సీ ఎల్-టెక్ బీ ఆధ్వర్యంలో ఈ నెల 6న హనుమకొండ అంబేద్కర్ విగ్రహం వద్దగల ఐసీఎస్ఎస్ కంప్యూటర్ సెంటర్‌లో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు డీఐఈవో డాక్టర్ శ్రీధర్ సుమన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ పాసైన విద్యార్థులతో పాటు ఈ ఏడాది పరీక్షలు రాయ బోతున్న విద్యార్థులు సైతం జాబ్ మేళాలో పాల్గొనే అవకాశం ఉందని పేర్కొ న్నారు. ఇంటర్‌లో 75 శాతం మార్కులు కలిగిన ఆసక్తిగల విద్యార్థులు సంబంధిత ధృవ పత్రాల తో శనివారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు 7569 177071/79818 34205 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సన్నద్ధం

మహబూబ్‌నగర్‌లో నేటి నుంచి పోటీలు ప్రారంభం

జేఎన్ఎస్‌లో ముగిసిన జిల్లాస్థాయి క్రీడా శిక్షణ శిబిరం



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన జిల్లా కబడ్డీ జట్టు సభ్యులతో అసోసియేషన్ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పల్లెవాసుల గుండెచప్పుడు, గ్రామీణ క్రీడగా ప్రసిద్ధిగాంచిన కబడ్డీలో శిక్షణ పొందేందుకు యువత ఆసక్తి కనబర్చుతున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో గెలుపే లక్ష్యంగా చెమటోడ్చుతున్నారు. క్రీడా పరికరాలు పెద్దగా అవసరం లేకుండా, తక్కువ పెట్టుబడితో నిర్వహించే క్రీడగా గుర్తింపు పొందిన కబడ్డీ పట్ల యువతలో రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. దేశవాళి క్రీడగా ఖ్యాతిగాంచిన కబడ్డీ క్రీడను ఒలంపిక్స్ క్రీడాంశాలలో చేర్చాలని కబడ్డీ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు పలు మార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వినతిపత్రాలను సమర్పించారు.

ఈ మేరకు ఎస్‌జీఎఫ్‌ఐ అండర్-17 బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో డిసెంబరు 5వ నుంచి 7వరకు నిర్వహించనున్న కబడ్డీ చాంపియన్‌లో పాల్గొనేందుకు హనుమకొండ జిల్లాకు చెందిన కబడ్డీ జట్టు క్రీడాకారులు పది రోజులుగా కసరత్తులు ముమ్మరం చేశారు. హనుమకొండ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలోని కబడ్డీ కోర్టులో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రీడా శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. డీఎస్‌ఏ కోచ్ శంకర్ సారథ్యంలో శిక్షణ పొందారు. ఈ మేరకు క్రీడాకారులు ప్రథమస్థానమే లక్ష్యంగా క్రీడా పోటీలకు మహబూబ్‌నగర్‌కు బయలుదేరారు.

జిల్లా స్థాయి అండర్-16 బాలుర క్రికెట్ జట్ల ఎంపిక

ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన 250మంది క్రీడాకారులు



జిల్లా స్థాయి అండర్-16 బాలుర క్రికెట్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5నుంచి 9వరకు మొగిలిచర్ల, వంగపల్లి లోని డబ్ల్యూడీసీఏ క్రికెట్ మైదానాల్లో నిర్వహించనున్న అండర్-16 ఇంట్రా డిస్ట్రిక్ట్ బాలుర క్రికెట్ పోటీల్లో ప్రాతినిథ్యం వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. గురువారం వంగపల్లిలోని డబ్ల్యూడీసీఏ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి అండర్-16 బాలుర విభాగంలో నిర్వహించిన క్రికెట్ ఎంపిక పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 250మంది క్రీడాకారులు పాల్గొన్నారని వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ తెలిపారు. వంగపల్లి మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో బ్యాటింగ్, బౌలింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఒక్కో జిల్లా నుంచి ఒక్కో జట్టును ఎంపిక చేశామన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 6జిల్లాల కుగాను 6జట్లను ఎంపిక చేసి ఈ 6జట్ల మధ్య లీగ్ కం నాకౌట్ పద్ధతిన 5రోజుల పాటు మొగిలిచర్ల, వంగపల్లి క్రికెట్ మైదానాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన జట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఒక జట్టును ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఎంపిక చేయడంతో పాటు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అంతర్‌జిల్లాల అండర్-16 హెచ్‌సీఏ లీగ్ క్రికెట్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ మేరకు 6జిల్లాలకు చెందిన తుది క్రికెట్ జట్ల సభ్యులను సెలక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఎంపిక చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు అభినవ వినయ్, శంకర్, కోచ్‌లు అఫ్జల్, సందీప్‌నేత్ర, రాజ్‌కుమార్, మెతుకు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీలో అక్రమాలు

ఒక్కో పోస్టుకు రూ.3లక్షలు వసూలు

వరంగల్ మెడికల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎం జీఎం ఆస్పత్రి అనుబంధ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 19 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించేందుకు ప్రభుత్వం అనుమతించింది. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా ఈ నియామకాలు జరగనున్నాయి.

దీంతో పలువురు ఆశావహులు దరఖాస్తులు సమర్పించారు. ఓ పక్క వెబ్‌సైట్‌లో మెరిట్ లిస్టు ఆధారంగా నియామకాలు జరుగుతాయనే చెపుతున్నప్పటికీ భారీ మొత్తంలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ నిర్వాహకులు ఒక్కో పోస్టుకు రూ.3 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే అనేక మంది దగ్గర డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం. ఒక పక్క ఎన్నికల కోడ్ అమలులో ఉండగా వసూళ్ల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఇప్పటికైనా మెరిట్ లిస్టును జిల్లా యంత్రాంగం ప్రకటించాలని, నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు సమర్పించిన అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. నియామకాలన్నీ పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

న్యుమోనియా పంజా

(5వ పేజీ తరువాయి)

జ్వరం కూడా వస్తుంది. సాధారణంగా కఫంతో కూడిన దగ్గు వస్తుంది. సాధారణం కంటే ఎక్కువగా అలసట లేదా శక్తిహీనంగా ఉంటుంది. ఛాతిలో నొప్పిగా ఉండటం. వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురవుతుంది. శ్వాసలో గురక లాంటి సమస్యలు కనిపిస్తాయి. ఇవి కనిపించిన వెంటనే అశ్రద్ధ చేయకుండా చికిత్స పొందాలని వైద్యులు సూచిస్తున్నారు.

నేడు నర్సంపేటకు సీఎం రాక

(5వ పేజీ తరువాయి)



సభ వేదిక వరకు గుంతలమయమైన రోడ్డుకు ప్యాచ్ వర్కులు చేస్తున్న దృశ్యం

మెడికల్ కళాశాల భవనం, సీసీరోడ్లు, డ్రైనేజీలు, సెంట్రల్ లైటింగ్, వరంగల్ నుంచి నర్సంపేట వరకు 4 లైన్‌రోడ్ నిర్మాణం, నర్సంపేట నుంచి పాకాల రోడ్, నర్సంపేట, సర్వాపురం, అయోధ్యనగర్, అశోక్‌నగర్. పాకాల వరకు 2లైన్‌ల రోడ్డు నిర్మాణం, నర్సంపేట నుంచి నెక్కొండ రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సీఎం శుక్రవా రం మధ్యాహ్నం 1 గంటకు హెలీకాప్టర్‌లో నర్సంపేట చేరుకుంటారు. సభాస్థలికి సమీపంలోనే హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. హెలికాప్టర్ దిగగానే సీఎం నేరుగా శంకుస్థాపనలు చేసి సభ వేదికకు చేరుకుంటారు. కాగా సీఎం సభకు విస్తృత ఏర్పాట్లు చేశారు. స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పార్టీ నాయకులతో కలిసి పర్యవేక్షణలో నిమగ్నమయ్యారు. సభకు భారీ ఎత్తున ప్రజలు. పార్టీ శ్రేణులు హాజరయ్యే అవకాశం ఉండడంతో అందుకు అనుగుణంగా తాగేనీరు సౌకర్యం తదితర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు.

పోలీసు బందోబస్తు

సీఎం పర్యటన బహిరంగ సభ సందర్భంగా వెయ్యి మంది పోలీసులతో బందోబస్తును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఏడుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 35 మంది ఎస్సైలు, 550 మంది పోలీసు సిబ్బంది, 100 మంది గ్రేహౌండ్స్ పోలీసులు, 100బాంబ్‌స్క్వాడ్‌తో బందోబస్తు ఏర్పాటు చేశారు. పట్టణ పరిధిలో నాలుగైదు చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు.

వరాల జల్లు కురిపిస్తారా..

నర్సంపేట పట్టణానికి తొలిసారి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరాల జల్లు కురిపిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. విద్య, వైద్య, రోడ్డు, రవాణా, సాగు, తాగు నీటి రంగాల అభివృద్ధికి, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం కోసం ఫుడ్‌పార్క్, ఉపాధి శిక్షణ కేంద్రం ఏర్పాటుతో పాటు నర్సంపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి మోడ్ సిటీగా తీర్చిదిదేందుకు అవసరమైన నిధులు కేటాయిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు. మహిళలకు ఉపాధి కల్పించడానికి, ఔటర్ రింగ్‌రోడ్ ఏర్పాటు కోసం నిధులు విడుదల చేస్తానని హామీలు కురిపిస్తారని భావిస్తున్నారు. అలాగే విలీన గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తారని భావిస్తున్నారు. నియోజకవర్గంలోని దుగ్గొండి, నల్లబెల్లి, నెక్కొండ, ఖానాపురం, చెన్నారావుపేట మండలాల అభివృద్ధికి వరాలు కురిపిస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. దొంతి మాధవరెడ్డి రెండోసారి నర్సంపేట ఎమ్మెల్యేగా ఎన్నికై రెండేళ్లు పూర్తికావస్తోంది. ఇంతకాలానికి సీఎం తొలిసారిగా వస్తుండటం ఆసక్తికరంగా మారింది.

ఎనిమిదేళ్లుగా నత్తనడకన..

(5వ పేజీ తరువాయి)

బేస్‌మెంట్ లెవల్ వరకు పనులు చేపట్టింది. నిధులు విడుదల చేయకపోవడంతో పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. 2021లో రీటెండర్లు నిర్వహించగా హైదరాబాద్‌కు చెందిన మరో సంస్థ గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు ఐదు అంతస్తుల భవన నిర్మాణ పనులను చేజిక్కించుకొని పనులు ప్రారంభించింది.

సదరు నిర్మాణ సంస్థకు సైతం ప్రభుత్వం అరకొర నిధులను విడుదల చేయడంతో కాంట్రాక్టరు కష్టనష్టాలను ఓర్చుకొని ఐదు అంతస్థులను నిర్మించారు. కాగా, ప్రస్తుత గుత్తేదారుకు సైతం నిధులు కొంత ఆపడంతో నత్తనడకగా పనులు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. నిధులను సకాలంలో అందజేసి వేగంగా నిర్మాణం పూర్తిచేస్తే మూడు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

రెండంతస్థులకే పరిమితం

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి. రమేశ్ కుమార్ కొద్ది నెలల కిందట వరంగల్ పోలీస్ కమిషనరేట్‌ను సందర్శించారు. నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించి రెండు అంతస్థులను మాత్రమే ఆధునీకరించాలని కాంట్రాక్టరును ఆదేశించారు. దీంతో ఐదు అంతస్థుల స్లాబ్ పూర్తి చేసుకున్న భవనం.. రెండు అంతస్థుల ఆధునీకరణకు పరిమితమైంది. రెండు అంతస్థుల్లో సీపీ, డీసీపీల చాంబర్స్, ఎస్‌బీ, ఐటీకోర్, పీఆర్‌వో కార్యాలయం, డీపీవో, వీడియో కాన్ఫరెన్స్ హాల్, సుమారు 205 మంది కూర్చునే విధంగా సమావేశ మందిరాన్ని సిద్ధం చేస్తున్నట్లుగా సమాచారం. పాత భవనాలు మన్నికతోనే ఉన్నందున వాటిని కూల్చాల్సిన అవసరం ఇప్పుడు లేదని, ఏఆర్ అధికారుల చాంబర్స్‌ను పాత కార్యాలయాల్లోనే యథావిధిగా కొనసాగించేందుకు నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

అధికారులు ఫుల్.. గదులు నిల్..

వరంగల్ పోలీస్ కమిషనరేట్‌గా రూపాంతరం చెందిన తర్వాత 3 జోన్‌లు ఏర్పడ్డాయి. సీపీతో పాటు ముగ్గురు డీసీపీలు, ముగ్గురు అడిషనల్ డీసీపీలు, ఇద్దరు ఏఆర్ అడిషినల్ డీసీపీలు, మగ్గురు ఏఆర్ ఏసీపీలు, డీపీఓ సిబ్బంది, సీసీఆర్‌బీ, ఐటీ కోర్, సైబర్ క్రైం, ఎస్‌బీ, యాంటీ సెక్షన్, ఆర్‌ఐలు, డ్రగ్ కంట్రోల్ టీం, పోలీస్ కంట్రోల్ రూం, కమ్యూనికేషన్, ఏహెచ్‌టీయూ, టీటీఐ, వరిక్టల్ విభాగం.. ఇలా రకరకాల విభాగాల అధికారులంతా కమిషనరేట్ కార్యాలయంలోనే కొలువుదీరి ఉన్నారు. అయితే వీరికి విధులు నిర్వహించేందుకు చాంబర్‌లు కరువయ్యాయి. ఓ ఏసీపీ చాంబర్‌ను ఏఆర్ అదనపు డీసీపీకి కేటాయించడంతో ఏసీపీ ఇంటినుంచే ఫోన్‌ల ద్వారా కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు తెలిసింది.

అదే విధంగా కమిషరేట్ మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం కొత్తగా ఏర్పాటు చేసిన డ్రగ్ కంట్రోల్ టీంకు సీఐ, ఆర్‌ఐ, ఇద్దరు ఆర్ఎస్సైలు, సిబ్బందిని నియమించి ఒకటే గదిని కేటాయించారు. దీంతో అదుపులోకి తీసుకున్న గంజాయి విక్రేతలు, స్మోకర్స్ కూర్చోవడానికి స్థలం లేకుండాపోయింది. దీంతో సీఐ ఎస్‌బీ కార్యాలయం నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు చెబుతున్నారు. ఇంకా చాలా విభాగాల్లో ఇదే పరిస్థితి ఉన్నట్లుగా తెలుస్తోంది.

ఖర్చు తడిసి మోపెడు

(5వ పేజీ తరువాయి)

అవకాశాలు లేవు. సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య అపరిమితంగా ఉండడంతో పార్టీల ముఖ్యనేతలు, ఎమ్మెల్యేలు ప్రచారం ఖర్చు సమకూర్చడానికి ఉదారంగా ముందుకు రావడానికి సాహసించడం లేదు. నియోజకవర్గాల్లో పార్టీ పునాదులు బలపడడానికి, గ్రామ స్థాయిలో బలాన్ని, బలగాన్ని పెంచుకోవడానికి పంచాయతీ ఎన్నికలు ఎమ్మెల్యేలకు ఒక అవకాశం అయినప్పటికీ అభ్యర్థుల ప్రచారం ఖర్చును భరించడం కష్టమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ పరిస్థితి ఏమిటి? అని అభ్యర్థులు మథన పడుతున్నారు.

భారీగా పెరగనున్న ఖర్చు

పంచాయతీ ఎన్నికలు అంటేనే పోటీ ఎక్కువగా ఉంటుంది. స్థానికంగా ఉండే బడా నాయకులు రిజర్వేషన్ల ఆధారంగా బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎన్నికల ఖర్చు వారిలో భయాన్ని రేకెత్తిస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికలకంటే ఈ సారి రెండింతలు ఖర్చు చేయాల్సి వస్తోందని తర్జనభర్జన పడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 1,708 గ్రామ పంచాయతీలు, 15,006 వార్డులు ఉన్నాయి. శాసన సభ ఎన్నికల్లో రూ.కోట్లు ఖర్చు కాగా, ప్రస్తుత పంచాయతీ ఎన్నికల సందర్భంగా చిన్న గ్రామంలో రూ.5లక్షల నుంచి రూ.10లక్షలు, పెద్ద పంచాయతీలు అయితే రూ.10లక్షల నుంచి రూ.25లక్షల వరకు ఖర్చు రావచ్చని భావిస్తున్నారు. ఆదాయం అధికంగా ఉండే మరికొన్ని పంచాయతీల్లో ఈ ఖర్చు దాదాపు రూ.50 లక్షల వరకు ఉండొచ్చని చర్చించుకుంటున్నారు. ప్రచారం కోసం కార్యకర్తలు వెంట తిరగడం, వారికి టీ, అల్పాహారం, మధ్యాహ్నం భోజనంతో పాటుగా మద్యం కోసం అధికంగా ఖర్చు కానున్నది. పోలింగ్ ముందు రోజు ఖర్చు మరింత రెట్టింపు అవుతుందని నాయకులు బాహాటంగానే చెబుతున్నారు.

నిబంధనలు ఉన్నా..

స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచార వ్యయాన్ని కట్టడి చేయాలనే ఉద్దేశంతో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను జారీ చేసినప్పటికీ అవి ఆచరణలో ఎక్కడా అమలయ్యేలా కనిపించడం లేదు. ఎన్నికల బరిలోని అభ్యర్థులు తప్పకుండా ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాల్సి ఉన్నా ప్రచారం జోరు, హోరాహోరు పోరులో అవి గాలికికొట్టుకుపోయేట్టు ఉన్నాయి. 5వేలలోపు జనాభా కలిగిన పంచాయతీలో పోటీ చేసే వార్డు సభ్యుడు రూ.30వేలు, సర్పంచ్ అభ్యర్థులు రూ.1.50లక్షల వరకు ఖర్చు చేయాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. 5వేలకుపైగా జనాభా కలిగిన గ్రామ పంచాయతీలో పోటీ చేసే వార్డు సభ్యులు రూ.50వేలు, సర్పంచ్ అభ్యర్థులు రూ.2.50 లక్షలు పరిమితి విధించింది.

క్షేత్ర స్థాయిలో ప్రచారానికి వచ్చేటప్పటికీ ఈ పరిమితులు దాటి ఖర్చు అపరిమితంగా పెరగనున్నది. ఇంత ఖర్చు చేసినా విజయం వరిస్తుందా? అని మరికొందరు ఆశావహులు ఆందోళన చెందుతున్నారు.

మూడో విడతలో మరింత ఖర్చు

మూడో విడత ఎన్నికలు జరిగే పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులు ప్రచారం ఖర్చు విషయంలో మరింత ఆందోళన చెందుతున్నారు. మొదటి, రెండో విడత కన్నా చివరన మూడో విడతన జరిగే ఎన్నికల్లో ఖర్చు భారీగా పెరగనుందని వాపోతున్నారు. మొదటి విడత ఈనెల 11, రెండో విడత 14న, మూడోవిడత 17 పోలింగ్ నిర్వహిస్తున్నారు. అయితే రెండు, మూడో విడత ఎన్నికలు జరిగే గ్రామాల ఆశావహులకు చిక్కొచ్చి పడింది. అసలే ప్రచారం, విందులు, మందు, డబ్బు పంపకాలకు ఎక్కువ ఖర్చు అవుతుండగా మొదటి విడతకన్నా రెండు, మూడో విడత పోలింగ్ జరగడానికి ఎక్కువ రోజులు పడుతున్నందువల్ల తమపై ఎక్కువ భారం పడనుందని ఆశావహులు చెబుతున్నారు. ఓటర్లు ప్రత్యర్థులకు మద్దతు తెలపకుండా ఇప్పటినుంచే వారిని మచ్చిక చేసుకొని తమ వైపే ఉండేట్లు చూసుకోవడానికి ఎక్కువ మొత్తం ఖర్చు చేయాల్సి ఉంటుందని వాపోతున్నారు.



ఉప సర్పంచ్ పదవి ఉత్తదేమీ కాదు !

- పలు పంచాయతీల్లో ఆ పదవికీ యమ డిమాండ్
- ఇప్పటి నుంచే మంతనాలు
- చెక్‌పవర్ ఉండడమే కారణం
- రిజర్వేషన్ కలిసిరాని చోట మారుతున్న వ్యూహాలు
- మహిళా సర్పంచులున్న చోట ఆధిపత్యానికి యత్నాలు

హనుమకొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవితో పాటు ఉపసర్పంచ్ స్థానం కూడా హాట్ కేక్ అవుతోంది. ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతునిస్తున్న పార్టీలు ఒక సర్పంచ్ స్థానాన్ని మాత్రమే గెలుచుకోవడం వల్ల ప్రయోజనం లేదని, ఉపసర్పంచ్ స్థానాన్ని కూడా దక్కించుకుంటే గెలుపునకు పరిపూర్ణత సిద్ధిస్తుందని భావిస్తున్నాయి. ఇందు కోసం ఉపసర్పంచ్ స్థానాలపై కూడా ప్రధానంగా గురిపెడుతున్నాయి. దీనిని కైవసం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్‌ను కూడా కైవశం చేసుకోకపోతే పార్టీలు రాజకీయంగా ప్రతికూలతలను ఎదుర్కోవలసి ఉంటుంది. సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్‌కు కూడా అధికారాలు ఉండడమే ఈ పదవికి అంత క్రేజ్. ముఖ్యంగా ఉపసర్పంచ్‌కు చెక్‌పవర్ ఉండడం ఈ పదవి డిమాండ్‌ను పెంచింది. ఉపసర్పంచ్‌ను ఎన్నుకునేది వార్డు సభ్యులే అయినందు వల్ల ఈ వార్డు సభ్యుల పదవులకు పోటీ తీవ్రంగా ఉంది. రాజకీయంగా పార్టీల నుంచి గట్టి మద్దతు ఉన్నవారు వార్డు పదవుల్లో సైతం గట్టి పోటీ ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు.

ఉప సర్పంచ్ అధికారాలు

సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్‌కు కూడా విధులు, బాధ్యతలు ఉంటాయి. ఉపసర్పంచ్ గ్రామ పంచాయతీ సమావేశాలలో పాల్గొనడం, సర్పంచ్‌కు సహాయం చేయడంతో పాటు సర్పంచ్ లేనప్పుడు సర్పంచ్ విధులను నిర్వహిస్తాడు. పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా జరిగేట్టు చూడడం, రోడ్లు, మురుగు కాలువలు, వంతెనలు, బావుల నిర్మాణం, నిర్వహణ వంటి ప్రజాపనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షిస్తాడు. గ్రామాలలో వీధి దీపాలను ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ బాధ్యతలను కూడా పర్యవేక్షిస్తాడు. గ్రామాలలో ప్రాథమిక విద్యను అందించేందుకు కృషి చేస్తాడు. పంచాయతీకి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాడు.

మారుతున్న వ్యూహాలు

ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలంగా రానిచోట్ల నాయకులు వ్యూహం మార్చుకుంటున్నారు. సర్పంచి కాకపోకపోయినా చెక్‌పవర్ ఉన్న ఉపసర్పంచ్ పదవిని దక్కించుకొని ఊరిని ఏలుదామని పథకాలు రచించుకుంటున్నారు. ఆయా రిజర్వేషన్లకు చెంది వెంట ఉండేవారు, చెప్పిన మాట వినే అనుచరుడు, లేదంటే అతడి సతీమణిని సర్పంచ్‌గా బరిలోకి దింపి గెలిపించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మొదటి విడత, రెండవ విడత ఎన్నికల నామినేషన్లలో ఇదే జరిగింది. సర్పంచ్ నుంచి వార్డు సభ్యుల వరకు అనువైన వారిని ఎంపిక చేసేందుకు నేతలు రాత్రింబవళ్లు సమాలోచనలు చేస్తున్నారు. ఉపసర్పంచ్ కావాలంటే వార్డడ సభ్యులే కీలకం కానున్నారు. దీంతో చెప్పిన మాట వినేవారితోనే నామినేషన్ వేయిస్తున్నారు. వారికి అవసరమైన నామినేషన్ పత్రాలు, పన్నుల చెల్లింపు, ధృవపత్రాలు తీసుకోవడం వంటి పనులన్నీ ఆ నాయకులే చూసుకుంటున్నారు.

మహిళా స్థానాల్లో ఆధిపత్యానికి..

50 శాతం సర్పంచ్ స్థానాలు మహిళలకు కేటాయించారు. మహిళా సర్పంచులు గెలిచిన పంచాయతీల్లో ఉపసర్పంచ్‌గా గెలుపొంది ఆధిపత్యం చెలాయించవచ్చనే ఉద్దేశ్యంతో పలుకుబడి కలిగిన నేతలు వార్డు సభ్యులుగా బరిలోకి దిగుతున్నారు. పాలకవర్గ సమావేశాలకు సర్పంచ్ గైర్హాజరు అయిన సందర్భాల్లో ఉపసర్పంచ్ అధ్యక్షతనే నిర్వహిస్తారు. నిధుల వినియోగంలో సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్‌కు చెక్ పవర్ ఉంటుంది. దీంతో మేజర్ పంచాయతీల్లో వార్డు సభ్యుల పదవులకు రూ. లక్షల్లో వెచ్చించేందుకు అభ్యర్థులు వెనుకాడని పరిస్థితి ఉంది.

రిజర్వేషన్ అనుకూలించక..

సర్పంచ్‌గా పోటీ చేయాలని భావించిన కొందరు నాయకులకు రిజర్వేషన్ అనుకూలించక పోవడంతో ఉపసర్పంచ్ పదవిపై కన్నేశారు. వారికి రిజర్వేషన్ అనుకూలించి వార్డు నుంచి సభ్యులుగా పోటీకి దిగుతున్నారు. పంచాయతీలో సర్పంచ్‌కు, ఉపసర్పంచ్‌కు జాయింట్ చెక్‌పవర్ ఉండడంతో పోటీ తీవ్రతరమైంది. ఇది సర్పంచ్ అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. ఏ అభివృద్ధి పనులు జరిగినా చెక్‌పై ఉపసర్పంచ్ సంతకం కచ్చితంగా పెట్టాల్సి రావడంతో సర్పంచ్ అక్రమాలకు తావుండదు. సంతకం చేయకపోతేప బిల్లు పాస్ అయ్యే అవకాశం తక్కువ. ఉన్నతాధికారులకూ ఫిర్యాదులు ఎక్కువగా వెళ్లే అవకాశం ఉంది. అభివృద్ధి చేయాలన్నా ఇద్దరు కలిసికట్టుగా ఉండాలి. సంయుక్తగా పని చేయాలి. సర్పంచ్‌కు దాదాపు సమానమైన ప్రోటోకాల్ ఉంటుంది. ఇదే అదనుగా భావించిన కొందరు సర్పంచ్ అభ్యర్థులు గెలిచిన వెంటనే తమకే ఉపసర్పంచ్ పదవి వచ్చేలా చక్రం తిప్పుతానని ఆశచూపి వారిని ప్రలోభాలకు గురి చేయడం ద్వారా తాము గెలవడానికి పావులు కదుపుతున్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్టీలకు కేటాయించిన స్థానాల్లో ఈ ఎత్తుగడులు ఎక్కువగా సాగుతున్నాయి. ప్రదానంగా నిరక్షరాస్యులైన మహిళలు పోటీ చేసే పంచాయతీల్లో ఉపసర్పంచ్‌కి మంచి డిమాండ్ ఉంది. ఆ పంచాయతీల్లో ఎక్కువ శాతం వారిదే పెత్తనం ఉండే అవకాశం ఉంది. అంతేకాక సర్పంచ్‌కి చేసే ప్రచార వ్యయం కంటే వార్డు సభ్యుని ప్రచారానికికయ్యే వ్యయం తక్కువ. వార్డు సభ్యుల నుంచే ఎన్నికవుతాడు కనుక ఆర్థికపరమైన ఒత్తిడి కూడా తక్కువగానే ఉంటుంది. దీనికితోడు సర్పంచ్ అభ్యర్థి సైతం కొద్దోగొప్పో వార్డుకు పోటీ అభ్యర్థులకు కూడా డబ్బులు సర్దుబాటు చేయడం పరిపాటి.

ఎన్నిక ఇలా...

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ఫలితాలు మధ్యాహ్నంలోగానే వెలువడనున్నాయి. ఆ వెంటనే ఉపసర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. ఉపసర్పంచ్‌గా పోటీ చేసేవారు ముందుగా నామినేషన్లు దాఖలు చేయడం, వారిని వార్డు సభ్యుల్లో ఒకరు బలపరచడం వంటి తతంగం ముగిసిన తర్వాత ఎన్నికను నిర్వహిస్తారు. వార్డు సభ్యులు చేతులెత్తడం ద్వారా ఎంపికను నిర్వహిస్తారు. ఎవరికి అనుకూలంగా ఎక్కువ మంది వార్డు సభ్యులు చేతులెత్తితే ఆ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటిస్తారు. ఒకవేళ ఇద్దరి సమాన మద్దతు పలికనప్పుడు టాస్ ద్వారా గెలుపును నిర్ణయిస్తారు.

సర్పంచ్ ఎన్నికల్లోనూ నోటా

వెంకటాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లోనూ నోటాకు అవకాశం కల్పించారు. ఓటుహక్కును వినియోగించుకోవడం ఓటరు బాధ్యత. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే నచ్చలేదనే అభిప్రాయం తెలిపేందుకు నన్ ఆఫ్ ది ఎబౌ(నోటా) అవకాశం కల్పించింది. 2013వరకు ఓటర్లకు అభ్యర్థులు నచ్చకపోయినా సరైన అభ్యర్థి పోటీలో లేరని భావించిన ఎవరికో ఒకరికి ఓటు వేయాల్సిన పరిస్థితి ఉండేది. అదే ఏడాది సెప్టెంబరు 27న దేశ అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పుతో నోటా అమలులోకి వచ్చింది. ఎన్నికల సంఘం ఈవీఎంలలో నోటా బటన్ అమర్చి మొదటిసారిగా రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఢిల్లీ, ఛత్తీస్‌గఢ్, మిజోరం శాసనసభ ఎన్నికల్లో శ్రీకారం చుట్టారు. అప్పటినుంచి ప్రతి ఎన్నికల్లో నోటా ఉంటుంది. రాష్ట్ర పంచాయతీరాజ్ సంస్థల ఎన్నికల నిర్వహణలోను దీనిని పొందుపరిచారు. దీనిని అనుసరించి ప్రస్తుతం బ్యాలెట్ విధానంలో జరిగే పంచాయతీరాజ్ ఎన్నికల్లోనూ బ్యాలెట్‌పత్రంలో చివరి గుర్తుగా నోటా ఉంటుంది. పోటీలో ఉన్న అభ్యర్థులు నచ్చకపోతే దీనిమీద స్వస్తిక్ ముద్ర పడనుంది.

అప్పీల్‌కు అవకాశం

- తిరస్కరించిన నామినేషన్‌పై ఆర్డీవోకు అభ్యంతర పత్రం దాఖలు చేయవచ్చు

వెంకటాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డుసభ్యుడిగా పోటీచేసే అభ్యర్థి నామినేషన్ తిరస్కరించినట్లయితే అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉంటుందని, ఆ అభ్యర్థి సంబంధిత ఆర్డీవోకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నిర్ణయంపై అభ్యంతరపత్రం సమర్పించవచ్చు. నామినేషన్లు దాఖలు ముగిసిన అనంతరం తర్వాతరోజు వాటి పరిశీలన చేపడతారు. ఒకవేళ ఈ పరిశీలనలో నామినేషన్ తిరస్కరణకు గురైనమరే ఇతర విషయాలపైన అయినా అభ్యంతరం తెలిపేందుకు ఎన్నికల షెడ్యూల్ ప్రకారం మరుసటిరోజు అవకాశం కల్పిస్తారు. ఈ అప్పీల్‌పై ఆతర్వాత రోజు అధికారులు పరిష్కారం వెల్లడిస్తారు.

పంతులు.. నేను గెలుస్తానా ?

- జ్యోతిష్యులను ఆశ్రయిస్తున్న అభ్యర్థులు

వెంకటాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంతో పాటు వివిధ మండలాల్లోని ఆయా గ్రామాల్లో సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు జాతకాన్ని చూసుకుంటున్నారు. పంతుల నా జాతకం చూసి చెప్పండి... ఎన్నికల్లో గెలుస్తానా..? జాతకం ఎలా ఉంది? ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్నా అంటూ జ్యోతిష్యులను ఆశ్రయిస్తున్నారు. సర్పంచ్ కావాలనే కోరిక ఉంది, పోటీచేసి గెలుస్తానా, ఏరోజు నామినేషన్ వేయాలి, ఏరోజు ప్రచారానికి వెళ్లాలి అని ఆరా తీస్తున్నారు. ఫలానా పంతులు జాతకం బాగా చెబుతాడంటే ఆయన వద్దకే వెళ్లి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు అభ్యర్థులు. జ్యోతిష్యుల సూచనల మేరకు ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. ఏదేమైనా పంచాయతీ ఎన్నికలు ఆశావహులను గుళ్లు, గోపురాలబాట పట్టిస్తున్నాయి. దీంతో జ్యోతిష్యులు, వేద బ్రాహ్మణులు, పంతుళ్లకు గిరాకీ పెరిగింది.

సమరానికి సై అంటూ..



- మొదటి విడతలో 91 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు
- 299 మంది సర్పంచ్, 1,219 మంది వార్డు స్థానాల కోసం పోటీ

వరంగల్ సిటీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొదటి విడతలో పర్వతగిరి, వర్ధన్నపేట, రాయపర్తి మండలాల్లోని 91 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగుతున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ తరువాత 10 మంది సర్పంచ్‌లు, 215 మంది వార్డుసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇక పంచాయతీ ఎన్నికల్లో 299 మంది సర్పంచ్, 1,219 మంది వార్డుసభ్యుల స్థానాల కోసం పోటీ పడుతున్నారు. ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యాన్ని ఓటర్లు తేల్చనున్నారు.

● పర్వతగిరి మండలంలో... మొత్తం 33 గ్రామాలు, 288 వార్డులు ఉండగా సర్పంచ్ స్థానానికి 257 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే 731 మంది వార్డు స్థానాలకు నామినేషన్లు వేశారు. ఇందులో మోత్యాతండా, దూపతండా, శ్రీనగర్ గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు ఏకగ్రీవం అయ్యారు. 134 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇక 30 గ్రామాల్లో 120 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో నిలిచారు. అలాగే మండలంలోని 288 వార్డులకు గాను 731 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అందులో 75 వార్డు స్థానాలు ఏకగ్రీవం కాగా, 158 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇక 498 మంది బరిలో నిలిచారు.

● వర్ధన్నపేట మండలంలో 18 గ్రామాలు, 170 వార్డులున్నాయి. 129 మంది సర్పంచ్ అభ్యర్థులుగా, 397 మంది వార్డు స్థానాల కోసం నామినేషన్లను దాఖలు చేశారు. మండలంలో రామోజు కుమ్మరిగూడెం, చంద్రతండా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఇంకా 68 మంది సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో నిలువగా, మిగితా అభ్యర్థులు తమ నామినేషన్లను విరమించుకుని పోటీ నుంచి తప్పుకున్నారు. ఇక వార్డు స్థానాలకు 397 మంది నామినేషన్లు వేయగా, 32 మంది ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 325 మంది వార్డ్ స్థానాల కోసం పోటీ పడుతున్నారు.

● రాయపర్తి మండలంలో 40 గ్రామాలు, 342 వార్డులు ఉన్నాయి. సర్పంచ్ అభ్యర్థులుగా 269 మంది, వార్డు స్థానాలకు 719 మంది నామినేషన్లను దాఖలు చేశారు. మండలంలో కిష్టాపురం, సూర్యతండా, పోతిరెడ్డిపల్లి, బాలునాయక్ తండా, మురిపిరాల గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 153 మంది నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఇక మిగిలింది 35 గ్రామాలకు గాను 111 మంది సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలిచారు. అదేవిధంగా 719 వార్డు స్థానాల్లో 108 మంది ఏకగ్రీవమయ్యారు. 115 మంది నామినేషన్లను ఉపసంహరించుకోగా, 496 మంది వార్డు స్థానాల కోసం పోటీలో నిలిచారు.

పెట్టుబడి భారం..
ధర పైనే ఆధారం..

సాగు ఖర్చు పెరగడంతో రైతు విలవిల

వర్ధన్నపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు పెట్టుబడి భారంగా మారుతోంది. ఏటా అన్ని రకాల ఖర్చులు పెరగుతుండటంతో రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావడం లేదు. సొంత భూములు ఉండి మొదటి నుంచి వ్యవసాయం తప్ప ఇతర పనులు చేయలేని రైతులు గత్యంతరం లేక వరి సాగు చేస్తున్నారు. యంత్ర వినియోగం పెరగకపోవడంతో పూర్తిగా నేటికి కూలీలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రాక్టర్, వరి కోతకు మినహా మిగతా పనులన్నీ మనుషులతో చేయాల్సిందే. కూలీలు తక్కువగా ఉండటంతో ధరలు పెరుగుతున్నాయి. దీనికి తోడు వరి సాగు విస్తీర్ణం పెరగడంతో ఇతర అవసరాలు అధికమయ్యాయి. ట్రాక్టర్ స్పేర్ పార్ట్స్, ఇంజన్ ఆయిల్స్, కల్టివేటర్ పత్తీలు, కర్రులు, వగ్గీలు, నట్టు బోల్టులు, పంచర్ ఖర్చు విపరీతంగా పెరిగింది. గతంలో ఒకరిద్దరు చేసే పనిని ఇప్పుడు నలుగురు చేస్తున్నారు. ప్రధానంగా స్వల్పకాలిక వంగడాలు సాగు చేస్తుండటంతో రైతులకు విత్తనాల ఖర్చు బాగా పెరిగింది. ప్రైవేట్ కంపెనీలవే కావడంతో వారుచెప్పిన ధరకే కొనుగోలు చేయాల్సి వస్తోంది. గతంలో కంటే విత్తన భారం ఎక్కువగా ఉంటోంది. పురుగుమందులను సైతం ఏడాదికో రకం విడుదల చేసి ధరలు పెంచేస్తున్నారు.



వరి సాగువైపే మొగ్గు

పెట్టుబడి పెరిగినా తగినట్లుగా ధాన్యం ధర ఉంటే రైతులకు కొంత ఊరట ఉంటుంది. గతంలోలాగా క్వింటాకు రూ.2,200 నుంచి రూ.2,300 ఉంటే రైతులకు ఏమీ మిగలదు. కనీసం రూ.2,600 నుంచి రూ.2,800 ఉంటే పెరుగుతున్న ఖర్చులకు తగినట్లుగా ఆదాయం వస్తుందనే ఆశ ఉంటుంది. వ్యాపారులు సిండికేట్ అయి ధర తగ్గించి కొనుగోలు చేస్తే పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఇతర మెట్ట పంటల ధరలు దోబూచులాడుతుండడంతో చాలామంది రైతులు వరి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. ఏ ఆధారం లేని కౌలు రైతులు మరీ కుటుంబ పోషణకే పరిమితమయ్యేలా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

కార్లలో తిరుగుతూ గొర్రెల చోరీలు

- ఐదుగురు దొంగల ముఠాను అరెస్ట్ చేసిన పోలీసులు
- తాళం వేసిన పలు ఇళ్లల్లోనూ చోరీలు



నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గీసుగొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా పలు చోరీలకు పాల్పడ్డ ఐదుగురు దొంగల ముఠాను గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు సీఐ విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు చేపట్టారు. కొద్ది రోజుల్లోనే చోరీల గుట్టును ఛేదించి నిందితుల నుంచి రూ.1.6 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.

మామునూరు ఏసీపీ వెంకటేశ్ గీసుగొండ పోలీస్‌స్టేషన్‌లో నిందితులు చేసిన చోరీల వివరాలను గురువారం వెల్లడించారు. నర్సంపేట మండలం ముగ్దుంపురం గ్రామానికి చెందిన బాదావత్ సాయిచరణ్, పోచమ్మమైదాన్‌కు చెందిన ఎమ్డీ.గౌస్‌పాషా, కాశిబుగ్గకు చెందిన కోట విశ్వతేజ, వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన రాయపురం సాయి ముఠాగా ఏర్పడి పలు చోట్ల గొర్రెలతో పాటు, ఇళ్లల్లో చోరీలకు పాల్పడేవారు. గీసుగొండ మండలంలోని కొమ్మాల సమీపంలో మందల నుంచి గొర్రెలను కొద్ది రోజుల కిందట కారులో ఎత్తుకెళ్లారు. అలాగే పలు గ్రామాల్లో రెక్కీ నిర్వహించి ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు సీరియస్‌గా తీసుకొని టెక్నాలజీని ఉపయోగించి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ఊకల్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు కార్లు అనుమానాస్పదంగా రావడంతో వాటిని ఆపి తనిఖీ చేశారు. కారులో గొర్రెల మలం, వాటి వెంట్రుకలు కనిపించడంతో నిందితులను పోలీసులు విచారించారు. దీంతో వారు ఎక్కడెక్కడ చోరీలకు పాల్పడింది చెప్పారు.

కొమ్మాల గ్రామంలో ఇంటి తాళం పగులకొట్టి రూ.1,05,000 దొంగిలించినట్లు, ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలో రెండు ఇళ్లలో చోరీలకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు ఏసీపీ తెలిపారు. గీసుగొండ, మామునూరు, మిల్స్‌కాలనీ, మడికొండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడగా కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వీరు గతంలో చోరీలకు పాల్పడి జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు ఏసీపీ వివరించారు. సెల్ఫ్ డ్రైవ్ కారులో వీరు దొంగతనాలకు పాల్పడుతుండేవారన్నారు. గొర్రెలను వర్ధన్నపేట గ్రామానికి చెందిన అంగడి వెంకన్నకు అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారన్నారు. గొర్రెలను కొనుగోలు చేసిన వెంకన్నను కూడా అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కాగా, నిందితులను పట్టుకున్న సీఐ విశ్వేశ్వర్, ఎస్ఐ కుమార్, కానిస్టేబుళ్లు విజయ్, అరవింద్, సాయి, హరి, రజనికుమార్‌లను ఏసీపీ అభినందించారు.

పేటలో సమస్యల మేట

- సతమతమవుతున్న నర్సంపేట పట్టణవాసులు
- అధ్వానంగా అంతర్గత రోడ్లు.. అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు
- కలగా మిగిలిన మినీ పార్కు.. అండర్ డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణం



వల్లభ్‌నగర్‌లో డ్రెయినేజీ లేక రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

నర్సంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పేరుగొప్ప.. ఊరుదిబ్బ అన్న చందంగా మారింది నర్సంపేట పట్టణం పరిస్థితి. తెలంగాణ సాయుధ పోరాటాల గడ్డ, రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపందించి పేటగా పేరు గాంచింది. వరంగల్ జిల్లాలో అతిపెద్ద పట్టణంగా విరాజిల్లుతుంది. గ్రామపంచాయతీ నుంచి సెకడ్ గ్రేడ్ మునిసిపాలిటీ స్థాయికి ఎదిగిన పట్టణం ఇది. పాలకులు మారినా నర్సంపేట మోడల్ సిటీగా మారడం కలగానే మిగిలింది. గత బీఆర్ఎస్ పాలనలో పట్టణం కొంత మేరకు అభివృద్ధి చెందినా ఇంకా అనేక సమస్యలు పట్టణంలో తాండవిస్తున్నాయి. జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల ఏర్పాటైనా విద్య, వైద్య రంగాల్లో అనేక సమస్యలు పరిష్కారం కావడం లేదు. దీంతో విద్యార్థులు, ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వైద్యులు, మందుల కొరతతో అత్యవసర చికిత్సలు జరుగక ప్రమాదాలకు గురైన వారు వరంగల్, హైదరాబాద్ బాట పట్టాల్సి వస్తోంది.

రోడ్లపై మురుగు నీరు

నర్సంపేట పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. 50 వేలకు పైగా జనాభా కలిగిన పట్టణంలోని అనేక వార్డుల్లో మురుగు కాల్వలు లేక రోడ్ల పైనే మురుగు నీరు పారుతుంది. వర్షాలు కురిస్తే రోడ్లపై నీరు నిలిచి ప్రజలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. అనేక రోడ్లు బురదగా మారి ప్రజలు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల మౌలిక సౌకర్యాలు పరిష్కరించే దిశగా నేతలు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తాగునీటికి తండ్లాట

నర్సంపేట పట్టణ ప్రజలను ప్రధానంగా తాగునీటి సమస్య వేధిస్తోంది. మిషన్ భగీరథ పనులు పూర్తికాక అనేక వార్డుల ప్రజలకు తాగునీరందడం లేదు. ప్రతీ ఏటా వర్షాకాలం, వేసవికాలంలో తాగునీటి కోసం ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వాటర్ కొనుగోలు చేసి గొంతు తడుపుకోవాల్సి వస్తుంది. అలాగే పట్టణంలోని అన్నివార్డుల్లో అంతర్గత రోడ్లు అధ్వాన స్థితిలో ఉన్నాయి. పారిశుధ్య సమస్య ప్రజలను పట్టి పీడిస్తుంది. మాధన్నపేట కాల్వ అధ్వానంగా మారి సాగు నీరందించలేని పరిస్థితికి చేరింది. ఈ కాల్వలకు శాశ్వత (లైనింగ్) మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. పార్క్, అండర్ డ్రెయినేజీ నిర్మాణం పట్టణ ప్రజలకు కలగా మిగిలింది.

నిరుపయోగంగా డీఫ్లోరైడ్ ప్రాజెక్టు

నర్సంపేట, ఖానాపురం మండలం పరిధిలోని అయోధ్యనగర్ వద్ద టీడీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి రూ. 38 కోట్లతో డీఫ్లోరైడ్ ప్రాజెక్టును నిర్మించి అయోధ్యనగర్ వద్ద నీటిని నిల్వ చేసే బండ్‌ను నిర్మించారు. నర్సంపేట మండలం ఇప్పల్‌తండాకు వెళ్లే ప్రదేశంలో భారీ ఫిల్టర్ బెడ్లు, ట్యాంక్‌లను నిర్మించారు. కొంతకాలం పనిచేశాక ఈ ప్రాజెక్టు అలంకారప్రాయంగా మారింది. యంత్రాలన్నీ తుప్పు పట్టి పోయాయి. ఈ ప్రాజెక్టును వినియోగంలోకి తెస్తే నర్సంపేట పట్టణ ప్రజలకు రోజు నీరందించే అవకాశం ఉంటుంది. ఈ ప్రాజెక్టును వినియోగంలోకి తెచ్చి నర్సంపేట ప్రజలకు శాశ్వత తాగునీటి వసతి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



చెత్తా చెదారంతో అధ్వానంగా మారిన పాత 20వ వార్డు

సమస్యల వలయంలో వల్లభ్‌నగర్ గురుకులం

నర్సంపేటలోని వల్లభ్‌నగర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకులం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. ఈ పాఠశాలలో సుమారు 600 మంది విద్యార్థులు విద్యనభ్య సిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగు దొడ్లు లేక విద్యార్థులు పడుతున్న గోస వర్ణనాతీతంగా ఉంది. కేవలం 20 స్నానగదులు ఉండడంతో విద్యార్థులకు రోజూ వెతలు తప్పడం లేదు. గురుకుల భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షాకాలం ఉరుస్తోంది. అలాగే భోజనశాల, డార్మెటరీ పైపెచ్చులు ఊడిపోతుండడంతో విద్యార్థులు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. ఈ కళాశాల ఆవరణలోనే మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. ట్యాంక్‌కు కనెక్షన్ ఇవ్వక పోవడంతో తాగునీరు కళాశాల విద్యార్థులకు అందడం లేదు. విద్యార్థులు, ఉపాధ్యాయులు బావి, బోరు నీటిని తాగుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి గురుకులంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు కోరుతున్నారు.



వల్లభ్‌నగర్‌లోని గురుకులంలో పెచ్చులూడిన భవనం

నర్సంపేట దశ తిరిగేనా ?

- సీఎంతో ఎమ్మెల్యే దొంతికి సయోధ్య
- పట్టణానికి తొలిసారిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడిచిపోయింది. ఈ రెండేళ్ల కాలంలో ఎడముఖం, పెడముఖంగా ఉండి దూరమైన రాజకీయ బంధం దగ్గరై సీఎం రేవంత్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిల మధ్య ఇటీవల సఖ్యత కుదిరింది. ఇటీవల ఎమ్మెల్యే మాధవరెడ్డి తల్లి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించడానికి సీఎం వచ్చారు. అప్పటి నుంచి సీఎం, ఎమ్మెల్యే మధ్య సఖ్యత కుదిరింది. పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి పాదయాత్ర నిర్వహించిన సమయంలో నర్సంపేటలో ఆయన పాదయాత్ర జరగకుండా నిలువరించినప్పటి నుంచి సీఎంగా రేవంత్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా దూరంగా ఉన్నారు. రెండు విడతలుగా జరిగిన మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి చుక్కెదురైంది. దీంతో దొంతికి మంత్రి పదవి దక్కుతుందని ఆశించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల్లో నిరుత్సాహం చోటు చేసుకుంది. ఇద్దరి మధ్య సఖ్యత కుదిరాక హైదరాబాద్‌లో సీఎంను కలిసి నర్సంపేట నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. సీఎంకు ఎమ్మెల్యే మాధవరెడ్డికి మధ్య స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడడంతో నర్సంపేట నియోజకవర్గం అభివృద్ధికి బాటలు పడతాయని బావిస్తున్నారు. తొలిసారి నర్సంపేట పర్యటనకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి సభలో ఎమ్మెల్యే మాధవరెడ్డికి మంత్రి పదవి కేటాయించే విషయంలో హామీ ఇస్తారని అందరూ ఎదురు చూస్తున్నారు. నర్సంపే ట నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఏడు దశాబ్దాల కాలంలో మంత్రి పదవి దక్కలేదు.

మానసిక ఒత్తిడిని అధిగమించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మానసిక ఒత్తిడిని అధిగమించి ముందుకు సాగాలని సైకియాట్రిస్ట్ డాక్టర్ ప్రహసిత్ అన్నారు. గురువారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీనియర్ అధ్యాపకురాలు శ్రీదేవి అధ్యక్షతన కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మెంటల్ హెల్త్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రహసిత్ మాట్లాడుతూ.. చిన్న చిన్న చిట్కాలు పాటిస్తూ విద్యార్థులు ఒత్తిడిని జయించవచ్చునని వివరించారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుతూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ ఎం.సరిత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజ్‌కుమార్, అధ్యాపకులు జ్యోతిర్మయి, సంధ్యారాణి, రేవతి, శోభ, జ్యోతి, రజిత, భావన, ఫర్హాన, శ్రీదేవి, శ్రీధర్, బిక్షపతి, దయాకర్, సుమన్, రాజేంద్రప్రసాద్, రాజేష్, యాకయ్య, విజయ్ చందర్, రమేష్, భవానిసాగర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రహసిత్

బీఆర్ఎస్ కార్యాలయంలో హోమం



హోమం చేస్తున్న వినయ్ భాస్కర్ దంపతులు, చల్లా ధర్మారెడ్డి తదితరులు

హనుమకొండ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో దీక్షా దివస్ 11వ రోజు కార్యక్రమంలో భాగంగా కేసీఆర్ ఆరోగ్యంగా ఉండాలని మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ రుద్ర మహా మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ సీఎంగా ప్రజలకు సేవలందించాలని, ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని హోమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, సోదా కిరణ్, మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీనారాయణ, నార్లెడ్ల శ్రీధర్, పులి రజినీకాంత్, శ్రీధర్‌రావు, వినీల్‌రావు పాల్గొన్నారు.

ముల్కనూర్ బాద్‌షా ఎవరో ?

(5వ పేజీ తరువాయి)

జాలి ప్రమోద్‌రెడ్డికి అవకాశం కల్పించారు. మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ బీఆర్ఎస్ పార్టీ నుంచి దార్న శ్రీనివాస్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థిగా మాలోతు శ్రావణ్ బరిలో ఉన్నారు. 13మంది సర్పంచ్ పదవి కోసం నామినేషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్ నుంచి జాలి ప్రమోద్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి దార్న శ్రీనివాస్‌లు బరిలో నిలిచారు. మిగితా వారందరిచే నామినేషన్లు ఉపసంహరించుకునేలా చేశారు.

ముల్కనూర్ మేజర్ గ్రామపంచాయతీని సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయించారు. దీంతో జనరల్ వర్గానికి చెందిన జాలి ప్రమోద్‌రెడ్డి, బీసీ వర్గానికి చెందిన దార్న శ్రీనివాస్ గెలుపు కోసం కష్టపడుతున్నారు. ఇద్దరూ 45ఏళ్ల లోపు యువకులే కావడం, ప్రతి ఓటర్‌ను కలుస్తూ తమ గెలుపునకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సైతం అభ్యర్థుల గెలుపు కోసం వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నాయి. మేజర్ పంచాయతీల్లో కులాల వారీగా సమీకరణలు జరుపుతూ ఓట్లను రాబట్టుకునేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. ఇద్దరు యువకులు కావడం, గ్రామంలో ప్రతీఒక్కరితో సన్నిహిత సంబంధాలు ఉండడం, గెలుపెవరిని వరిస్తుందోనని జనం ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. ఈ నెల 11న జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎవరు సర్పంచ్‌గా గెలుస్తారో భవితవ్యం తెలనుంది.

అప్రెంటిషిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లాకు చెందిన ఇంటర్మీడియెట్‌లో పారా మెడికల్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులు అప్రెంటిషిప్ కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా డీఐఈవో ఎ. గోపాల్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. 2023, 24, 25 విద్యా సంవత్సరాల్లో పారా మెడికల్ కోర్సులు పూర్తి చేసి న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 31లోపు హనుమకొండ డీఐఈవో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

ఘనంగా దత్త జయంతి వేడుకలు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకొని గురువారం హనుమకొండలోని సాయిబాబా మందిరంలో పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు కిశోర్‌శర్మ, మణిశర్మ, చందులు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలతో దత్తాత్రేయ స్వామిని, సాయినాథుడిని అలంకరించారు. మధ్యాహ్నం హారతి అనంతరం విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో మందిర చైర్మన్ హరగోపాల్, ధర్మకర్తలు నిమ్మల శ్రీనివాస్, రాకం సదానందం, వెయ్యిగండ్ల రమేశ్, భక్తులు పాల్గొన్నారు.

జనవరిలో పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలు



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న శ్రీకాంత్, నాగరాజు

వడ్డెపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర మహాసభలు జనవరి 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు తెలిపారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 10, 11, 12 తేదీల్లో వరంగల్ నగరంలో నిర్వహించనున్న పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర 23వ మహాసభలను తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల కారణంగా జనవరి 5,6,7 తేదీలకు వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. వాయిదాపడిన విషయాన్ని విద్యార్థులు ప్రగతిశీల వాదులు, విద్యాభిమానులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్, ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, మహాసభల ఆహ్వాన సంఘం నాయకులు రాచర్ల బాలరాజు, పీడీఎస్‌యూ జిల్లా నేత సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఆదేశం

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని సూచించారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాల్లో ఉప సర్పంచ్ నిబంధనల ప్రకారం జరిగే విధంగా చూడాలన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ స్థానాలకు ఫారం 10 ప్రకారం ఫలితాల ప్రకటన చేపట్టాలన్నారు. నామినేషన్‌ల ప్రక్రియ ముగిసిన తర్వాత సంబంధిత గ్రామాల్లో పేజీ-2 రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తిచేయాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ కోసం వచ్చిన ప్రతీ దరఖాస్తు పరిశీలించి, తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఎటువంటి ఎన్నికల ప్రవర్తనా నియామావళి ఉల్లంఘనలు జరగకుండా పక్కా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా ముఖ్యంగా మారుతుందని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.

హనుమకొండ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. ఫొటో వివరాలతో కూడిన ఓటరు స్లిప్పుల పంపిణీని త్వరగా పూర్తి చేయాలన్నారు. మొదటి విడత, మూడో విడత మూడు మండలాల్లో విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ హక్కును వినియోగించుకునేందుకు ఎంపీడీవో కార్యాలయాల్లో ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ వీసీలో హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, జడ్పీ సీఈఓ రవి, ఇతర జిల్లా శాఖ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సైనిక పతాక దినోత్సవ నిధికి విరాళాలు ఇవ్వండి

దేశ సరిహద్దు రక్షణలో నిరంతరం బాధ్యతతో, త్యాగనిరతితో, అంకితభావంతో మహత్తర భూమిక పోషి స్తున్న సైనికుల సహాయార్థం సైనిక పతాక దినోత్సవ నిధిని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్, జిల్లా సైనిక బోర్డు చైర్‌పర్సన్ స్నేహ శబరీష్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. డిసెంబరు 5 సైనిక పతాక దినోత్సవం సందర్భంగా హను మకొండ జిల్లా ప్రజలంతా తమకు తోచిన ఉదార సహాయం సాయుధ దళాల పతాక నిధికి అందించి దేశ రక్షణలో జీవితాలను అంకితం చేసిన సైనికులు, వారి కుటుంబాల సహాయార్థం సహకరించాలని కోరారు. ఈ మేరకు వివిధ కళాశాలల నుంచి ఎన్‌సీసీ కేడెట్లు శుక్రవారం హుండీలతో పతాకాలను విక్ర యించే కార్యక్రమం చేపడుతారని, వారి చేతిలో ఉన్న పతాకాన్ని అందుకుని బదులుగా వారి దగ్గర ఉన్న హుండీలో ఆర్థిక సహాయం అందజేయాలని ఆ ప్రకటనలో కోరారు. ప్రతీ స్టిక్కర్ నామమాత్రపు విలువ రూ.2గా, కారు ఫ్లాగ్ రూ.5గా నిర్ణయించినట్లు తెలిపారు.

కలెక్టరేట్‌లో మాజీ సీఎం రోశయ్య వర్ధంతి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య వర్ధంతిని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, సహకార అధికారి సంజీవరెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, పర్యాటక శాఖ అధికారి శివాజీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, బీసీ వెల్ఫేర్ అధికారి నరసింహ స్వామి, ఇతర జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన డీఎస్ఏ క్రీడాకారులు

అభినందించిన డీవైఎస్‌వో



పతకాలు సాధించిన క్రీడాకారులతో డీవైఎస్‌వో అశోక్‌కుమార్

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఎస్‌జీఎఫ్ఐ అండర్-14, 19 ఆధ్వర్యంలో వేరువేరుగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్, రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో హనుమకొండ జేఎన్ఎస్ లోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ)కు చెందిన పలువురు క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ, రజత, కాంస్య పతకాలను కొల్లగొట్టారు. ఈ మేరకు గురువారం హనుమకొండ జేఎన్ఎస్‌లోని డీఎస్ఏ కార్యాలయంలో డీవైఎస్‌వో అశోక్‌కుమార్‌ను పతకాలు సాధించిన క్రీడాకారులు, కోచ్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ పతకాలు సాధించిన క్రీడాకారులను, కోచ్‌లను అభినందించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల మేడ్చల్‌లో నిర్వహించిన 8వ సీనియర్ రాష్ట్రస్థాయి వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో డీఎస్ఏ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాకు ట్రోఫీని అందించారన్నారు. అదేవిధంగా 8వ రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం, అండర్-19 రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో స్వర్ణం, అండర్-17 పాఠశాల వాలీబాల్ పోటీల్లో ద్వితీయ స్థానం, రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచారని తెలిపారు. అలాగే అండర్-14, 17 ఎస్‌జీఎఫ్ఐ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులతో పాటు డీఎస్ఏ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభతో రాణించి స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించి జిల్లాకు కీర్తి, ప్రతిష్ఠలు తీసుకరావడం అభినందనీయమన్నారు. అలాగే పలువురు జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు అర్హత సాధించారన్నారు. అదే విధంగా రాష్ట్రస్థాయి అండర్-14 పాఠశాలల రెజ్లింగ్ పోటీల్లో డీఎస్‌కు చెందిన క్రీడాకారులు మూడు స్వర్ణాలు, రెండు రజత పతకాలను కొల్లగొట్టి తమ ప్రతిభను చాటుకున్నారని అశోక్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన డీఎస్ఏ, జిల్లాకు చెందిన క్రీడాకారులను అభిందించారు. కార్యక్రమంలో డీఎస్ఏ కోచ్‌లు శ్రీమాన్, దేవిక, రమే ష్, బత్తిని జీవన్‌గౌడ్, రాజు, వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు, కోశాధికారి కృష్ణప్రసాద్, సభ్యులు సాంబయ్య, శ్రీధర్, ఎం. యాదిరెడ్డి, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఏఆర్ ఏఎస్సైలు

వరంగల్ క్రైం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హెడ్ కానిస్టేబుల్స్ నుంచి ఏఆర్ ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన మల్లారెడ్డి, సాధిక్ అలీ, బీర్‌దేవ్ గురువారం వరంగల్ సీపీ సన్‌ప్రీత్‌సింగ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అధికారులు అప్పగించిన పనులను సమర్థవంతంగా నిర్వర్తించి పోలీస్‌శాఖకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఈ సందర్భంగా సీపీ వారికికి సూచించారు.

ఆర్థిక సాయం అందజేత

మడికొండ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మడికొండ అంబేద్కర్ వీధికి చెందిన ఎలక్ట్రీషియన్ నాతి సదానందం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ అసోసియేషన్, మడికొండ సభ్యులైన తోటి ఎలక్ట్రీషియన్లు సదానందం కుటుంబానికి గురువారం పరామర్శించారు. అలాగే సదానందం కుటుంబ సభ్యులకు కలిసి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు వస్కుల కుమారస్వామి, ఉపాధ్యక్షుడు బి. రమేష్, ప్రధాన కార్యదర్శి ఎం.డి. అన్వర్, తోట వెంకన్న, గంగారపు రాజేందర్, గడ్డం రాజు, ఎం.డి. షర్ఫుద్దీన్, కుక్కల ప్రశాంత్, జి.రమేష్, ఎం.రాజేశ్, ఎస్.శివ, ఎం.డి. రహీం, ఎం.డి. రహీంపాషా, జి.ప్రశాంత్ ఉన్నారు.

ప్రత్యేక అలంకరణలో పద్మాక్షిదేవి

నయింనగర్, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): మార్గశిర మాసం శుద్ధ చతుర్థి సందర్భంగా హనుమ కొండలోని శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో గురు వారం విశేష పూజలు నిర్వహించారు. ప్రాతఃకాల సమయంలో అమ్మవారికి అభిషేకాలు చేసిన అనంతరం అలంకరించారు. మహా మంగళహారతి, కుంకుమార్చనలు జరిగాయి. ఆలయ పూజారులు నాగిళ్ల శంకర్ శర్మ, నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.





అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తదితరులు

ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా సాగుతున్న ప్రజా ప్రభుత్వం

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

రెడ్డికాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా డివిజన్లను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా గురువారం 4వ డివిజన్ అక్షర కాలనీ, యాదవ నగర్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ, పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

కొలతలు పక్కాగా ఉండాలి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- హంటర్‌రోడ్డులో అసెస్‌మెంట్ కొలతల పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అసెస్మెంట్ల కొలతలు పక్కాగా నమోదు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. గురువారం హంటర్‌రోడ్డు ప్రాంతంలోని న్యూశాయంపేట జంక్షన్, విల్లాస్‌రోడ్డు, భద్రకాళిబండ్‌తో పాటు పలు ప్రాంతాల్లో అసెస్మెంట్లపై క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. పనులు సమర్థవంతంగా చేసేందుకు తగు సూచనలు చేశారు. రెవెన్యూ అధికారుల నమోదు తీరుపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించే భవనాలకు అనుమతుల పత్రాలు పరిశీలించిన తర్వాతనే అందుకు అనుగుణంగా కొలతలు నమోదు చేయాలన్నారు. కమిషనర్ వెంట డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఆర్ఐలు రజిని, వార్డు ఆఫీసర్ శిరీష, బిల్ కలెక్టర్ రాజేశ్ తదితరులు ఉన్నారు.



న్యూశాయంపేటలో పత్రాలు పరిశీలిస్తున్న కమిషనర్ చహత్

జోరుగా నామినేషన్లు..

(5వ పేజీ తరువాయి)

మొత్తం 104 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 420 నామినేషన్లు దాఖలయ్యాయి. దామెర మండలంలో సర్పంచ్ స్థానాలకు 19, వార్డు స్థానాలకు 96, శాయంపేట మండలంలో సర్పంచ్ స్థానాలకు 42, వార్డు స్థానాలకు 143, నడికూడ మండలంలో సర్పంచ్ స్థానాలకు 15, వార్డు సభ్యుల స్థానాలకు 83, ఆత్మకూరు మండలంలో సర్పంచ్ స్థానాలకు 24, వార్డు సభ్యుల స్థానాలకు 92 నామినేషన్లు పడ్డాయి. బుధ,గురువారాల్లో కలుపుకొని దామెరలో సర్పంచ్ స్థానాలకు మొత్తం 27, శాయంపేట మండలంలో మొత్తం 72, నడికూడలో 31, ఆత్మకూరులో 30 నామినేన్లు పడగా, వార్డు స్థానాలకు దామెరలో మొత్తం 107, శాయంపేటలో 167, నడికూడలో 114, ఆత్మకూరులో 178 పడ్డాయి. రెండో విడత నామినేషన్ల గడవు శుక్రవారంతో ముగుస్తుంది. చివరి రోజు భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.

ముందస్తు మొక్కుల సందడి

(5వ పేజీ తరువాయి)

పూజాలు చేసి పూలు పండ్లు పసుపు కుంకుమ చీర సారెలు కొబ్బరికాయలు యాట మొక్కులను సమర్పించుకున్నారు. మేడారం పరిసరాల్లో చెట్ల కింద వంటలు చేసుకొని బంధుమిత్రులతో విందుభోజనాలు చేశారు. సుమారు 10వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవస్థానం అధికారులు తెలిపారు.

గద్దెలకు అలంకరణ

మేడారం వనదేవతలు సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెలను మామిడి తోరణాలు, పూల దండలతో దేవాదాయ శాఖ అధికారులు గురువారం అలంకరించారు. గోవిందరాజు గద్దె స్థాన చలనం కార్యక్రమంలో భాగంగా ముస్తాబు చేసినట్లు సిబ్బంది తెలిపారు.

గోవిందరాజు గద్దె స్థల చలన వేడుకలు

మేడారంలో గోవిందరాజు గద్దె స్థల చలన వేడుకలను పూజారులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామంలోని గోవిందరాజు ప్రధాన ఆలయంలో పూజారులు పూజలు నిర్వహించి మేడారం చేరుకున్నారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా గోవిందరాజు గద్దెపై రహస్య పూజలు నిర్వహించి దీప దూప నైవేద్యాలు సమర్పించారు. కాగా నూతన గద్దెలపైకి తరలించేందుకు సిద్ధంగా ఉండేలా గోవిందరాజు గద్దె స్థల చలన వేడుకలను జరుపుకున్నారు. ముందుగా పసుపు కుంకుమలు, పట్టు వస్త్రాలు సమర్పించి గడ్డపారకు కంకణం కట్టారు. ఆయుధ పూజలు నిర్వహించి గద్దెను కదిలించారు. అనంతరం అక్కడ నుండి ఐదు పిడికిలి మట్టిని సేకరించి భద్రపరిచారు. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఉపాధ్యక్షుడు కాక సారయ్య, పూజారులు మునిందర్, కృష్ణయ్య, రమేష్, రఘుపతిరావు, గోవర్ధన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. పగిడిద్దరాజు గద్దె స్థల చలన వేడుకను గత నెల 23వ తేదీనే నిర్వహించారు.

వి. శ్రీనివాసరావుకు బార్ ఘన నివాళి

వరంగల్ లీగల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీనియర్ న్యాయవాది వేముగంటి శ్రీనివాసరావు (82) మృతికి హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఘనంగా నివాళులర్పించారు. గురువారం జిల్లా కోర్టులోని నూతన బార్ అసోసియేషన్ హాల్‌లో ఆయన సంతాప కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఆయన అనారోగ్యంతో హనుమకొండలోని తన స్వగృహంలో మృతి చెందారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. శ్రీనివాసరావు 56 ఏళ్ల న్యాయవాద వృత్తిలో ఎందరికో ఆదర్శంగా నిలిచారని న్యాయవాదులు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వల్స సుధీర్, ప్రధాన కార్యదర్శులు కొత్త రవి, డి.రమాకాంత్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైరపాక జయాకర్, సీనియర్ న్యాయవాదులు వొద్దిరాజు వెంకటేశ్వర్‌రావు, వేముగంటి బాలకిషన్‌రావు, మాతంగి రమేష్‌బాబు, సిరిమల్ల అరుణ తదితర సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు. అంతకు ముందు హనుమకొండ జిల్లా సెషన్స్ జడ్జి కె.పట్టాభి రామారావు ఆధ్వర్యంలో జిల్లా కోర్టు హాల్‌లో సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది, అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్, జూనియర్ జడ్జిలు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన అంబేద్కర్ వర్ధంతి నిర్వహించాలి

అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్లయ్య




నినాదాలు చేస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

వడ్డెపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ వర్ధంతిని గ్రామగ్రామాన, పల్లెపల్లెన నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మధుపాక ఎల్లయ్య, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మల్ల అంబేద్కర్ పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బూజుగుండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శనివారం ఉదయం 9గంటలకు అంబేద్కర్ వర్థతి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమా లలతో అలంకరించి అంబేద్కర్ ఆశయాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ యువజన సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ యాదాల రవీందర్, జిల్లా నాయకులు జగపతి, మేకల ప్రవీన్, కళా వెంకట్ పాల్గొన్నారు.

వడ్డెపల్లిలో..

అంబేద్కర్ వర్ధంతిని శనివారం హనుమకొండ జిల్లాలో నిర్వహించాలని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అంబాల ప్రశాంత్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు బస్కే నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ వడ్డెపల్లి తెలంగాణ చౌరస్తా ప్రాంతంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను ప్రజలకు తెలియపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బీఎస్పీ జోనల్ ఇన్‌చార్జి వైనాల కార్తీక్, వరంగల్ జిల్లా ఇన్‌చార్జి వస్కుల ప్రవీన్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల భరత్, జిల్లా నాయకులు పోలెపాక రాజేందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



8న శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూర్ పుణ్యతిథి

సింహగురు

శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూర్ బ్రహ్మ-మధ్వ-గౌడీయ సంప్రదాయంలో 31వ ఆచార్యులు. ప్రపంచవ్యాప్త హరేకృష్ణ ఉద్యమాన్ని (ఇస్కాన్) స్థాపించిన ఏ.సి. భక్తివేదాంత స్వామి శ్రీల ప్రభుపాద ఆయన శిష్యుల్లో ప్రసిద్ధులు. సరస్వతి ఠాకూర్ బాల్యనామం బిమల ప్రసాద్ దత్తా. ఆయన తండ్రి ఠాకూర్ భక్తి వినోద... ఆ రోజుల్లో ప్రభావవంతమైన ఆచార్యుడు. శ్రీ చైతన్య మహాప్రభువు సందేశాన్ని ప్రపంచవ్యాప్తం చేయగల కుమారుని కోసం ఆయన భగవంతుణ్ణి ప్రార్థించారు. భక్తివినోద ఒడిశాలోని జగన్నాథ పూరీలో ప్రభుత్వ మేజిస్ట్రేట్‌గా పని చేస్తున్నప్పుడు... 1874 ఫిబ్రవరి ఆరున బిమల ప్రసాద్ అక్కడ జన్మించారు. బిమలప్రసాద్‌కు ఆరు నెలల వయసున్నప్పుడు... తండ్రి ఆయనను జగన్నాథుడి పాదాల దగ్గర ఉంచారు. అప్పుడు జగన్నాథుడి మెడలోని పెద్ద పూలదండ కిందపడి, ఆ బిడ్డ చుట్టూ అలంకృతమయింది. తండ్రి నుంచి హరేకృష్ణ మంత్రాన్ని, నరసింహదేవ మంత్రాన్ని పదేళ్ళ వయసులో ఉపదేశం పొందిన బిమల ప్రసాద్... 1901లో నవద్వీపంలో ప్రముఖ వైష్ణవ సాధువైన శ్రీల గౌరకిశోర దాస బాబాజీ మహరాజ్‌ను తన ఆధ్యాత్మిక గురువుగా స్వీకరించారు.

ఆధ్యాత్మికత అందరిదీ...

శ్రీచైతన్య మహాప్రభువు బోధనలకు నిబద్ధుడైన సరస్వతీ ఠాకూర్ వాటిని మన దేశంతో పాటు విదేశాలలో కూడా వ్యాప్తి చేశారు. వర్ణ, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు. అలాంటి వ్యవస్థ సనాతన ధర్మం కాదని భగవద్గీత నుంచి ఆయన ఉదహరించారు. 1913లో దక్షిణ కలకత్తాలో భాగవత్ ప్రెస్‌ను ఆయన స్థాపించారు. మొత్తం 61 రచనలను ప్రచురించారు, సవరణలు చేశారు, రచించారు. ఎనిమిది వేర్వేరు పత్రికలను కూడా నడిపారు. 1918లో, 44 ఏళ్ళ వయసులో సన్యాసం స్వీకరించి, 'గోస్వామి మహారాజ్' అనే బిరుదును పొందారు. అదే రోజున శ్రీధామ మాయాపూర్‌లో తన మొదటి వైష్ణవ మఠాన్ని (చైతన్య మఠం) స్థాపించారు. అది ఆయన ప్రచారానికి ప్రధాన కార్యాలయంగా మారింది. తన జీవితకాలంలో దేశ విదేశాల్లో 64 గౌడీయ మఠాలను స్థాపించి, భాగవతతత్త్వాన్ని వ్యాప్తి చేశారు. ఆధ్యాత్మిక జీవితాన్ని స్వీకరించడానికి భౌతికమైన అర్హతలు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. కుల, లింగ, జాతీయతలకు అతీతంగా... గత నేపథ్యం ఎలా ఉన్నప్పటికీ... నిజాయితీగా ఆధ్యాత్మిక జీవితాన్ని కోరుకొనేవారందరికీ ఉపదేశాన్ని అందించారు

లోకానికి మంత్ర సందేశం

శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకూర్ ఎంతో శక్తిమంతులైన, ధైర్యవంతులైన ప్రచారకులు. అందుకే ఆయన 'సింహగురు'గా ప్రసిద్ధి చెందారు. 1919 నుంచి 1929 వరకూ నిరంతరాయంగా భారతదేశం అంతటా పర్యటించారు. అసంఖ్యాకమైన ఉపన్యాసాలు ఇచ్చారు. చర్చలు జరిపారు. అప్రమాణికమైన మత శాఖలను ఖండించి, తుడిచిపెట్టారు. భౌతిక సుఖాలను, సౌకర్యాలను విసర్జించి, భక్తి ప్రచారానికి జీవితాంతం కృషి చేసిన ఆయన 62 ఏళ్ళ వయసులో... మార్గశిర బహుళ చవితి రోజున... జగన్నాథ పూరీలో ఈ భౌతిక ప్రపంచాన్ని విడిచిపెట్టారు. కులం, మతం, లింగం, దేశంతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణుడి పవిత్ర నామాలను, 'హరేకృష్ణ' మంత్రాన్ని జపించాలన్నదే ఆయన ఇచ్చిన ప్రధాన సందేశం.

శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షులు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9640086664

దైవమార్గం

అప్పుడే భక్తి పరిపూర్ణం



దేవుడు ప్రేమమయుడు. సర్వ జీవుల మీదా ఆయన ప్రేమ నిరవధికంగా, సమానంగా ప్రసరిస్తూ ఉంటుంది. ఆయన ప్రేమే ఈ విశాల విశ్వంగా రూపుదిద్దుకుంది. మానవులందరూ తన పట్ల, తోటి మానవుల పట్ల ప్రేమతో ఉండాలని ఆయన ఆశించాడు. "నీవు నిండు హృదయంతో నీ దేవుణ్ణి ఆరాధించు, ప్రేమించు", "నిన్ను ప్రేమించుకున్నట్టే నీ పొరుగువాణ్ణి ప్రేమించు, సేవించు" అనే రెండు వాక్యాలు బైబిల్‌లో ఉన్నాయి. వాటిలో ఒకటి దైవ ప్రేమకు, మరొకటి మానవ సేవకు సంకేతాలుగా కనిపిస్తాయి.

తాను ఎంతో ప్రేమించే ఈ లోకం భ్రష్టమవుతూ ఉంటే, దాన్ని పునరుద్ధరించాలని దేవుడు సంకల్పించాడు. తాను సృష్టించిన ఈ సుందర విశ్వానికి భంగం కలిగి, తనపై శపథం చేసిన సాతాను పన్నిన వలలో తన బిడ్డలు చిక్కుకొని భ్రష్టులయ్యే దశలో... లోకోద్ధరణ కోసం తన కుమారుడైన క్రీస్తును మానవ లోకానికి పంపించాడు. ఈ లోకం పట్ల ప్రేమతో ఏసుక్రీస్తు ప్రాణత్యాగం చేశాడు. ప్రభువు జననం, ఆయన చేసిన బోధలు, చూపిన మార్గం... ఇవన్నీ మానవుల పట్ల దైవానికి ఉన్న ప్రేమకు తార్కాణాలు. దీనిని క్రీస్తు జననంలోని పరమ రహస్యంగా క్రైస్తవులు విశ్వసిస్తారు. క్రిస్మస్‌కు ముందు నెలరోజులు... తెల్లవారుజామున ప్రార్థనలు చేస్తారు. రాబోయే దైవకుమారుడికి స్వాగతం చెప్పడానికి నిరీక్షిస్తారు.

ప్రభువులోని ప్రేమతత్త్వమే ఈ విశ్వంలో సేవగా పరిణమించింది. దేవునిపై ఉండే ప్రేమ సాటి మానవుడికి చేసే సేవగా రూపాంతరం చెందాలి. అప్పుడే దైవ భక్తి పరిపూర్ణం అవుతుంది. దేవుణ్ణి ప్రేమించే కొద్దీ విశ్వాన్ని ప్రేమిస్తాం, సేవిస్తాం. కాబట్టి దేవుణ్ణి ప్రేమించడం ఎంత ప్రధానమో... మన తోటివారిని ప్రేమించడం కూడా అంతే ముఖ్యం. ప్రేమించడం నేర్చినవాడు సేవను కూడా అలవోకగా నేర్చుకుంటాడు. దైవ ప్రేమ మానవసేవగా పరిణమించే క్రమం దీనిలో స్పష్టంగా కనిపిస్తుంది.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

భగవద్గీత

గీత గుర్తుకురాదేం?

నేను భగవద్గీత చాలాసార్లు చదివాను. చాలామంది రాసిన వ్యాఖ్యానాలూ చదివాను. చాలా శ్లోకాలు, వాటి అర్థాలు కంఠతా వచ్చేశాయి. ఇప్పటికిప్పుడు అప్పచెప్పమంటే వంద శ్లోకాలైనా చెప్పేయగలను. ఎన్నోసార్లు సమావేశాల్లో మాట్లాడడానికి వెళ్ళినప్పుడు, ఆ సమావేశం సందర్భాన్ని బట్టి ఒకటి రెండు శ్లోకాలు చెప్పాలని ముందుగా అనుకొని, ప్రసంగం మొదలుపెట్టేవాణ్ణి. ప్రసంగం అయిపోయాక గుర్తుకువచ్చేది.. శ్లోకం చెప్పడం మరచిపోయానని! ఇలా కాదని... చిన్న కాగితం మీద రాసుకొని, జేబులో పెట్టుకొని, ప్రసంగం మొదలుపెట్టి... అదీ మరచిపోయేవాణ్ణి. అలా కొన్నాళ్ళు గడిచాక... 'భగవద్గీత చెప్పే అర్హత నాకు లేదేమో! అందుకే ఆ సమయానికి అలా అవుతోంది' అని బాధపడేవాణ్ణి. దేవుణ్ణి పూర్తిగా నమ్మే నేను... నాలాంటివాళ్ళు భగవద్గీతను ప్రస్తావించడం దేవుడికి నచ్చకే ఇలా జరుగుతోందేమోనని సమాధానపడేవాణ్ణి. 'నాలో ఏం తక్కువయిందని దేవుడు ఇలా సమయానికి గీత గుర్తుకురాకుండా చేస్తున్నాడో?' అని మధనపడేవాణ్ణి కూడా.

ఆ శాపం సంగతి నాకు తెలుసు...


కొన్నాళ్ళ క్రితం రష్యాలో ఒక కోర్టు... భగవద్గీతను 'హింసను ప్రేరేపించే గ్రంథం' అంటూ నిషేధించిందనే వార్త భగ్గుమంది. భగవద్గీతను నమ్మేవారు, చదివినవారు... మనవాళ్ళందరూ ఖండించారు. రష్యా కోర్టు ఆదేశాలను గర్హిస్తూ అప్పట్లో... లోక్‌సభలో చర్చ జరిగింది. ఆ చర్చలో మాట్లాడుతున్నవారు రష్యా కోర్టు తీర్పును, భగవద్గీత గొప్పతనాన్ని చెబుతున్నారే తప్ప... అందులో ఒక శ్లోకాన్నీ చెప్పలేదు. మేమందరం కూర్చొని వింటున్నాం. అప్పటికే ఆరుసార్లు ఎంపీ అయిన సాయిప్రతాప్ (రాజంపేట) నాకు పాతికేళ్ళకుపైగా మంచి మిత్రుడు. అప్పుడప్పుడు మేమిద్దరమే ఉన్నప్పుడు.. భగవద్గీత శ్లోకాలు చెబుతూ ఉండేవాణ్ణి. ఆయనకు కూడా చాలా ఆసక్తి. "నువ్వు లేచి నాలుగు శ్లోకాలు చదువు అరుణ్" అన్నాడాయన. నా పక్కనే కూర్చున్న విశాఖపట్నం (అప్పటి) ఎంపీ సబ్బం హరి "లేలే! ఇప్పుడు కాకపోతే నీ భగవద్గీత ఇంకెప్పుడు పనికొస్తుంది?" అని తొందరపెట్టాడు. నేను "వద్దు, వద్దు" అన్నాను. నా బలహీనత నాకు తెలుసు. మొదలుపెట్టిన తరువాత ఏ శ్లోకమూ గుర్తుకురాదు. ఆ శాపం సంగతి నాకే తెలుసు!

గీతాప్రచారకుణ్ణి అయిపోయాను....

ఈలోపున సాయిప్రతాప్ వెళ్ళి... (అప్పటి) పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి పవన్ బన్సల్‌కు నా పేరు ఇచ్చి వచ్చేశారు. స్పీకర్ నా పేరు పిలిచారు. అప్పుడు "యదృచ్ఛా లాభసంతుష్టో" అనే శ్లోకంతో మొదలుపెట్టాను. సభలో ఊహించని స్పందన కనిపించింది. ఇంకో శ్లోకం చెప్పాను. ఆ రోజు నా ప్రసంగం తరువాత... లోక్‌సభలో తెలుగేతర సభ్యులందరికీ నేను గీతాప్రచారకుడిగా పరిచయమైపోయాను. నాకే ఆశ్చర్యం వేసింది. ఇంకా శ్లోకాలు గుర్తుకు వచ్చేస్తున్నాయి. 'అంటే... ఏ వేదికమీద శ్లోకం అవసరమో అక్కడే గీత గుర్తుకు వచ్చేలా దేవుడు ఏర్పాటు చేశాడన్నమాట' అనుకున్నాను. అంతకుముందు... రోజూ నోట్లో ఆడుతూ ఉండే ఎన్నో శ్లోకాలు ఉపన్యాసంలో చెబుదామంటే గుర్తుకు రాకపోవడం అనేది నాకు అర్థం కాని పజిల్‌గానే మిగిలిపోయింది.

ఆయనే నా వల్ల కాదన్నాడు...

ఆ తరువాత 'యత్ తద్ భగవతా ప్రోక్తం', 'శ్రావితస్త్వం మయా గుహ్యం...' తదితర శ్లోకాలు చదివాక... ఆ పజిల్ కొంతవరకూ విడిపోయింది. వాటి సారాంశం ఏమిటంటే... "యుద్ధంలో చెప్పావే... అవే మళ్ళీ ఒక్కసారి చెప్పు కృష్ణా!" అని అడిగాడు అర్జునుడు. "అప్పుడు చెప్పాను గానీ... ఇప్పుడు మళ్ళీ చెప్పమంటే ఎలా?" అన్నాడు కృష్ణుడు. "అప్పుడు ఒత్తిడిలో ఉండడం వల్ల సరిగ్గా బుర్రకెక్కలేదు. మళ్ళీ ఒకసారి చెప్పించుకోవాలని అప్పట్నుంచీ అనుకుంటున్నాను" అని చెప్పాడు అర్జునుడు. "చాల్లాలే!




అంత వివరంగా ధర్మసూక్ష్మాలను చెబితే... ఇప్పుడు మళ్ళీ చెప్పమంటావా... అది నావల్ల అయ్యే పని కాదు" అన్నాడు కృష్ణుడు. చెప్పడానికి చికాకువేసి ఆయన అలా అన్నాడేమో అనుకోవడానికి లేదు. ఎందుకంటే యుద్ధం మొదట్లో చెప్పిన గీత మళ్ళీ చెప్పలేదు గానీ... దానికి బదులు అలాంటిదే 'బ్రాహ్మణ గీత' మొత్తం చెప్పాడు. సాక్షాత్తూ కృష్ణ పరమాత్మే "మళ్ళీ చెప్పమంటే నా వల్లకాదు" అన్న గీత... సామాన్యుణ్ణి... నాకు గుర్తుకురాకపోతే బాధెందుకు! మళ్ళీ మళ్ళీ గుర్తొచ్చేవరకూ బట్టీపట్టడమే!

ఉండవల్లి అరుణ్‌కుమార్

యోగా

ఇగో... మంచీ చెడూ

'ఇగో' అనే పదానికి తెలుగులో 'అహం', 'అహంకారం', 'గర్వం' అనే అర్థాలు కనిపిస్తాయి. చాలామంది ఇగో అనే భావన ఒక వ్యక్తికి తప్పనిసరిగా ఉండాలని అనుకుంటూ ఉంటారు. వాస్తవానికి 'ఇగో' ఒక వ్యక్తి అస్తిత్వాన్ని నిలబెట్టే ఒక పరికరం. కత్తికి రెండు వైపులా పదును ఉన్నట్టు- ఈ 'ఇగో' మనిషిని గొప్పవాడినీ చేయగలదు. అతనిని పతనం అంచునా నిలబెట్టగలదు. 'ఇగో' అనే పదానికి మూడు అర్థాలు చెప్పుకున్నాం కదా... ఈ మూడు సమానార్థకాలు కావు. 'అహం' అంటే నేను. ఒక వ్యక్తి ఆత్మదర్శనానికి ఇది ప్రవేశద్వారంలాంటిది. 'అహంకారం' అంటే- 'నేను మాత్రమే' అనే భావన. దీనివల్ల కొంత మేలు జరుగుతూ ఉంటుంది. ఇది చెడుకు కూడా కారణమవుతుంది. ఇక మూడోది 'గర్వం'. ఇది ఒక వ్యక్తి పతనానికి రాజమార్గం. ఇది ఒక వ్యక్తి ఆలోచనా ధోరణిని, వ్యక్తిత్వాన్ని, ప్రవర్తనను ప్రభావితం చేస్తుంది. అంతేకాదు. అతని వ్యక్తిగతమైన, వృత్తిపరమైన, సామాజికపరమైన సంబంధాలను తుంచేస్తుంది. దీనివల్ల అనేక ప్రతికూల ఫలితాలు కలుగుతాయి. మన జీవితంలో మనకు ఎదురయ్యే సమస్యలు, దంపతుల మధ్య వచ్చే విభేదాలు, ఆఫీసుల్లో గొడవలు- వీటన్నింటికీ ఇదే కారణం. ఇది వ్యక్తుల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుంది. వ్యవస్థలను నిర్వీర్యం చేస్తుంది.



డాక్టర్ శరత్‌రెడ్డి
కార్డియాలజిస్ట్,
ట్రైనర్, హార్ట్‌ఫుల్‌నెస్
9440087532

పొంచి ఉన్న ప్రమాదం...

బాగా తెలివితేటలు ఉన్నవారందరినీ ఒక వేదికపైకి చేర్చి వారందరితోనూ పనిచేయించాలని అనుకోవడం సులభమే! దీనివల్ల కొన్ని కొత్త కొత్త ఆవిష్కరణలు జరుగుతాయి. గొప్ప ఆలోచనలు పెల్లుబుకుతాయి. కానీ ఇవన్నీ జరగాలంటే ఆ సమూహంలో ఉన్న వ్యక్తులు తమ తమ ఇగోలను వదిలేయాల్సి ఉంటుంది. అప్పుడే ఇతరుల ఆలోచనలను, అభిప్రాయాలను స్వాగతించగలుగుతారు. ఆధ్యాత్మిక మార్గంలో ఉన్నవారికి కూడా 'ఇగో' ఒక పెద్ద అడ్డంకి అనే చెప్పాలి. మనకు తెలియని, మనకన్నా గొప్ప శక్తిని చేరుకొనే పరిణామక్రమంలో వారు- 'నేను' అనే భావనను వదిలేయాల్సి ఉంటుంది. ఆ భావన వదిలేయకపోతే ఆ గొప్ప శక్తిలో మమేకం కాలేరు. మానవ లక్షణాలను వదిలేసి దైవ లక్షణాలను పొందే పరిణామక్రమంలో ఇగో అడ్డంపడుతుందని, దానిని వదిలేయగలిగినప్పుడే... పరమాత్మలో ఆత్మ విలీనం అయి- ఏకత్వ భావన సాధ్యమవుతుందని 'హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన' సంప్రదాయం చెబుతుంది. ఆ స్థితికి చేరుకున్నప్పుడు భౌతిక ప్రపంచంలో మన చుట్టూ జరిగే రకరకాల కార్యకలాపాలను సానుకూల ధోరణితో చూడగలుగుతాం.

ధ్యానమే మార్గం

నేను ఒక కార్డియాలజిస్ట్‌ను కాబట్టి నా దగ్గరకు అనేక మంది రకరకాల సమస్యలతో వస్తూ ఉంటారు. చికిత్స చేసినప్పుడు వారికి ఆరోగ్యం బాగుపడుతుంది. మళ్లీ సంతోషంగా జీవించగలుగుతూ ఉంటారు. 'నా వల్లే వారికి ఆరోగ్యం మెరుగుపడింది కాబట్టి.. నేను గొప్పవాణ్ణి' అనే భావన పెరిగిపోతే అది అనేక అనర్థాలకు దారి తీస్తుంది. అన్ని వృత్తుల్లో ఉన్నవారికీ ఇది వర్తిస్తుంది. 'ఇగో' పెరగడం వల్ల కొత్త ఆలోచనలకు స్వాగతించలేం. కొత్త ఆలోచనలను స్వాగతించకపోతే కొత్త సిద్ధాంతాలు.. ఆవిష్కరణలు అర్థం కావు. కొత్తగా నేర్చుకోవాలనే ఆలోచన రాకుండా ఇగో అడ్డం పడుతూ ఉంటుంది. తెలిసో తెలియకుండానో ఆ మార్గంలో ప్రయాణించడం మొదలుపెడితే వచ్చే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయి. కాబట్టి 'ఇగో'ను దూరంగా పెడితేనే మనం వ్యక్తిగత జీవితంలో, వృత్తిపరమైన జీవితంలో రాణించగలుగుతాం. ఈ స్థితికి చేరుకోవాలంటే 'ధ్యానం' ఒకటే మార్గం.

విగ్రహం వీటితో శ్రేష్ఠం



భగవంతుడి శక్తిని విశేషంగా గ్రహించే వాటినే 'విగ్రహాలు' అంటారు. అంతటి మహిమాన్వితమైన విగ్రహాలను ఎలా, ఏయే వస్తువులతో తయారు చెయ్యాలి?... ఈ సందేహాలకు ప్రాచీన శాస్త్రాలు చక్కని వివరణ ఇచ్చి, మార్గదర్శనం చేశాయి. ఆ వస్తువులకు 'ప్రతిమా ద్రవ్యాలు' అని పేరు. భగవంతుడు సర్వాంతర్యామి. ఆయన అణువణువునా ఉన్నప్పటికీ... శాస్త్రోక్త పద్ధతిలో, శాస్త్రం సూచించిన ద్రవ్యాలతో తయారు చేసిన విగ్రహాలలో విశేషమైన దైవ సాన్నిధ్యం లభిస్తుంది. అలాగే ఆయా ద్రవ్యాలతో తయారు చేసిన విగ్రహాలు తమవైన శుభ ఫలితాలను ఇస్తాయి. "రాయి, లోహం, ఇటుక, కొయ్య, మన్ను, సున్నం, దంతం, వర్ణం, నవ పాషాణం, మైనం అనే పది మాత్రమే శిల్పానికి తగిన పదార్థాలు" అని ప్రతిమా ద్రవ్యాల గురించి 'పింగళి నిఘంటువు' అనే ప్రాచీన గ్రంథం వివరించింది.

రాయి: 'శిల నుంచి ఉద్భవించినదే శిల్పం' అనే నానుడి ఉంది. శిలతో చేసిన విగ్రహాలు గర్భాలయంలో మూల విగ్రహాలుగా, ఇతతర పరివార దేవతలుగా మనకు దర్శనం ఇస్తాయి. శిల్పి ఉలిని శిలపై తాకించినప్పుడు ఓంకార శబ్దంలా ఘంటానాదం వస్తే దాన్ని 'పురుష శిల' అనీ, అదే శబ్దం దీర్ఘంగా వస్తే 'స్త్రీ శిల' అనీ, ఘంటానాదం కాకుండా సత్తును మోగించినప్పుడు వచ్చే శబ్దం వస్తే 'నపుంసక శిల' అనీ అంటారు. 'శిలలో దైవత్వం ఉందా? లేదా?' అనే విషయాన్ని ఈ శబ్ద పరీక్ష ద్వారా ఏకాగ్రతతో స్థపతి పరీక్షిస్తారు. పురుష శిల అయితే పురుష దేవతా విగ్రహాల తయారీలో, స్త్రీ శిల అయితే స్త్రీ దేవతా విగ్రహాల తయారీలో వినియోగిస్తారు. శివలింగం తయారీలో... మధ్యలో ఉండే శివలింగాన్ని పురుష శిలతో, పానవట్టాన్ని/ఆధారపీఠాన్ని స్త్రీశిలతో తయారు చేయాలని శైవ ఆగమాలు చెబుతున్నాయి. శబ్ద పరీక్షలో విఫలమయిన రాయిని నపుంసక శిలగా గుర్తించి, గర్భాలయం నుంచి ప్రాకారం వరకూ నిర్మాణాలలో వినియోగిస్తారు.

లోహం: దేవతా విగ్రహాల తయారీల లోహాన్ని మరొక ప్రముఖమైన ద్రవ్యంగా చెప్పుకోవచ్చు. సాధారణంగా దేవాలయాలలో లోహవిగ్రహాలు 'చలబింబాలు'గా పిలిచే ఉత్సవమూర్తులుగా ఆరాధనలు అందుకుంటాయి. అయితే... చిదంబరంలోని శ్రీనటరాజ స్వామి ఆలయంలో, శబరిమలలోని శ్రీఅయ్యప్పస్వామి ఆలయంలో ధ్రువమూర్తులుగా పూజలు అందుకుంటున్నవి లోహవిగ్రహాలే. వీటి తయారీకి రాగికన్నా వెండి, వెండికన్నా బంగారం ఉత్తమమైనవి. ఇటీవల హైదరాబాద్‌లో నిర్మించిన సమతామూర్తి ఆలయంలో నిత్యపూజలు అందుకుంటున్న శ్రీరామానుజుల ధ్రువబింబాన్ని 120 కిలోల బంగారాన్ని వినియోగించి... లోహమయంగా ప్రతిష్ఠించడం గమనించవచ్చు. లోహాలను తగుపాళ్ళలో కలిపి... పంచలోహ విగ్రహాలు తయారు చేసుకొని, ప్రాణప్రతిష్ఠ చేయకుండా ఆరాధించడం అనూచాన సంప్రదాయం. గృహస్థులు తమ ఇళ్ళలో నిత్యం ఆచరించే తిరువారాధన కోసం లోహవిగ్రహాలు మాత్రమే శ్రేష్ఠమైనవి. అవి కూడా నియమితమైన ఎత్తుకు మించకుండా చేయించుకోవాలి. శిలావిగ్రహాలను గృహాలలో అర్చించరు.

ఇటుక: శ్రేష్ఠమైన మట్టితో విగ్రహాలు చేసి, వాటిని కాల్చి, గట్టిపరచిన విగ్రహాలు ఇష్టికామూర్తులు. ఇవి ప్రాచీన కాలంలో ఉండేవి. వీటిని ఆరాధించడం ద్వారా భక్తులు తమ అభీష్టాలను తీర్చుకొనేవారు. ఇష్టాలను తీర్చేవి కాబట్టి 'ఇష్టికా విగ్రహాలు' అనీ, కాలక్రమేణా 'ఇటుక విగ్రహాలు' అని వ్యవహరించేవారు. ఈ ఆధునిక కాలంలో ఇటువంటి విగ్రహాలు చాలా అరుదు.

తెలుసుకుందాం

దంతం: ఏనుగు దంతంతో చాలా అందమైన విగ్రహాలు తయారు చేస్తారు. కానీ ఆ విగ్రహాలకు పూజలు చేయరు. అవి కేవలం అలంకారానికి మాత్రమే బాగుంటాయి. విలాసవంతంగా ఉంటాయి.

వర్ణం: వస్త్రంపై దేవతామూర్తుల రూపాన్ని బొమ్మ గీసి, దానికి వర్ణాలు అద్దుతారు. ఆ చిత్రాన్ని సైతం దేవుని మూర్తిగా భావించి పూజించవచ్చు.

నవపాషాణం: పాషాణం అంటే విషం. ఔషధ గుణాలను కూడా కలిగి ఉన్న అలాంటి తొమ్మిది పాషాణాలను... 'నవపాషాణాలు' అంటారు. ఆ తొమ్మిది ద్రవ్యాలను తగుపాళ్ళలో కలిపి, విగ్రహంగా మలచి పూజించవచ్చు. తమిళనాడు రాష్ట్రం పళనిలోని సుబ్రహ్మణ్యస్వామి మూర్తి నవపాషాణాలతో నిర్మితమయింది. ఆ స్వామికి చేసే పంచామృతాభిషేకం విశేషమైనదనీ, ఆ పంచామృతం సేవిస్తే పలు వ్యాధులు నయమవుతాయని భక్తుల విశ్వాసం.

రత్నం: మాణిక్యం, ముత్యం, పగడం, మరకతం, కనకపుష్యరాగం, వజ్రం, ఇంద్రనీలం, గోమేధికం, వైడూర్యం... ఇవి నవరత్నాలు. వీటిలో అతి పెద్ద పరిమాణంలో దొరికే రత్నాలను విగ్రహాలుగా మలచి పూజిస్తారు. గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమంలో మరకత రాజరాజేశ్వరీ విగ్రహాన్ని చూడవచ్చు.

కొయ్య: కలప తయారు చేసిన విగ్రహాలను 'దారుబింబాలు' అంటారు. ప్రతిమల తయారీలో దారువుది కూడా ముఖ్య స్థానమే. కేవలం అలంకార విగ్రహాలే కాదు... పూరీ క్షేత్రంలోని జగన్నాథుడు దారుమూర్తే. కంచి అత్తి వరదరాజస్వామి విగ్రహాన్ని అత్తి కొయ్యతో తయారు చేశారు కాబట్టి వాటికి ఆ పేరు వచ్చింది. అంతేకాదు... ఎన్నో గ్రామాల్లో, వాడలలో గ్రామదేవతలు, దేవర విగ్రహాలను కొయ్యతోనే చేసి, స్థాపించి, పూజిస్తారు.

మన్ను: నదీ తీరాలు, తటాకాలు, చెరువుల గట్ల మీద దొరికే శ్రేష్ఠమైన ఒండ్రుమట్టితో చేసే విగ్రహాలు అతి పవిత్రమైనవి. తాత్కాలికంగా పూజించడం కోసం మట్టి విగ్రహాలను తయారు చేస్తారు. గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రుల్లో మట్టి విగ్రహాలను పూజించడం మనం చూస్తున్నాం.

సున్నం: తెల్లని సున్నపురాయిని బాగా కాల్చి పొడి చేస్తారు. ఆ సున్నపు పొడిలో కరక్కాయ పొడి, నాటు బెల్లం నీళ్ళు లాంటి మరిన్ని ద్రవ్యాలు కలుపుతారు. వాటిని తిప్పి మెత్తగా చేసి, విగ్రహాలు తయారు చేస్తారు. మన ప్రాచీన ఆలయాలలో విమాన శిఖరం మీద, మండపాల సాలహారాల మీద నిర్మించినవి ఈ సున్నపు బొమ్మలే. వీటిని 'సుధాబింబాలు' అంటారు. మరో విశేషం ఏమిటంటే... కొన్ని ప్రాచీనమైన గుడుల గర్భాలయాల్లో మూల విగ్రహాలుగా కూడా ఇవి నిత్య పూజలు అందుకుంటున్నాయి. అలా మూలవిగ్రహాలుగా ప్రాణప్రతిష్ఠ చేయవలసిన సుధాబింబాల తయారీకి శిల్ప శాస్త్రాలు చాలా కఠినమైన నియమాలను నిర్దేశించాయి. శూలస్థాపన, రజ్జుబంధనము, కల్కలేపనం లాంటి ప్రక్రియల ద్వారా ఆడించిన సున్నంలో... పదహారు వివిధ ప్రాంతాల నుంచి సేకరించిన మృత్తికలను సమ్మిళితం చేసి ఈ విగ్రహాలు తయారు చేయాలి.


డి.యన్.వి. ప్రసాద్
స్థపతి, 9440525788

ఆరోగ్య భాగ్యం

"దైవం మనకు ఇచ్చిన రెండు వరాల విషయంలో మానవులు చాలా నిర్లక్ష్యం వహిస్తారు. మొదటిది... మంచి ఆరోగ్యం. రెండోది... తీరిక" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ చెప్పారు. మనలో చాలామంది ఆరోగ్యాన్ని పట్టించుకోరు. విశ్వాసి ఎప్పుడూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చెయ్యకూడదని, అల్లాహ్‌కు బలహీనుడైన విశ్వాసి కన్నా బలమైన విశ్వాసినే ఇష్టపడతాడని ఒక హదీసు (ప్రవక్త సూక్తి) చెబుతోంది. "కృతజ్ఞత తెలిపే నాలుక, స్మరించే హృదయం, కష్టపడే శరీరం, మంచి గుణం కలిగిన జీవిత భాగస్వామి... ఎవరికైతే ఇవి ఉన్నాయో... వారికి ప్రపంచంలోని వరాలన్నీ లభించినట్టే" అని మహనీయుడైన హజ్రత్ ఆలీ ఒక సందర్భంలో చెప్పారు. వాటితోపాటు ఆరోగ్యం కూడా గొప్ప వరం.

ఆరోగ్యం బాగుంటే ప్రశాంతంగా, మనస్ఫూర్తిగా, శ్రద్ధగా దైవారాధన చేసుకోవచ్చు. ఇతరులకు సహాయపడవచ్చు. ఆహారం తీసుకోవడంలో హెచ్చుతగ్గులు అనారోగ్య సమస్యలకు కారణం అవుతాయి. ఎక్కువగా తినడం మంచిదికాదని, దాన్ని నివారించుకోవాలనీ పలు హదీసులు చెప్పాయి. మనిషి ఆరోగ్యంగా, బలంగా ఉంటే అన్ని పనులు స్వయంగా చేయగలడు, సత్కార్యాలు ఆచరించగలడు. చక్కగా ప్రార్థనలు, ఉపవాసాలు, దానధర్మాలు చేయగలడు. ఇతరులకు ఏదైనా అవసరాలు కలిగితే వాటిని తీర్చగలడు, వారి పనులలో సహాయపడగలడు. దివ్యఖుర్ఆన్ పారాయణ, దైవస్మరణ చేయగలడు. కానీ మనిషి అనారోగ్యానికి గురైతే బలహీనపడతాడు. శరీరాన్ని నిస్సత్తువ ఆవహిస్తుంది. చురుకుగా తిరిగే సామర్థ్యం ఉండదు. చివరకు తన పని తాను చేసుకోవడానికి కూడా ఇతరుల సహాయం తీసుకోవాల్సి వస్తుంది. ఇలాంటి సందర్భంలో అతను స్వయంగా ఏ సత్కార్యం చెయ్యలేడు. నమాజ్ చేయలేడు. ఉపవాసాలు పాటించలేడు. వేరొకరికి సాయపడలేడు. అందుకే ఆరోగ్యం విషయంలో అందరం జాగ్రత్త వహించాలి. చేజేతులా ఆరోగ్యాన్ని పాడుచేసుకోకూడదు. సరైన అలవాట్లు లేకపోవడం, వ్యాయామం చేయకపోవడం లాంటివి సాధారణంగా అనారోగ్యానికి దారి తీస్తాయి. అందుకే అనారోగ్యానికి ముందు ఉన్న ఆరోగ్యాన్ని మహా భాగ్యంగా భావించాలని దైవ ప్రవక్త మహమ్మద్ సూచించారు.

సందేశం



• మహమ్మద్ వహీదుద్దీన్



చిరంజీవి, నయనతార జంటగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తోన్న చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. ఇప్పటికే విడుదలైన 'మీసాల పిల్లా...' అంటూ సాగే పాట సూపర్ హిట్ అయ్యింది. ఇప్పుడు మరో పాట 'శశిరేఖ'ను ఈనెల 8న విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

అఖండ విడుదల వాయిదా



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'అఖండ 2: తాండవం' సినిమా విడుదల వాయిదా పడింది. ఈ మేరకు చిత్ర నిర్మాణ సంస్థ 14 రీల్స్ ప్లస్ అధికారికంగా ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం సినిమా థియేటర్లలో నేడు విడుదల కావాల్సి ఉంది. 'కొన్ని అనివార్య కారణాల వల్ల అనుకున్న సమయానికి 'అఖండ 2' సినిమాను విడుదల చేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. ఈ విషయంలో నిరాశకు గురైన సినీ ప్రేక్షకులను మేము అర్థం చేసుకోగలం. వారందరికీ మా క్షమాపణలు తెలియజేస్తున్నాం. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. త్వరలోనే సానుకూల నిర్ణయంతో మీ ముందుకొస్తాం' అని చిత్ర నిర్మాణ సంస్థ పేర్కొంది.

విడుదలపై కోర్టు స్టే

గతంలో 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థతో కలసి ఈరోస్ సంస్థ మహేశ్‌బాబు నటించిన 'వన్ నేనొక్కడినే', 'ఆగడు' చిత్రాలను నిర్మించింది. ఆ చిత్రాల వల్ల వచ్చిన నష్టాలకు సంబంధించి ఈ రెండు సంస్థల మధ్య వివాదం నడుస్తోంది. 14 రీల్స్ సంస్థ నుంచి తమకు రావాల్సిన రూ.28 కోట్లు బకాయిలు ఇప్పించాలని మద్రాస్ హైకోర్టును ఈరోస్ సంస్థ ఆశ్రయించింది. 14 రీల్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్‌లో భాగస్వాములైన రామ్ ఆచంట, గోపీ ఆచంటనే 14 రీల్స్ ప్లస్ సంస్థను కూడా ప్రారంభించారని కోర్టు దృష్టికి తెచ్చింది. తమకు రావాల్సిన బకాయిలు మొత్తం చెల్లించే వరకు 'అఖండ' విడుదలను నిలిపివేయాలని హైకోర్టును కోరింది. ఈ వాదనలతో ఏకీభవించిన కోర్టు సినిమా విడుదలపై స్టే విధించింది. దీంతో గురువారం రాత్రి పడాల్సిన ప్రీమియర్ షోలు రద్దు అయ్యాయి.

శ్రీతేజ్ వైద్యానికి అండగా ఉంటాం

- నిర్మాత దిల్‌రాజు

హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద గతేడాది 'పుష్ప 2' చిత్రం విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాట ఘటనలో గాయపడిన చిన్నారి శ్రీతేజ్ వైద్యానికి అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్, నిర్మాత దిల్ రాజు స్పష్టం చేశారు. ఈ ఘటనలో తల్లిని కోల్పోయి, గాయాలతో బాధపడుతున్న శ్రీతేజ్‌ను ఆదుకునేందుకు హీరో అల్లు అర్జున్ మరోసారి ముందుకొచ్చారని, బాబు రిహాబిలిటేషన్ ఖర్చులు భరించేందుకు ఆయన అంగీకరించారని దిల్‌రాజు వెల్లడించారు.

'పుష్ప 2' చిత్రం విడుదల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో హైదరాబాద్‌కు చెందిన భాస్కర్ సతీమణి రేవతి కన్నుమూయగా, వారి కుమారుడు శ్రీతేజ్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ ఘటన జరిగి ఏడాది అయిన సందర్భంగా బాధితుని కుటుంబం ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరిస్తూ గురువారం ఆంధ్రజ్యోతి పత్రిక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. అల్లు అర్జున్ బాబు పేరిట చేసిన డిపాజిట్ డబ్బులు వైద్య ఖర్చులకు సరిపోవడం లేదనీ, అల్లు అర్జున్ మేనేజర్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా స్పందించలేదనీ భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై దిల్‌రాజు స్పందిస్తూ... భాస్కర్ తనను కలిశారని, అల్లు అర్జున్‌తో మాట్లాడి తదుపరి వైద్య ఖర్చులు కూడా భరించేలా ఒప్పించానని స్పష్టత ఇచ్చారు. శ్రీతేజ్ తండ్రి భాస్కర్, ఆయన సోదరుడితో కలసి గురువారం దిల్ రాజు ఫిల్మ్ ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడారు.



ఆ బాధ్యత నాదే

'సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో నష్టపోయిన భాస్కర్ కుటుంబానికి అండగా ఉంటాం. ఇంకో ఆరునెలలు కాదు, ఏడాదైనా శ్రీతేజ్‌ను రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచి, అవసరమైన చికిత్సలన్నీ చేయిస్తాం. అల్లు అర్జున్, అరవింద్ గారితో మాట్లాడి అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయించే బాధ్యత నాది. ఇంత చేసిన వాళ్లకు ఇప్పుడు ఇంకొంచెం సాయం చేయడంలో ఇబ్బందేం ఉండదు. మేమందరం ఆ కుటుంబంతో ఉంటాం. ఏదున్నా మేం చూసుకుంటాం' అని దిల్‌రాజు భరోసా ఇచ్చారు.

'తొక్కిసలాట ఘటన జరిగి ఏడాదవుతోంది. శ్రీతేజ్ పరిస్థితి కొంచెం కొంచెం మెరుగవుతుండడం అందరికీ సంతోషం కలిగించే విషయం. వారం క్రితం భాస్కర్ నన్ను కలిశారు. ఇంకో ఆరు నెలల పాటు బాబును రిహాబిలిటేషన్ సెంటర్‌లో ఉంచి, అవసరమైన ఫిజియోథెరపీ, చేయిస్తే పరిస్థితి మరింత మెరుగవుతుందని డాక్టర్ సూచించారనీ, బాబు వైద్యం కోసం మరి కొంచెం సాయం కావాలి అని భాస్కర్ అడిగాడు. దాని గురించి కూడా, అల్లు అరవింద్ గారితో, అల్లు అర్జున్ గారితో మాట్లాడి చేయిస్తాను అని చెప్పాను. భాస్కర్ గారి కుటుంబాన్ని ఆదుకునేందుకు అప్పట్లోనే అల్లు అర్జున్ ద్వారా రూ. 2 కోట్లు డిపాజిట్ చేయించాను. దానిపై వచ్చే వడ్డీ నెలకు రూ. 75 వేలు. ఆ మొత్తాన్ని వారి కుటుంబ ఖర్చులకు, బాబు వైద్యం కోసం ఉపయోగించుకునేలా ఏర్పాటు చేశాం. అలాగే అప్పుడు హాస్పిటల్ ఖర్చులకూ అల్లు అర్జున్ రూ. 70 లక్షలు చెల్లించారు' అని దిల్‌రాజు పేర్కొన్నారు.

అల్లు అర్జున్ అండగా నిలిచారు

అల్లు అర్జున్ బాబు వైద్యానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి, అండగా నిలిచారనీ, ఆయన సపోర్ట్ వల్లే బాబును ఈ స్టేజ్ వరకూ తీసుకురాగలిగామని భాస్కర్ తెలిపారు. రిహాబ్‌లో ఉంచి చికిత్స కొనసాగిస్తే బాబు పరిస్థితి మెరుగవుతుందని డాక్టర్ చెప్పడంతో దిల్‌రాజు గారిని కలవగానే, అల్లు అర్జున్‌గారితో మాట్లాడి ఖర్చులు భరించేలా ఒప్పించారు అని చెప్పారు.



తమిళ సినీ దిగ్గజ నిర్మాత ఏవీఎం శరవణన్(86) భౌతికంగా దూరమయ్యారు. తన 85వ పుట్టినరోజు వేడుకలను జరుపుకొన్న మరుసటి రోజున అంటే డిసెంబరు 4న ఆయన కన్నుమూశారు. వృద్ధాప్యం కారణంగా ఆయన చెన్నైలోని తన స్వగృహంలో తుదిశ్వాస విడిచినట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఆయన భౌతికకాయాన్ని స్థానిక సాలిగ్రామంలోని ఏవీఎం స్టూడియోలో సినీ ప్రముఖులు, అభిమానుల సందర్శనార్థం ఉంచారు.. కాగా, ఏవీఎం శరవణన్ అంత్యక్రియలు గురువారం సాయంత్రం స్థానిక సాలిగ్రామంలోని శ్మశానవాటికలో పూర్తి చేశారు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలోని పురాతన సినీ నిర్మాణ సంస్థల్లో ఏవీఎం ప్రొడక్షన్స్ ఒకటి. ఈ సంస్థ సుమారుగా 175కు పైగా సినిమాలను నిర్మించింది. ఈ సంస్థ వ్యవస్థాపకుడు ఏవీ మెయ్యప్పన్ కుమారుల్లో ఏవీఎం శరవణన్ ఒకరు. ఏవీఎం ప్రొడక్షన్‌ను ప్రగతిపథంలో నడిపించడంలో ఆయన కీలక పాత్రను పోషించారు. ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌గా కూడా పనిచేశారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఆయనను 'కలైమామణి' పురస్కారంతో సత్కరించింది.

దిగ్గజ నిర్మాత ఏవీఎం శరవణన్ కన్నుమూత

- సినీ ప్రముఖుల అశ్రునివాళి
- ముగిసిన అంత్యక్రియలు
- దక్షిణాది చిత్ర పరిశ్రమకు ఎనలేని సేవలు

నాలుగు సుగుణాలు



కృషి, ప్రణాళిక, పట్టుదల, వినయం అనే నాలుగు సుగుణాలతో తన తండ్రి ఏవీ మెయ్యప్పన్ చెట్టియార్ నిర్దేశించిన మార్గాన్ని అనుసరించి ఏవీఎం అనే మూడు అక్షరాలతో స్థాపించిన సినీ నిర్మాణ సంస్థను శరవణన్ భారతీయ చలనచిత్రపరిశ్రమలో అగ్రగామిగా నిలిపారు. ఏవీఎం శరవణన్ 1939 డిసెంబరు మూడో తేదీన జన్మించారు. తండ్రి మార్గదర్శకత్వంలో నడుస్తూ 1958లో 'మామియార్ మెచ్చియ మరుమగల్' అనే చిత్ర నిర్మాణంతో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. తమిళ, తెలుగు, హిందీ సహా అనేక భాషల్లో చిత్రాలను నిర్మించారు. తమిళంలో ఎంజీఆర్, శివాజీ, జెమిని గణేశన్, ఎస్ఎస్ఆర్, ముత్తురామన్, జయశంకర్, రవిచంద్రన్, కె.భాగ్యరాజ్, విజయకాంత్, విజయ్, అజిత్, సూర్య, విక్రమ్, మాధవన్ ఇలా అగ్ర నటులతో ఆయన సినిమాలు నిర్మించారు. రజనీకాంత్‌తో 'పోకిరి రాజా', 'పాయుంపులి', 'నల్లవన్‌కు నల్లవన్', 'మిస్టర్ భరత్', 'మనిదన్', 'రాజా చిన్న రాజా', 'ఎజమాన్' వంటి చిత్రాలను నిర్మించారు. మరో అగ్ర నటుడు కమల్‌తో 'సకలకళా వల్లవన్', 'తూంగాదే తంబి తంగాదే', 'పేర్ సెల్లుం పిళ్లై' వంటి పలు చిత్రాలను నిర్మించారు. 2007లో రజనీకాంత్ హీరోగా 'శివాజీ' చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించగా ఘన విజయం సాధించింది. ఈ సినిమాను తన తండ్రి ఏవీ మెయ్యప్పన్ శతజయంతి రోజున విడుదల చేశారు. ఏవీఎం నిర్మాణ సంస్థలో వచ్చిన 168వ చిత్రమిది. ఎస్.శంకర్ దర్శకత్వం వహించారు.

అగ్ర హీరోలతో తెలుగు చిత్రాలు

ఏవీఎం ప్రొడక్షన్స్ తెలుగులో కూడా పలు చిత్రాలను నిర్మించింది. ఎన్టీఆర్, ఏయన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, వెంకటేశ్, రానా.. ఇలా నాలుగు తరాల హీరోలతో సినిమాలు నిర్మించిన ఘనత ఈ సంస్థది. 'భూకైలాస్', 'నాదీ ఆడజన్మే', 'లేత మనసులు', 'భక్త ప్రహ్లాద' 'అవే కళ్ళు', 'రాము', 'చిట్టి చెల్లెలు', 'మూగనోము', 'పుట్టినిల్లు మెట్టినిల్లు', 'నోము', 'పూజ' వంటి చిత్రాలను ఏవీ మెయ్యప్ప చెట్టియార్ నిర్మించారు. పిల్లలు ప్రధాన పాత్రధారులుగా వరుసగా మూడేళ్ల 'లేత మనసులు', 'రాము', 'మూగనోము' చిత్రాలను ఏవీఎం సంస్థ నిర్మించడం, ఆ మూడూ హిట్ కావడం గమనార్హం. ఈ చిత్రాలకు శరవణన్ నిర్మాణ సారథిగా వ్యవహరించారు. ఇవి కాక 'పున్నమి నాగు', 'మూడు ముళ్ళు', 'బామ్మమాట బంగారుబాట', 'సంసారం ఒక చదరంగం', 'ఆ ఒక్కటీ అడక్కు', 'జెమిని', 'లీడర్', 'ఎవరైనా ఎప్పుడైనా' వంటి చిత్రాలను ఏవీఎం శరవణన్ నిర్మించారు. వీటితో పాటు తమిళంలో హిట్ అయిన 'మెరుపు కలలు', 'శివాజీ' వంటి చిత్రాలను తెలుగులో కూడా విడుదల చేశారు.

ముక్కుసూటి మనిషి..

ఏవీఎం నిర్మాణ సంస్థ దాదాపుగా 175కు పైగా చిత్రాలను నిర్మించింది. కొన్నేళ్ళుగా చిత్ర నిర్మాణానికి దూరంగా ఉంటోంది. ఆయన మనవరాళ్ళు అపర్ణ, అరుణలు కొన్ని వెబ్ సిరీస్‌లు నిర్మిస్తున్నారు. చిత్ర నిర్మాణాన్ని ఎందుకు నిలిపివేశారని శరవణన్‌ను స్నేహితులు ప్రశ్నించగా.. 'ఇప్పుడు చిత్ర నిర్మాణ వ్యయంతో పాటు నటీనటుల పారితోషికాలు భారీగా పెరిగిపోయాయి. నిర్మాతలకు తగిన గౌరవ మర్యాదలు లేవు. అందుకే చిత్ర నిర్మాణాలను ఆపివేశాను' అంటూ సమాధానమిచ్చారు. ఓ ప్రముఖ హీరో ఓ సందర్భంలో శరవణన్‌తో మాట్లాడుతూ, తనకు పారితోషికం ఇవ్వవద్దని ఆస్తి రూపంలో ఏవీఎం స్టూడియోలో ఏదైనా ఇవ్వాలని అడగ్గా.. అలాంటి సినిమా తీయాల్సిన అవసరం మాకు లేదని నిర్మొహమాటంగా చెప్పిన ముక్కుసూటి మనిషి ఏవీఎం శరవణన్.

తండ్రి ప్రాణ స్నేహితుడికి ప్రత్యేక గౌరవం

తన తండ్రి ఏవీ మెయ్యప్ప చెట్టియార్ అంటే శరవణన్‌కు అమితమైన గౌరవం. ఏ వేదికపై ప్రసంగించినా తన తండ్రి గురించి ఎంతో ఉన్నతంగా మాట్లాడేవారు. అలాగే తన తండ్రి ప్రాణ స్నేహితుడైన ఎస్పీ ముత్తురామన్ అంటే ఏవీఎం శరవణన్‌కు అమితమైన గౌరవం. అందుకే ఏవీఎం స్టూడియోలో శాశ్వత గదిని ముత్తురామన్‌కు కేటాయించడంతో పాటు తాము నిర్మించే చిత్రాల్లో సహ నిర్మాతగా ఆయన్ని చేర్చుకున్న గొప్ప మానవతావాది.

చేతులు కట్టుకునే..

ఐశ్వర్యవంతమైన కుటుంబంలో జన్మించినా.. ఆయన నిరాడంబరుడు, నిగర్వి అని కోలీవుడ్ వర్గాలు గుర్తు చేసుకుంటున్నాయి. ఆయన ఎక్కడ కనిపించినా, ఏ కార్యక్రమానికి వచ్చినా రెండు చేతులు కట్టుకుని ఒక సాధారణ వ్యక్తిగా నిలబడేవారు. అదే తర్వాతి రోజుల్లో ఆయనకు ఒక గుర్తుగా మారిపోయింది. తన కన్నా చిన్నవయసువారైన ప్రముఖులను కలిసిన సందర్భాల్లోనూ ఆయన రెండు చేతులు కట్టుకునే ఉండేవారు.

సినీ ప్రముఖుల నివాళి





ఏవీఎం స్టూడియోలో ఉన్న శరవణన్ భౌతికకాయానికి తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌తో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు నివాళులర్పించారు. రజనీకాంత్, సూర్య, విశాల్, ఈశ్వరీ రావు, ఆర్.పార్తిబన్, విక్రమ్ ప్రభు, చిన్న జయంతి, కరుణాకరన్, శివకుమార్, కేఆర్ విజయ, నాజర్, విజయకుమార్, అరుణ్ విజయ్ తదితరులు శరవణన్‌కు నివాళులర్పించారు. -చెన్నై, (ఆంధ్రజ్యోతి)

ప్రేక్షకుల ముందుకు ఘంటసాల బయోపిక్



అద్భుత గాయకుడు, దిగ్గజ సంగీత దర్శకుడు ఘంటసాల జీవితాన్ని ఆధారంగా చేసుకుని రూపొందించిన బయోపిక్ 'ఘంటసాల ద గ్రేట్' విడుదలకు సిద్ధమైంది. ఇందులో ఘంటసాలగా కృష్ణచైతన్య, సావిత్రమ్మగా మృదుల నటించారు. సుమన్ కీలక పాత్ర పోషించిన ఈ చిత్రాన్ని ఈ నెల 12న విడుదల చేస్తున్నట్లు దర్శకుడు సి.హెచ్.రామారావు చెప్పారు. ఘంటసాల జీవితంలోని విభిన్న ఘట్టాలను ఈ సినిమాలో కళ్లకు కట్టినట్లు చూపించారు. 'ఘంటాసాలగారి వీరాభిమానుల కోరిక మేరకు లండన్, సింగపూర్, ఆస్ట్రేలియా, అమెరికా దేశాల్లో ప్రత్యేక ప్రీవ్యూలు నిర్వహించాం. సినిమా చూసిన వారంతా భావోద్వేగానికి గురయ్యారు. తెలుగు ప్రేక్షకుల కోసం ఈ నెల 12న విడుదల చేస్తున్నాం. దానికి ముందుగా ఈ నెల ఐదున ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను భారీ స్థాయిలో నిర్వహించబోతున్నాం. ఘంటసాలగారి అమరగానాన్ని, ఆయన అసామన్య జీవితాన్ని మరోసారి గుర్తు చేసేలా ఈ సినిమా ఉంటుంది' అని రామారావు అన్నారు.

గుండెధైర్యం లేనివాళ్లు చూడొద్దు

- బన్నీ వాసు



అఖిల్‌రాజ్, త్రిగుణ్, హెబ్బాపటేల్ ప్రధాన తారాగణంగా తెరకెక్కిన సూపర్ నేచురల్ హారర్ 'ఈషా'. నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ సమర్పణలో హేమ వెంకటేశ్వరరావు నిర్మించారు. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. నిర్మాతలు వంశీ నందిపాటి, బన్నీ వాసు ఈ నెల 12న విడుదల చేస్తున్నారు. చిత్రబృందం గురువారం నిర్వహించిన కార్యక్రమంలో టైటిల్‌ను ప్రకటించి, గ్లింప్స్‌ను విడుదల చేసింది. బన్నీ వాస్ మాట్లాడుతూ 'దెయ్యాలు, ఆత్మలను నేను నమ్మను. కానీ ఈ సినిమా చూశాక నేను కూడా నాలుగు సార్లు భయపడ్డాను. కంటెంట్‌లో దమ్ము ఉందని అర్థమైంది. చివరి పదిహేను నిమిషాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తుంది. గుండెధైర్యం లేనివాళ్లు ఈ సినిమాను చూడొద్దు' అని అన్నారు. వంశీ నందిపాటి మాట్లాడుతూ 'డిసెంబర్ 12న అందరినీ భయపెడుతున్నాం. నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంది. తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు. ఈ సందర్భంగా దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'శ్రీనివాస్ ఎంతో కష్టపడి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. వంశీ, వాసు చిన్న సినిమాలను ప్రేక్షకులకు చేరువ చేస్తున్న తీరు అద్భుతం' అని ప్రశంసించారు. బన్నీ వాసు, వంశీ నందిపాటి విడుదల చేయడం మా సినిమా విజయంపై నమ్మకాన్ని పెంచింది అని శ్రీనివాస్ మన్నె చెప్పారు.



క్వార్టర్స్‌లో తన్వీ, అస్మిత

గువాహటి: భారత షట్లర్లు తన్వీ శర్మ, అస్మిత చలిహ గువాహటి మాస్టర్స్ సూపర్ 100 బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్స్‌కు చేరారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్స్‌లో ప్రపంచ 41వ ర్యాంకర్, 8వ సీడ్ క్రీడాకారిణి తన్వీ 21-17, 23-21 తేడాతో పన్నచెట్ (థాయ్‌లాండ్)ను వరుస గేముల్లో ఓడించింది. అలాగే 96వ ర్యాంకర్ అస్మిత 16-21, 21-17, 21-16 తేడాతో తనకన్నా మెరుగైన ప్లేయర్, భారత్‌కే చెందిన ఐదో సీడ్ అన్మోల్ ఖర్బ్ (49వ ర్యాంక్)పై గెలిచింది. మరో మ్యాచ్‌లో నెగ్గిన ఇషానీ బారువా కూడా క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది.



100 అందేనా?

మరో 16 శతకాల దూరంలో విరాట్

దక్షిణాఫ్రికాపై రెండు వన్డేలలో వరుసగా రెండు సెంచరీలు బాదిన విరాట్ కోహ్లీ మళ్లీ తన పూర్వపు రోజుల్ని గుర్తు చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ స్టార్ బ్యాటర్‌కు సంబంధించి దేశ క్రికెట్‌లో పెద్ద చర్చ నడుస్తోంది. అది..విరాట్ శతకాల 'సెంచరీ' చేస్తాడా అని! 37 ఏళ్ల కోహ్లీ సఫారీలపై రెండు శతకాలను (135, 102) కూడా మంచి స్ట్రయిక్ రేట్‌తో సాధించాడు. ఇటీవలి కాలంలో అతడి స్ట్రయిక్ రేట్‌పై విమర్శలు వ్యక్తమవుతున్న తరుణంలో..వాటిని తిప్పికొడుతూ వేగంగా పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికాపై రెండో వన్డేలో సెంచరీ.. విరాట్ కెరీర్‌లో 84వది. తాజా ఫామ్ 2016-17లో కోహ్లీ అద్భుత ప్రదర్శన రోజులను జ్ఞప్తికి తెస్తోంది. దీంతో అన్ని ఫార్మాట్లలో కలిపి సచిన్ చేసిన వంద శతకాల రికార్డును అతడు చేరుకోవడం సాధ్యం కావచ్చేమోనన్న చర్చ జరుగుతోంది. వన్డే వరల్డ్ కప్ 2027 అక్టోబరు-నవంబరులో దక్షిణాఫ్రికాలో జరగనుంది. ఇదే ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ, క్రమం తప్పకుండా జట్టుకు ఎంపికైతే కనుక మెగా టోర్నీకి ముందు కోహ్లీకి మరో 25 వన్డేలు ఆడే అవకాశం లభిస్తుంది.

ఆత్మవిశ్వాసం రెండింతలు..

ఇటీవలి కాలంలో పెద్దగా ఫామ్‌లో లేని విరాట్‌కు..సఫారీలపై చేసిన రెండు సెంచరీలు అతడిలో ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపజేశాయి. కోహ్లీ గత రికార్డులను పరిశీలిస్తే ప్రతి 5-6 అంతర్జాతీయ ఇన్నింగ్స్‌లో ఒక శతకం సాధించాడు. కొన్ని సంవత్సరాల్లో అయితే ఆ రికార్డు మరింత మెరుగ్గా ఉండడం విశేషం. కానీ వయస్సు, కొన్ని అంతర్జాతీయ మ్యాచ్‌లే ఆడడం వల్ల కొంతకాలంగా అతడి శతకాల నిష్పత్తి తగ్గింది. పైగా టెస్టులు, టీ20లనుంచి ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇక్కడి నుంచి..ప్రతి 4, 5 ఇన్నింగ్స్‌కు ఒకటి చొప్పున సెంచరీ కొట్టే రేట్‌ను కనుక విరాట్ కొనసాగిస్తే..12-16 శతకాలు సాధించేందుకు కనీసం 50-60 మ్యాచ్‌లు అవసరమవుతాయి..కానీ 2027 వన్డే వరల్డ్ కప్‌తో కలిపి కోహ్లీ కొంచెం అటూఇటూగా 36 మ్యాచ్‌లు మాత్రమే ఆడే చాన్సుంది. ఈ కోణంలో చూస్తే కోహ్లీ 2027 నాటికి వంద శతకాలు చేసే చాన్సులు దాదాపు కనిపించడం లేదు. అయితే పైన పేర్కొన్న మ్యాచ్‌ల కన్నా ఎక్కువ ఆడడంతోపాటు అత్యధిక సెంచరీల రేటు కలిగిన 2016-17 నాటి ఫామ్‌ను అందుకొంటే కోహ్లీ శతకాల 'సెంచరీ'కి చేరువ అయ్యే అవకాశాలు లేకపోలేదు. కానీ వన్డే వరల్డ్‌కప్ తర్వాత కోహ్లీ రిటైరవడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది.

ఆ దిశగా అడుగులు..

వన్డే ప్రపంచ కప్ నాటికీ ఇదే ఫామ్‌ను కొనసాగించాలనే పట్టుదలతో విరాట్ ఉన్నాడు. దాంతో విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నమెంట్‌లో ఆడాలని అతడు నిర్ణయించుకున్నాడు. ఈ నిర్ణయాన్ని క్రికెట్ పండితులు స్వాగతిస్తున్నారు. బెంగళూరులో జరిగే మూడు మ్యాచ్‌ల్లో ఢిల్లీకి కోహ్లీ ఆడనున్నట్టు సమాచారం.



మూడో వన్డే కోసం గురువారం విశాఖపట్నం చేరుకున్న భారత క్రికెటర్లు కేఎల్ రాహుల్, తిలక్ వర్మ, దక్షిణాఫ్రికా సారథి బవుమా

ఆ సెంచరీతో సీన్ మారింది

విశాఖపట్నం (స్పోర్ట్స్): భారత్-దక్షిణాఫ్రికా వన్డే సిరీస్ 1-1తో సమం కావడంతో.. విశాఖలో జరిగే మ్యాచ్ ఫలితాన్ని నిర్ణయించనుంది. ఈ నేపథ్యంలో సాగర తీరాన జరిగే మ్యాచ్ టిక్కెట్లు హాట్‌హాట్‌గా అమ్ముడయ్యాయి. టెస్ట్ సిరీస్‌లో టీమిండియా వైట్‌వాష్ కావడంతో.. తొలుత టిక్కెట్ల విక్రయాలు ఆరంభించినప్పుడు అంతగా స్పందన లభించలేదు. కానీ, మొదటి మ్యాచ్‌లోనే కోహ్లీ సెంచరీ బాదడంతో క్రమంగా అమ్మకాలు ఊపందుకొన్నాయి. ఇక, రాయ్‌పూర్‌లో విరాట్ వరుసగా రెండో సెంచరీ నమోదు చేయడంతో.. టిక్కెట్లకు డిమాండ్ ఆకాశాన్నంటింది. గత నెల 28న తొలి విడత టిక్కెట్ల విక్రయాలు ప్రారంభించినప్పుడు డిమాండ్ అంతగా లేదు. కానీ రాంచీలో భారత్ మ్యాచ్ నెగ్గడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. రెండో దఫా టిక్కెట్లను ఆన్‌లైన్‌లో ఉంచిన నిమిషాల్లోనే అన్నీ అమ్ముడుపోయాయని ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) వర్గాలు తెలిపాయి. ఇదే అదనుగా కొందరు బ్లాక్ మార్కెట్‌కు తెరలేపినట్టు సమాచారం.

శతక 'జో'రూ'ట్

- ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 325/9
- స్టార్క్‌కు ఆరు వికెట్లు
- ఆసీస్‌తో రెండో టెస్టు

యాషెస్ సిరీస్



బ్రిస్బేన్: ఆధునిక క్రికెట్‌లో గొప్ప బ్యాటర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్నా.. ఇంగ్లండ్ స్టార్ జో రూట్‌కు ఆసీస్ గడ్డపై సెంచరీ ఊరిస్తూనే ఉంది. కానీ ఇన్నాళ్లకు ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్ ద్వారా ఆ లోటును భర్తీ చేసుకోగలిగాడు. గురువారం ఆరంభమైన రెండో టెస్టులో 34 ఏళ్ల రూట్ (135 బ్యాటింగ్) అజేయ సెంచరీతో నిలిచాడు. గాబా మైదానంలో జరుగుతున్న ఈ గులాబీ టెస్టులో ఓవైపు స్టార్ పేసర్ మిచెల్ స్టార్క్ (6/71) నిప్పులు చెరిగే బంతులతో వికెట్ల వేట సాగిస్తున్నా.. మరో ఎండ్‌లో రూట్ మాత్రం పట్టు వదలకుండా క్రీజులో నిలిచాడు. ఫలితంగా మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 74 ఓవర్లలో 9 వికెట్లకు 325 పరుగులు చేసింది. ఓపెనర్ క్రాలే (76) అర్ధసెంచరీతో సహకరించాడు. ఇక టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్టామ్ పేసర్‌గా వసీం అక్రమ్ (414) రికార్డును స్టార్క్ (418) అధిగమించాడు.

5/2తో తడబాటు..: స్టార్క్ ధాటికి మూడో ఓవర్‌లోపే ఓపెనర్ డకెట్, పోప్ డకౌట్లుగా వెనుదిరిగారు. అప్పటికి స్కోరు కేవలం ఐదు పరుగులే. ఈ దశలో మరో ఓపెనర్ క్రాలే అండతో రూట్ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. బ్రూక్‌ను అవుట్ చేసిన స్టార్క్ చివరి సెషన్‌లో చకచకా వికెట్లు తీసి ఒత్తిడి పెంచాడు. అటు రూట్ మాత్రం ఎదురొడ్డి నిలిచి ఆసీస్ గడ్డపై తొలి సెంచరీ పూర్తి చేశాడు.

సంక్షిప్త స్కోర్లు: ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 74 ఓవర్లలో 325/9 (రూట్ 135 బ్యాటింగ్, క్రాలే 76, ఆర్చర్ 32 బ్యాటింగ్, బ్రూక్ 31; స్టార్క్ 6/71).

హేడెన్ నగ్న నడక తప్పింది..

జో రూట్ శతకంతో మెల్‌బోర్న్ వాసులకు ఓ 'ప్రమాదం' తప్పింది. గతంలో ఆసీస్ గడ్డపై నాలుగు యాషెస్ సిరీస్‌లు ఆడిన రూట్ ఒక్కసారి కూడా సెంచరీ చేయలేదు. అందుకే రూట్ ఈసారి కూడా ఆసీస్ గడ్డపై సెంచరీ చేయలేకపోతే తాను మెల్‌బోర్న్ మైదానంలో నగ్నంగా నడుస్తానంటూ ఇటీవల ఆసీస్ మాజీ ఓపెనర్ మాథ్యూ హేడెన్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. దీనికి హేడెన్ కూతురు, వ్యాఖ్యాత గ్రేస్ స్పందిస్తూ.. 'రూట్.. దయచేసి ఒక్క సెంచరీ అయినా చెయ్' అని సరదాగా పేర్కొంది.

ఎక్కువ వికెట్లు తీసిన లెఫ్టామ్ పేసర్లు

బౌలర్	టెస్టులు	వికెట్లు
స్టార్క్	102	418
అక్రమ్	104	414
వాస్	111	355
బౌల్ట్	78	317
జహీర్	92	311



నరైన్ @ 600

అబుధాబి: వెస్టిండీస్ వెటరన్ స్పిన్నర్ సునీల్ నరైన్ టీ20 ఫార్మాట్‌లో 600 వికెట్లు పూర్తి చేసుకున్న మూడో బౌలర్‌గా రికార్డుల్లోకి ఎక్కాడు. అఫ్ఘానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ (681), విండీస్ పేసర్ డ్వేన్ బ్రావో (631) ముందున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ లీగ్ టీ20 (ఐఎల్‌టీ20)లో షార్జా వారియర్స్ తరఫున ఆడుతున్న నరైన్ బుధవారం జరిగిన మ్యాచ్‌లో అబుదాబి నైట్‌రైడర్స్‌పై ఒక వికెట్ తీసి ఈ ఫీట్ అందుకున్నాడు.

రచిన్, లాథమ్ సెంచరీలు

- కివీస్ ఆధిక్యం 481
- వెస్టిండీస్‌తో టెస్ట్

క్రైస్ట్‌చర్చ్: రచిన్ రవీంద్ర (176), టామ్ లాథమ్ (145) శతకాలతో చెలరేగడంతో.. వెస్టిండీస్‌తో తొలి టెస్ట్‌లో న్యూజిలాండ్ పట్టు బిగించింది. ఆటకు మూడో రోజైన గురువారం ఓవర్‌నైట్ స్కోరు 32/0తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన కివీస్ 417/4 స్కోరు చేసింది. 64 పరుగుల తొలిఇన్నింగ్స్ లీడ్‌తో కలిపి ప్రస్తుతం కివీస్ 481 పరుగుల ఆధిక్యంలో ఉంది. తొలి ఇన్నింగ్స్‌లో కివీస్ 231 పరుగులు చేయగా.. విండీస్ 167 రన్స్‌కు ఆలౌటైంది.

జమ్మూ కశ్మీర్‌పై హైదరాబాద్ విజయం

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ

కోల్‌కతా: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్ జట్టు హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళుతోంది. గురువారం జమ్మూ కశ్మీర్‌తో జరిగిన మ్యాచ్‌లో బౌలర్లు విశేషంగా రాణించడంతో 4 వికెట్ల తేడాతో నెగ్గింది. దీంతో గ్రూప్ 'బి'లో టాప్ (16)లో నిలిచింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కశ్మీర్ 19.3 ఓవర్లలో 112 పరుగులకే కుప్పకూలింది. మిలింద్, నితిన్ సాయిలకు మూడేసి.. రక్షణ్‌కు రెండు వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో హైదరాబాద్ 15.1 ఓవర్లలో 115/6 స్కోరుతో నెగ్గింది. కశ్మీర్ బౌలర్లు చెలరేగడంతో హైదరాబాద్ 38 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయి ఒత్తిడిలో పడింది. ఈ దశలో తనయ్ ఎదురుదాడికి అర్ధసెంచరీ (50)తో ఆదుకున్నాడు. ప్రజ్ఞయ్ రెడ్డి (31 నాటౌట్) సహకరించాడు.



పాండ్యా కోసం పోటెత్తిన అభిమానం

మ్యాచ్ వేదిక ఉప్పల్‌కు తరలింపు

హైదరాబాద్: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో బరోడా తరఫున ఆడుతున్న టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కోసం అభిమానులు పోటెత్తడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మ్యాచ్ వేదికను తరలించాల్సి వచ్చింది. గురువారం జింఖానా మైదానంలో బరోడా, గుజరాత్ మ్యాచ్‌ను షెడ్యూల్ చేశారు. కానీ, జట్టు బసచేసిన హోటల్ బయట, నెట్ ప్రాక్టీస్ సమయంలో, టికెట్ కౌంటర్ల వద్ద ఫ్యాన్స్ భారీగా గుమిగూడడాన్ని నిర్వాహకులు గమనించారు. దీంతో ముందు జాగ్రత్తగా మ్యాచ్ వేదికను జింఖానా నుంచి ఉప్పల్‌కు మార్చారు. మ్యాచ్ సాఫీగా కొనసాగించడంతోపాటు ఆటగాళ్ల, అభిమానుల భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. కాగా, ఈ మ్యాచ్‌లో బరోడా 8 వికెట్ల తేడాతో గుజరాత్‌పై ఘన విజయం సాధించింది. పాండ్యా 10 పరుగులు చేయడంతోపాటు ఒక వికెట్ పడగొట్టాడు.

వాళ్లా.. రో-కో భవిష్యత్ నిర్ణయించేది?

- మాజీ ఆటగాడు హర్భజన్ సింగ్



న్యూఢిల్లీ: తమ కెరీర్‌లో పెద్దగా ఏమీ సాధించని వారు.. స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ భవిష్యత్‌ను నిర్ణయిస్తుండడం దురదృష్టకరమని భారత మాజీ ఆటగాడు హర్భజన్ సింగ్ అన్నాడు. తనతోపాటు అనేకమంది సహచరులకు కూడా గతంలో ఇలాంటి పరిస్థితే ఎదురైందని అన్నాడు. ఇక భారత్‌లో మంచి స్పోర్టింగ్ వికెట్లపై ఆడే ధోరణి రావాలని సూచించాడు.

బిజినెస్



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,30,360 ▼	1,19,500 ▼	2,00,000 ▼
విజయవాడ	1,31,500 ▼	1,23,000 ▼	1,80,000 ▼
విశాఖపట్నం	1,31,600 ▼	1,19,700 ▲	2,00,000 ▼
రాజమండ్రి	1,30,360 ▼	1,19,500 ▼	1,82,000 ▼
ప్రొద్దుటూరు	1,27,650 ▼	1,17,440 ▼	1,76,000 ▼
ముంబై	1,27,845 ▼	1,17,106 ▼	1,76,625 ▼

నేడే ఆర్‌బీఐ పాలసీ

ముంబై: అక్టోబరు నెలలో దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం 0.25 శాతానికి దిగి రావడం, సెప్టెంబరు త్రైమాసిక వృద్ధి రేటు ఆరు త్రైమాసికాల గరిష్ఠ స్థాయి 8.2 శాతానికి దూసుకుపోయిన నేపథ్యంలో రాబోయే రెండు నెలల్లో అనుసరించదగిన ద్రవ్య విధానాన్ని రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం ప్రకటించనున్నారు. ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గిన కారణంగా రెపోరేటును 0.25% మేరకు తగ్గించవచ్చని కొందరు నిపుణులు, వృద్ధిరేటు బలంగా ఉన్న కారణంగా రెపోరేటును యథాతథంగానే కొనసాగించవచ్చని అంచనా వేస్తున్నారు.

కొత్త ఏడాది పసిడి బుల్ రన్ ఆగదు..!

ధర 30 శాతం వరకు పెరిగే అవకాశం ▸▸ ప్రపంచ స్వర్ణ మండలి వెల్లడి

న్యూఢిల్లీ: పసిడి ధర చుక్కలంటుతోంది. దేశీయ మార్కెట్లో ఇప్పటికే 10 గ్రాముల మేలిమి (24 క్యారట్స్) బంగారం ధర రూ.1.30 లక్షలు దాటిపోయింది. ఈ ఏడాది ఇప్పటి వరకు భారత మార్కెట్లో పసిడి ధర 60 శాతం పెరిగింది. గత ఏడాది కాలంలో దేశంలో మరే పెట్టుబడులు ఈ స్థాయిలో లాభాలు పంచలేదు. మరోవైపు వచ్చే ఏడాది (2026) కూడా పసిడి పరుగు ఆగదని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తన తాజా నివేదికలో తెలిపింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి 4,210 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వచ్చే ఏడాది ఇది మరో 15 నుంచి 30 శాతం (630-1,260 డాలర్లు) పెరిగి 4,840 నుంచి 5,470 డాలర్లకు చేరే అవకాశం ఉందని డబ్ల్యూజీసీ నివేదిక పేర్కొంది. మరోవైపు ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం జేపీ మోర్గాన్ కూడా దాదాపు ఇదే అంచనాలు వెలువరించింది. దీంతో వచ్చే ఏడాది భారత మార్కెట్లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర.. 6 శాతం దిగుమతి సుంకం, 3 శాతం జీఎస్‌టీ కలుపుకుంటే రూ.1,49,500 నుంచి రూ.1.69 లక్షలు పలికే అవకాశం ఉంటుందని అంచనా. అయితే ట్రంప్ సుంకాల పోటు ఫలించి అమెరికా ఆర్థిక వ్యవస్థ పరుగులు పెడితే మాత్రం ఔన్స్ పసిడి ధర 5 నుంచి 20 శాతం వరకు దిద్దుబాటుకు (కరెక్షన్) లోనయ్యే ప్రమాదం కూడా ఉందని డబ్ల్యూజీసీ నివేదిక పేర్కొంది.



బంగారం జోరుకు కారణాలు

- తగ్గుతున్న వడ్డీ రేట్లు
- కొనసాగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు
- కేంద్ర బ్యాంకులు, గోల్డ్ ఈటీఎఫ్‌ల కొనుగోళ్లు
- సురక్షిత పెట్టుబడిగా పసిడికి ఉన్న పేరు
- పొంచి ఉన్న ద్రవ్యోల్బణ భయాలు



టీసీఎస్‌తో ఓపెన్ ఏఐ జట్టు!

భారత్‌లో స్టార్‌గేట్ కార్యకలాపాల విస్తరణ

తుది దశకు చర్చలు.. నెలాఖరు కల్లా ప్రకటన వెలువడే చాన్స్

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)లో ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా ఎదిగిన 'ఓపెన్ ఏఐ' భారత్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం టాటా గ్రూప్ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)తో జట్టు కట్టేందుకు చర్చలు జరుపుతోంది. ఈ భాగస్వామ్యం ద్వారా దేశంలో ఏఐ ఆధారిత కంప్యూటర్ మౌలిక సదుపాయాలు, కంపెనీలకు అవసరమైన ఏజెంటిక్ ఏఐ సొల్యూషన్స్ అభివృద్ధి చేయాలని రెండు సంస్థలు భావిస్తున్నాయి. ప్రస్తుతం తుది దశలో ఉన్న ఈ చర్చలు ఈ నెలాఖరుకల్లా ఒక కొలిక్కి వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఎందుకంటే? ఓపెన్ ఏఐకి అమెరికా తర్వాత భారత్ అతి పెద్ద మార్కెట్. ఈ కంపెనీ ఆఫర్ చేసే ఏఐ టూల్ 'చాట్ జీపీటీ' భారత్‌లో సూపర్ డూపర్ హిట్టయింది. అయితే ఇటీవల పర్‌ప్లెక్సిటీ, గూగుల్ జెమినీ ఏఐ టూల్స్ నుంచి ఓపెన్ ఏఐకి విపరీతమైన పోటీ ఏర్పడుతోంది. దీంతో టాటా వంటి పెద్ద పారిశ్రామిక గ్రూప్‌తో జట్టు కట్టి తన 'స్టార్‌గేట్ ఇండియా' కార్యకలాపాలను విస్తరించాలని యోచిస్తోంది. ఓపెన్ ఏఐతో ఈ డీల్ కుదిరితే, ప్రపంచంలో అతిపెద్ద ఏఐ ఆధారిత ఐటీ సేవల కంపెనీగా ఎదగాలన్న తన లక్ష్యం నెరవేరుతుదని టీసీఎస్ భావిస్తోంది.

లీజు ఒప్పందం మాత్రమే

ఏఐ సేవలకు అవసరమైన డేటా కేంద్రాల ఏర్పాటు కోసం టీసీఎస్ ఇప్పటికే హైపర్‌వాల్ట్ పేరుతో ప్రత్యేక వెంచర్ ఏర్పాటు చేసింది. టీసీఎస్ ఈ వెంచర్ ద్వారా మన దేశంలో సేవలు అందించే విదేశీ కంపెనీలకు తన డేటా సెంటర్ల ద్వారా సేవలు అందించనుంది. ఈ వెంచర్‌లో కనీసం 500 మెగావాట్ల డేటా సామర్థ్యాన్ని లీజుకు తీసుకోవాలని ఓపెన్ ఏఐ భావిస్తున్నట్టు సమాచారం. నిజానికి హైపర్‌వాల్ట్ వెంచర్‌లో ఈక్విటీ వాటా తీసుకునేందుకు ఓపెన్ ఏఐ ఆసక్తి చూపింది. అయితే ఇతర కస్టమర్ల నుంచి సమస్యలు వచ్చే అవకాశం ఉందనే భయంతో టాటా గ్రూప్ ఆ ప్రతిపాదనను తోసిపుచ్చింది. దీంతో డేటా సెంటర్ల లీజుతో సరిపెట్టుకునేందుకు ఓపెన్ ఏఐ సిద్ధమవుతోంది.

మరోవైపు టీసీఎస్ తన డేటా సెంటర్ వ్యాపారం కోసం మైక్రోసాఫ్ట్, అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్), గూగుల్, ఎన్‌విడియాతో జట్టు కట్టాలని భావిస్తోంది.

2,200 కోట్ల డాలర్ల మార్కెట్

ప్రస్తుతం మన దేశంలో ఏఐ మార్కెట్ 780 కోట్ల డాలర్ల నుంచి 1,270 కోట్ల డాలర్ల వరకు ఉంటుందని అంచనా. ఈ మార్కెట్ ఏటా 20.1 శాతం నుంచి 43.76 శాతం చొప్పున వృద్ధి చెందుతోంది. 2027 నాటికి ఇది 1,700 కోట్ల డాలర్ల నుంచి 2,200 కోట్ల డాలర్లకు చేరే అవకాశం ఉందని నాస్కామ్-బీసీజీ అంచనా. దీంతో గూగుల్, మెటా వంటి టెక్ దిగ్గజాలు భారత్‌లోని పారిశ్రామిక దిగ్గజ కంపెనీలతో జట్టు కట్టేందుకు ముందుకు వస్తున్నాయి. గూగుల్ ఇప్పటికే తన జెమినీ ఏఐ కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో జట్టు కట్టింది. నిజానికి ఓపెన్ ఏఐ కూడా తన ఏఐ సేవల కోసం రిలయన్స్ ప్రభుత్వంతో చర్చలు జరిపినా అవి పెద్దగా ఫలించలేదు. దాంతో ఇప్పుడు టాటా గ్రూప్ కంపెనీ టీసీఎస్ జట్టు కట్టేందుకు ఆసక్తి చూపుతోందని భావిస్తున్నారు.

సాయి పేరెంటరల్స్ రూ.110 కోట్ల పెట్టుబడులు

SAI PARENTERALS

రూ.26 కోట్లతో ఆర్ అండ్ డీ సెంటర్
ఐపీఓ ద్వారా రూ.285 కోట్ల సమీకరణ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సాయి పేరెంటరల్స్ లిమిటెడ్ (ఎస్‌పీఎల్).. పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి వస్తోంది. కంపెనీ ఇప్పటికే మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించిందని కంపెనీ ఎండీ కే అనిల్ కుమార్ వెల్లడించారు. ఐపీఓలో భాగంగా తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.285 కోట్లు సమీకరించనుండగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా ప్రస్తుత ఇన్వెస్టర్లు రూ.125 కోట్ల విలువైన షేర్లను విక్రయించనున్నారని ఆయన తెలిపారు. ఐపీఓ ద్వారా సమీకరించిన నిధుల్లో రూ.110 కోట్లను ప్లాంట్ల ఆధునికీకరణ, సాధారణ కార్పొరేట్ అవసరాలతో పాటు ఇటీవల ఆస్ట్రేలియాలో కొనుగోలు చేసిన న్యూమెడ్ ఫార్మా కోసం వినియోగించనున్నట్లు అనిల్ చెప్పారు. ప్రస్తుతం కంపెనీ తెలంగాణలో నాలుగు ప్లాంట్లను నిర్వహిస్తోంది. బ్రాండెడ్ జెనరిక్ ఫార్ములేషన్స్‌తో పాటు కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీడీఎంఓ) సేవలను అందిస్తోంది. భారత్‌తో పాటు ఫిలిప్పీన్స్, దుబాయ్, సౌదీ అరేబియా మార్కెట్లకు ఔషధాలను ఎగుమతి చేస్తోంది. తాజాగా న్యూమెడ్ కొనుగోలుతో ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌తో పాటు మరికొన్ని రెగ్యులేటెడ్ మార్కెట్లకు తన కార్యకలాపాలను విస్తరించనుంది.

వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి న్యూమెడ్ ప్లాంట్ రెడీ: కాగా హైదరాబాద్ బొల్లారంలో కొత్తగా ఆర్ అండ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు అనిల్ తెలిపారు. ఇందుకోసం రూ.26 కోట్ల పెట్టుబడులు పెడుతున్నట్లు ఆయన చెప్పారు. వచ్చే ఏడాది ఈ సెంటర్ అందుబాటులోకి రానుందన్నారు. అలాగే ఆస్ట్రేలియాలోని న్యూమెడ్ ఫార్మా ఏర్పాటు చేస్తున్న ప్లాంట్ వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికల్లా అందుబాటులోకి రానుందన్నారు. రెగ్యులేటరీ నిబంధనలకు అనుగుణంగా 2027 జనవరి నుంచి వాణిజ్యపరంగా ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి ప్రారంభం కానుందని అనిల్ వివరించారు.

ఏ రంగానికైనా ఆర్ అండ్ డీనే దన్ను

బీడీఎల్ సీఎండీ మాధవ రావు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఏ రంగానికి చెందిన పరిశ్రమల అభివృద్ధికి ఆర్ అండ్ డీ (పరిశోధన, అభివృద్ధి) కీలకమని ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) సీఎండీ కమోడోర్ ఏ మాధవ రావు (రిటైర్డ్) అన్నారు. వైమానిక, రక్షణ రంగాలపై భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తెలంగాణ చాప్టర్ నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ విషయం స్పష్టం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో రక్షణ, వైమానిక రంగాల్లో ప్రైవేటు కంపెనీల పాత్ర పెరుగుతోందన్నారు. దీంతో గత ఆర్థిక సంవత్సరం మన దేశం నుంచి ఆయుధ ఎగుమతులు రూ.23,000 కోట్లు మించిపోయాయని తెలిపారు. ఇటీవల బీడీఎల్ కూడా ఆర్ అండ్ డీ కార్యకలాపాలను బాగా పెంచిందన్నారు. ప్రస్తుతం తమ టర్నోవర్‌లో దాదాపు 6 శాతం ఇందుకు ఖర్చు చేస్తున్నట్టు మాధవ రావు వెల్లడించారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ			
హైదరాబాద్	651	విజయవాడ	670
వరంగల్	653	గోదావరి	650
చిత్తూరు	663	విశాఖపట్నం	640
		డజను గుడ్లు రూ.	90

నాలుగు రోజుల నష్టాలకు తెర

380 పాయింట్లు లాభపడిన సెన్సెక్స్

ముంబై: ఈక్విటీ మార్కెట్ నాలుగు రోజుల నష్టాలకు తెర దించింది. టెక్, ఐటీ షేర్ల కొనుగోలుతో గురువారం సూచీలు లాభాల్లో ముగిశాయి. అయితే ఆర్‌బీఐ పాలసీపై అప్రమత్తత, రూపాయి బలహీనత లాభాలను పరిమితం చేశాయి. మొత్తం మీద గురువారం ఇంట్రాడేలో 380 పాయింట్ల పైగా పెరిగిన సెన్సెక్స్ ఆ లాభాన్ని 158.51 పాయింట్లకు పరిమితం చేసుకుని 85,265.32 వద్ద ముగిసింది. నిఫ్టీ 47.75 పాయింట్ల లాభంతో 26,033.75 వద్ద క్లోజైంది. అంతకు ముందు వరుసగా నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 613 పాయింట్లు, నిఫ్టీ 230 పాయింట్లు నష్టపోయాయి. శుక్రవారం ఆర్‌బీఐ పాలసీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు పెట్టుబడులకు దూరంగా ఉండడానికే ప్రాధాన్యం ఇచ్చారని ఎన్‌రిచ్ మనీ సీఈఓ పొన్ముడి ఆర్ అన్నారు.

19 పైసలు లాభపడిన రూపాయి: ఫారెక్స్ మార్కెట్లో రూపాయి జీవితకాల కనిష్ఠ స్థాయి నుంచి స్వల్పంగా కోలుకుంది. ఆర్‌బీఐ రెపో రేటును తగ్గించవచ్చన్న అంచనాలు రూపాయికి ఊపిరి పోశాయి. గురువారం ఒక దశలో ఆల్ టైమ్ కనిష్ఠ స్థాయి 90.43 వరకు దిగజారినప్పటికీ తదుపరి కాస్తంత నిలదొక్కుకుంది. చివరికి 19 పైసలు లాభంతో 89.96 వద్ద ముగిసింది.

నెఫ్రో ప్లస్ షేరు ధర రూ.438-460: నెఫ్రో ప్లస్ బ్రాండ్‌తో డయాలసిస్ సేవలందిస్తున్న నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ లిమిటెడ్ వచ్చే వారంలో జారీ చేయనున్న ఐపీఓలో షేరు ధర శ్రేణిని రూ.438-460గా ప్రకటించింది. కంపెనీ విలువ రూ.4,600 కోట్లుగా పరిగణించి ధరను నిర్ణయించారు. రూ.871 కోట్ల సమీకరణ లక్ష్యంగా మార్కెట్లోకి వస్తున్న నెఫ్రోప్లస్ ఇష్యూ వచ్చే బుధవారం (10వ తేదీ) ప్రారంభమై శుక్రవారం ముగుస్తుంది.

హైదరాబాద్‌లో హిల్టన్ రిసార్ట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రముఖ అంతర్జాతీయ హోటల్స్ చెయిన్ హిల్టన్ హైదరాబాద్‌లో కాలు మోపింది. జినోమ్ వ్యాలీలో హిల్టన్ హైదరాబాద్ జినోమ్ వ్యాలీ రిసార్ట్ అండ్ స్పా పేరుతో ఈ ప్రీమియం హోటల్‌ను ఏర్పాటు చేసింది. సీకేఆర్ రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి హిల్టన్ ఈ రిసార్ట్‌ను నిర్మించింది. విశాలమైన 20 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ రిసార్ట్‌లో 13 పూల్ విల్లాలు, ఆరు సూట్లతో కలిపి 115 గెస్ట్ రూమ్స్ ఉన్నట్టు తెలిపింది. పూర్తిగా కాకతీయ ఆర్కిటెక్చర్‌తో ఈ అధునాతన రిసార్ట్‌ను హిల్టన్ అభివృద్ధి చేసింది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127	విజయవాడ	130
వరంగల్	127	గుంటూరు	135
కరీంనగర్	127	ఒంగోలు	135
మహబూబ్‌నగర్	127	చిత్తూరు	117
కర్నూలు	127	నెల్లూరు	122
విశాఖపట్నం	120	అనంతపురం	122
గోదావరి	130		

కళాకారులకు ప్రాంతం ఉండదు..

- ఎస్పీ బాలు విగ్రహం ఏర్పాటుపై రాద్ధాంతం తగదు
- కులం, మతం లేకుండా బీజేపీ నేతలకు పూట గడవదు
- ఢిల్లీ పరిస్థితి హైదరాబాద్‌కు రావద్దనే హిల్ట్: మహేశ్‌గౌడ్



హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం దేశం గర్వించదగిన గాయకుడని, రవీంద్రభారతిలో ఆయన విగ్రహం ఏర్పాటుపై రాద్ధాంతం చేయడం తగదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. అసలు కళాకారులకు ప్రాంతాలు ఆపాదించడం సరికాదని వ్యాఖ్యానించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు భౌగోళికంగా విడిపోయినా.. తెలుగు వారంతా అన్నదమ్ముల్లా కలిసే ఉండాలని ఆకాంక్షించారు. గురువారం గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. కులం, మతం ప్రస్తావన లేకుండా బీజేపీ వారికి పూట కూడా గడవదని.. దేవుళ్ల గురించి ఒక సామెత రూపంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడితే దాన్ని కూడా రాజకీయం చేస్తున్నారని ఆక్షేపించారు. కులం, మతం పేరిట రాజకీయాలను తెలంగాణ ప్రజలు జీర్ణించుకోరన్నారు. అసలు అభివృద్ధి గురించి బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరానికి ఢిల్లీ తరహా పరిస్థితి రాకూడదనే హిల్ట్ పాలసీని తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ పాలసీతో హైదరాబాద్‌లో కాలుష్యం తగ్గడంతో పాటుగా భూముల ధరలూ తగ్గి మధ్య తరగతి వారికి అందుబాటులోకి వస్తాయన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా మార్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. హిల్ట్ పాలసీపై విమర్శలు చేయడం దారుణమని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు పదేళ్ల పాటు హైదరాబాద్‌ను అడ్డగోలుగా దోచుకుంటే.. అప్పుడు బీజేపీ వాళ్లు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఔటర్ రింగు రోడ్డు వెలుపల, లోపల ప్రభుత్వ భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టినప్పుడు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఎక్కడ ఉన్నాడని నిలదీశారు. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలతో బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒకటేనని మరోసారి తేలిపోయిందన్నారు. అంతకుముందు రోశయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మహేశ్ గౌడ్ నివాళులర్పించారు.

ఔట్ సోర్సింగ్ సిబ్బందికి జీతాలొచ్చాయ్!

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి ఎట్టకేలకు జీతాలు వచ్చాయి. ఆరు నెలలుగా జీతాలు లేక ఔట్ సోర్సింగ్ సిబ్బంది పడుతున్న ఇబ్బందులపై గత వారం 'ఆంధ్రజ్యోతి'లో 'ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 6 నెలలుగా జీతాల్లేవ్!' శీర్షికతో కథనం ప్రచురితమైంది. విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో కాంట్రాక్టర్లు ఔట్ సోర్సింగ్ సిబ్బంది జీతం బకాయిలు చెల్లించారు. 6 నెలలకుగాను 5 నెలల జీతం చెల్లించి మరో నెల జీతం డిసెంబరులో చెల్లిస్తామని సిబ్బందికి భరోసా ఇచ్చారు. కాగా హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ప్రాంతాల్లోని రవాణా శాఖ కార్యాలయాల్లో సుమారు 600 మందికిపైగా ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరు కాకుండా రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ కార్యాలయాల్లో పనిచేస్తున్నవారు మరికొందరు ఉన్నారు.

బీసీలకు కాంగ్రెస్ సర్కారు ద్రోహం:జాజుల

- ఛలో ఢిల్లీ, పార్లమెంటు ముట్టడి పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్/ బర్కత్‌పుర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకుని స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం చేసిందని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ సంచలన ఆరోపణ చేశారు. ఢిల్లీ పర్యటనలో ప్రధాని మోదీని కలిసినప్పుడు బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ఎందుకు లేవనెత్తలేదని ప్రశ్నించిన జాజుల.. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. ఇది బీసీలను నయవంచనకు గురి చేయడమేనన్నారు. బీసీ రిజర్వేషన్లపై పార్లమెంటును స్తంభింప జేయడానికి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీతోనూ రేవంత్‌రెడ్డి చర్చించనే లేదన్నారు. బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16 తేదీల్లో చేపట్టనున్న 'ఛలో ఢిల్లీ', 'పార్లమెంట్ ముట్టడి' పోస్టర్‌ను గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ కుట్రలను ఎండగట్టడానికే ఢిల్లీలో 15న జంతర్‌మంతర్ వద్ద ధర్నా, 16న అన్ని రాజకీయ పార్టీలు, కేంద్ర మంత్రులతో సమావేశమవుతామని వివరించారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా తరలి రావాలని బీసీలకు పిలుపునిచ్చారు.

కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు..
15లోగా డిజైన్ కన్సల్టెంట్లతో ఒప్పందం

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లతో పాటు సమగ్ర ప్రణాళికను అందించడానికి అర్హత సాధించిన సంస్థలు.. ఈ నెల 7లోగా ఫైనాన్షియల్ బిడ్లను దాఖలు చేయాలని నీటిపారుదల శాఖ కోరింది. మద్రాస్ ఐఐటీ- ఆర్వీ కన్సల్టెన్సీ- ఇప్రీసాస్(స్పెయిన్ కంపెనీ) జాయింట్ వెంచర్, ఆఫ్రీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, డీఎంఆర్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్ కంపెనీల ప్రతినిధులతో గురువారం జలసౌధలో నీటి పారుదల శాఖ ప్రీ-బిడ్ సమావేశం నిర్వహించి వారి అనుమానాలను నివృత్తి చేసింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ) చేసిన సిఫారసులకు అనుగుణంగా డిజైన్లు అందించే సంస్థలతో ఒప్పందం చేసుకుంటామని తెలిపింది. ఫైనాన్షియల్ బిడ్లలో అర్హత సాధించిన సంస్థతో ఒప్పందం చేసుకునేలా.. రాష్ట్ర ప్రభుత్వ అనుమతిని నీటిపారుదల శాఖ కోరనుంది. ఈ నెల 15లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది.

కేంద్ర జలసంఘం చైర్మన్‌గా అనుపమ్ ప్రసాద్

కేంద్ర జల వనరుల సంఘం(సీడబ్ల్యూసీ) చైర్మన్‌గా అనుపమ్ ప్రసాద్‌ను కేంద్ర జల శక్తి శాఖ నియమించింది. ప్రస్తుత చైర్మన్‌గా ఉన్న అతుల్ జైన్ పదవీ విరమణ చేయడంతో.. సీడబ్ల్యూసీ సభ్యులుగా పనిచేస్తున్న అనుపమ్ ప్రసాద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించింది.

గజం లక్షన్నర ఉంటే 4 వేలకే కట్టబెట్టే కుట్ర

- 'హిల్ట్' విధానం.. భారీ భూ కుంభకోణం: కేటీఆర్

హైదరాబాద్ సిటీ/జీడిమెట్ల/పటాన్‌చెరురూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్‌లో చదరపు గజం రూ.లక్షన్నర పలుకుతున్న భూములను రూ.4వేలకు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపించారు. గతంలో ప్రభుత్వాలు యువతకు ఉపాధి కల్పన కోసం పరిశ్రమల ఏర్పాటుకు భూములు కేటాయించాయని, అవి ప్రైవేట్ వ్యక్తులు/సంస్థల ఆస్తులు కావన్నారు. హైదరాబాద్ పారిశ్రామిక భూముల మార్పు (హిల్ట్) విధానం ముసుగులో రూ.5 లక్షల కోట్ల విలువైన ఆ భూములను సీఎం రేవంత్ రెడ్డి, ఆయన అనుయాయులు దోచుకునే కుంభకోణానికి తెరలేపారని ఆరోపించారు. 'హిల్ట్'పై బీఆర్ఎస్ పోరుబాటలో భాగంగా ఆయన గురువారం జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలో పర్యటించారు. పలు పరిశ్రమలను సందర్శించి అక్కడి హమాలీ కార్మికులతో మాట్లాడారు. ప్రజలకు ఉపాధి కల్పించే పరిశ్రమలు వద్దంటూ.. అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాల నిర్మాణానికి చౌకగా భూములు ఇచ్చేందుకు ప్రభుత్వం హిల్ట్ విధానాన్ని తీసుకొచ్చిందని కేటీఆర్ విమర్శించారు. ఇక్కడి కంపెనీలను తరలిస్తే వాటిపై ఆధారపడి బతుకుతున్న లక్షల మంది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశాన్ని బీఆర్ఎస్ ఇక్కడితో వదలదని, అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే హిల్ట్ విధానాన్ని రద్దు చేస్తామని, ఇందుకు చట్టాన్ని కూడా తీసుకొస్తామని తెలిపారు. రేవంత్ రెడ్డి భూ కుంభకోణంలో భాగస్వాములు కావొద్దని పారిశ్రామికవేత్తలను కోరారు. హైదరాబాద్‌లో ఎకరం రూ.170 కోట్లకు భూములు అమ్ముతున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వం.. జీడిమెట్లలో కోటి రూపాయలకు ఎలా విక్రయిస్తుందని ప్రశ్నించారు.

'క్వాంటం సిటీ'గా హైదరాబాద్!

దేశంలోనే తొలిసారిగా లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ ఆవిష్కరణ

స్టార్టప్స్, ఇన్నోవేషన్స్ కోసం ఫండ్స్ ఆఫ్ ఫండ్స్‌ను ప్రారంభిస్తాం: మంత్రి శ్రీధర్ బాబు



నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం అండ్ తెలంగాణ క్వాంటం స్ట్రాటజీ ఆవిష్కరణ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు, నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'క్వాంటం సిటీ'గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేలా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 'క్వాంటం టెక్నాలజీ'లో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా మార్చేలా నిపుణులు, పరిశ్రమల భాగస్వామ్యంతో దేశంలోనే తొలిసారిగా 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ'ని రూపొందించామన్నారు. గచ్చిబౌలిలోని ఐఐఐటీ-హైదరాబాద్‌లో 'నీతి ఆయోగ్ రోడ్ మ్యాప్ ఫర్ క్వాంటం, తెలంగాణ క్వాంటం స్ట్రాటజీ'ని గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడుతూ... అప్పట్లో విద్యుత్, ఇంటర్నెట్ లాంటి ఆవిష్కరణలు ప్రపంచం రూపురేఖలు మార్చాయని, అదే తరహాలో రాబోయే రోజుల్లో క్వాంటం టెక్నాలజీ కూడా అనేక మార్పులకు శ్రీకారం చుట్టబోతోందన్నారు. ఏఐ, క్వాంటం టెక్నాలజీ తదితర టెక్నాలజీలలో తెలంగాణను గ్లోబల్ లీడర్‌గా మార్చేలా పకడ్బందీ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. 'లాంగ్ టర్మ్ క్వాంటం స్ట్రాటజీ'లో భాగంగా రీసెర్చ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సైబర్ సెక్యూరిటీ, లైఫ్ సైన్సెస్ యాక్సిలరేషన్, టాలెంట్ పైప్‌లైన్ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టిసారించామని చెప్పారు. క్వాంటం సెన్సింగ్, సెక్యూరిటీ, కమ్యూనికేషన్, క్వాంటం కంప్యూటింగ్‌లో పరిశోధనా, అభివృద్ధి (ఆర్ అండ్ డీ), నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేలా రూపొందించిన ఈ పాలసీ దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందన్నారు. ఇది కేవలం తమ ప్రభుత్వం రూపొందించిన ఒక పాలసీ మాత్రమేకాదని, క్వాంటం టెక్నాలజీలో దేశానికి దిశానిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. ఈ టెక్నాలజీలో దేశానికి ఒక బెంచ్‌మార్క్‌ను ఏర్పాటు చేసేలా ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు కూడా శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి స్టార్టప్స్, కొత్త ఆలోచనలకు భరోసానిచ్చేలా 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు.

ఎన్నికల్లో అడ్డగోలు ఖర్చులొద్దు

(మొదటిపేజీ తరువాయి)

సీఎం రేవంత్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా రూ.260.45 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. తనకు అనుభవం తక్కువైనా వివిధ హోదాల్లో పని చేశానని రేవంత్ అన్నారు. దేవుడు అవకాశం ఇవ్వడంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని, చిన్న వయసులోనే సీఎంగా విజయవంతంగా పని చేస్తున్నానని చెప్పారు. గత రెండేళ్లలో తాను ఏ రోజూ సెలవు తీసుకోలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిందని విమర్శించారు. అప్పట్లో విపక్షాలకు ఏనాడూ మాట్లాడే అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. అలాంటి తప్పిదాలు జరుగకుండా తాము జాగ్రత్త పడుతున్నామని చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము సచివాలయానికి వెళ్తే వందల మంది పోలీసులను పెట్టి నిర్బంధించారని.. తనను, సీతక్కను మళ్లీ ఇంటి గేటు వద్దకు తీసుకెళ్లి పడేశారని విమర్శించారు. అలాంటి పరిస్థితులు ఇప్పుడు లేవని, తాము రానివ్వబోమని స్పష్టం చేశారు. ఎన్నికలొచ్చినప్పుడు మాత్రమే రాజకీయాలుంటాయని.. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివని సీఎం రేవంత్ అన్నారు. సోనియా గాంధీ ఆశీస్సులతోనే 60 ఏళ్ల తెలంగాణ కల సాధ్యమైందని చెప్పారు. అభివృద్ధి ప్రణాళికలను ప్రధాని దృష్టికి తీసుకెళతామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వ సహకారం తీసుకొంటామని పేర్కొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు వివేక్, జూపల్లి తదితరులు

ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకుంటాం

ఆదిలాబాద్‌లో రక్షణ, విమానయాన శాఖల సహకారంతో విమానాశ్రయాన్ని నిర్మిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. ఎర్రబస్సు రావడమే గగనమనుకున్న ఆదిలాబాద్‌లో ఎయిర్‌బస్‌ను దింపుతామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతమైన ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మిస్తే స్థానికంగా ఎన్నో పరిశ్రమలు ఏర్పడతాయని.. టైగర్ రిజర్వ్ ఫారెస్టులో ఉన్న పులులను చూసేందుకు దేశం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తారన్నారు. ఏడాది తిరిగేలోపే ఆదిలాబాద్‌లో ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను ప్రారంభించి, పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని, నూటికి నూరుశాతం అభివృద్ధి చేసే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఎక్కడైతే ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్, ఇరిగేషన్ అందుబాటులో ఉంటాయో ఆ ప్రాంతంలో అభివృద్ధి సాధ్యపడుతుందని సీఎం రేవంత్ అన్నారు. ఇంద్రవెల్లిలో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తే బాగుంటుందని చెప్పారు. గత రెండేళ్లలో 60వేల ఉద్యోగాలు ఇచ్చామని, త్వరలోనే మరో 40వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామన్నారు. మహిళలకు మునుపు ఎక్కడికి వెళ్లాలన్నా ఇంట్లో డబ్బులకు చేయి చాచే పరిస్థితి ఉండేదని.. ఇప్పుడు ఉచిత బస్సు సౌకర్యంతో ఆ పరిస్థితి తప్పిందన్నారు. రాష్ట్రంలో ఆడబిడ్డలు సంతోషంగా ఉన్నారని, అందుకే ఈ ఏడాది భారీ వర్షాలు పడ్డాయని పేర్కొన్నారు.

ప్రజల సొమ్ము తిన్నవారెవరూ బాగుపడరు

ప్రత్యేక రాష్ట్రం వస్తే సాగునీటి ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయని భావిస్తే, ఓ పెద్దాయన దెయ్యమై పట్టారని పరోక్షంగా కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్ విమర్శించారు. లక్షన్నర కోట్లతో కాళేశ్వరం కట్టారని, మూడేళ్లలోనే అది కూలేశ్వరమై కూలిపోయిందని విమర్శించారు. తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సిన కాళేశ్వరం ప్రాజెక్టును అక్కడి నుంచి తరలించి అన్నారం, సుందిళ్ల పేరిట కరీంనగర్ జిల్లాలో నిర్మించారని ఫలితంగా రూ.లక్ష కోట్ల నిధులు గోదావరిపాలయ్యాయని ఆరోపించారు. ఈ పాపం ఊరికే పోదని, ఇప్పుడు ఆ కుటుంబం ఎన్ని బాధలు పడుతోందో చూస్తున్నామన్నారు. ఎప్పుడైనా అక్రమ సంపాదన, ప్రజల సొమ్ము తిన్నోడెవడూ బాగుపడరని, అన్యాయపు సొమ్ము వస్తే కుటుంబాలు ప్రశాంతంగా ఉండవన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టును నిర్మిస్తామని చెప్పారు.

నేడు నర్సంపేటకు సీఎం రేవంత్

- రూ.531కోట్ల పనులకు శంకుస్థాపన
- సీఎం, మాధవరెడ్డి మధ్య సయోధ్య!

వరంగల్/హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లా నర్సంపేటలో శుక్రవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా రూ.531 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు హెలికాప్టర్‌లో నర్సంపేటకు రానున్న సీఎం.. రూ.200కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనానికి భూమి పూజ నిర్వహిస్తారు. అలాగేరూ.130 కోట్లతో నిర్మించే మెడికల్ కాలేజీ భవనాలకు, రూ.25కోట్లతో నిర్మించే నర్సింగ్ కాలేజీ భవనాలకు శంకుస్థాపనలు చేయనున్నారు. రూ.20 కోట్లతో నర్సంపేట మునిసిపాలిటీ పరిధిలో చేపట్టే సీసీ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ పనులకు భూమి పూజ నిర్వహించనున్నారు. రూ.82.56కోట్లతో వరంగల్-నర్సంపేట నాలుగు లైన్ల రోడ్డుకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు నర్సంపేట శివారులోని మెడికల్ కాలేజీ సమీపంలో జరిగే బహిరంగ సభలో సీఎం ప్రసంగించనున్నారు. మరోవైపు సీఎంతో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి ఉన్న విభేదాలు తొలిగినట్లేననే చర్చ జరుగుతోంది. మొదట్నుంచీ సీఎం రేవంత్‌తో మాధవరెడ్డికి విభేదాలున్నాయి. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కూడా ఆయన ఏడాదికి పైగా సీఎంను కలవనే లేదు. రేవంత్ వరంగల్‌కు వచ్చిన సందర్భాల్లోనూ మాధవరెడ్డి దూరంగానే ఉ న్నారు. అయితే, ఇటీవల ఆయన తల్లి మృతి చెందడంతో సీఎం పరామర్శకు ఇంటికి రావటంతో ఇద్దరి మధ్య సయోధ్య కుదరిందనే టాక్ వినపడుతోంది. కాగా, రాష్ట్రంలో ప్రాధాన్య ప్రాజెక్టుల పురోగతిపై ఈనెల 6న సీఎం రేవంత్ సమీక్షించనున్నారు. ఆయా ప్రాజెక్టులకు నిధులు, మూడేళ్లలో పూర్తి చేసే ప్రాజెక్టులపై ఇందులో చర్చించే అవకాశముంది.



ఐఐఎం సదస్సును లోహశాస్త్ర శాస్త్రవేత్తలతో కలసి ప్రారంభిస్తున్న ఐఐటీహెచ్ డైరెక్టర్, ఐఐఎం అధ్యక్షుడు బీఎస్‌మూర్తి

లోహ శాస్త్రవేత్తల కుంభమేళా!

- ఐఐటీహెచ్‌లో ఐఐఎం 79వ అంతర్జాతీయ సదస్సు
- 1,200మంది సైంటిస్టుల రాక

కంది, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దేశ విదేశాల నుంచి 1,200 మంది లోహశాస్త్ర నిపుణులు హాజరైన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ (ఐఐఎం) 79వ అంతర్జాతీయ సదస్సుకు సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ-హెచ్‌లో వేదికైంది. మెటలర్జిస్టులు, మెటీరియల్ శాస్త్రవేత్తలకు కుంభమేళాగా అభివర్ణించే ఈ సదస్సు శనివారం వరకు మూడు రోజులపాటు జరగనుంది. లోహ శాస్త్రజ్ఞులను ఒక చోట చేర్చే లక్ష్యంతో 1946లో 42 మంది సభ్యులతో ప్రారంభమైన ఐఐఎంజీ ఎంతో పురోగతి సాధించిందని, ప్రస్తుతం 10 వేల మందికి పైగా సభ్యులు ఉన్నారని ఆ సంస్థ అధ్యక్షుడు, ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి తెలిపారు. మినరల్స్, మెటీరియల్ సైన్స్, మెటలర్జికల్ ఇంజనీరింగ్ నిపుణుల మధ్య సహకారాన్ని పెంచడంతో సత్ఫలితాలు సాధించామని, పరిశోధనలకు బాట వేశామని చెప్పారు. ఐఆర్ఈఎస్ చైర్మన్, ఎండీ (ఫైనాన్స్) ఎస్.బలరామ్, ఐఐఎం చీఫ్ ఎడిటర్ కే భానుశంకరరావు, ఏఆర్‌సీఐ డైరెక్టర్ నరసింగరావు, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చైర్మన్ కోమల్ కపూర్ తదితరులు పాల్గొన్నారు. తొలిరోజు వివిధ సంస్థలు తమ పరిశోధన ఫలితాలను స్టాళ్లలో ప్రదర్శించాయి. కేంద్ర రక్షణ శాఖ ఆధ్వర్యంలో స్వదేశీ సాంకేతికతో టైటానియం మిశ్రధాతువును అభివృద్ధి చేస్తున్నామని హైదరాబాద్ మిధాని శాస్త్రవేత్తలు తెలిపారు. క్షిపణలు, రాకెట్లకు అవసరమై సామగ్రి తయారు చేస్తున్నామని పేర్కొన్నారు. భూగర్భంలో నుంచి వెలికితీసిన ఖనిజాల నాణ్యతను మూడు దశల్లో పరీక్షించడానికి ఆధునిక పరికరాలను రూపొందించినట్లు చెన్నై మెట్‌కో సంస్థ వెల్లడించింది. 5 వేల సంవత్సరాల క్రితమే తంగేడు, పులాయి ఆకులను దంచి మట్టి కుండలో ఉంచి ఇనుమును గట్టిపరిచే కర్మనాన్ని అభివృద్ధి చేశారని, ఈ పద్ధతిలోనే మన పూర్వీకులు కోటలు నిర్మించారని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఖనిజ పరిశోధకుడు జయకిషన్ తెలిపారు. రాళ్లను సులువుగా తొలిచే యంత్ర పరికరాలను సాయిదీప రాక్ డ్రిల్లింగ్‌సంస్థ ప్రదర్శించింది.

తొలి విడతలో 395 ఏకగ్రీవాలు

సీఎం ఇలాఖాలోవే 26 సర్పంచ్ స్థానాలు.. తొలి విడతలోని 4,236 స్థానాల్లో 5 చోట్ల నామినేషన్లు నిల్

- 3,836 స్థానాలకు 11న పోలింగ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

పంచాయతీ ఎన్నికల్లో భాగంగా తొలి విడత ఎన్నికల్లో పోటీ పడుతున్న అభ్యర్థుల లెక్క తేలింది. ఎన్నికల అధికారులు ప్రకటించిన వివరాల ప్రకారం.. తొలి విడతలో ఎన్నికల జరగనున్న 4,236 సర్పంచ్ స్థానాల్లో 395 స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. ఇందులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని 26 స్థానాలు ఉన్నాయి. ఈ 26 మందిలో 25 మంది కాంగ్రెస్ మద్దతుదారులు కాగా ఒకరు టీడీపీకి చెందిన వారు. కాగా, తొలి విడత ఎన్నికలకు సంబంధించి ఓ ఐదు గ్రామాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలవ్వలేదు. దీంతో మిగిలిన 3,836 సర్పంచ్ స్థానాలకు ఈ నెల 11న ఎన్నికలు జరగనున్నాయి. షెడ్యూల్ ప్రకారం తొలి విడత కోసం 25,654 మంది నామినేషన్లు దాఖలు చేయగా 8,095మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. పలువురి నామినేషన్లు అనర్హతకు గురయ్యాయి. 395 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. చివరిగా 13,127మంది అభ్యర్థులు తొలి విడత ఎన్నికల బరిలో మిగిలారు. నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే నాటికి ఒక్కో సర్పంచ్ స్థానానికి ఆరుగురు పోటీలో ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య నలుగురికి తగ్గింది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం, నెల్లివెంకటాపూర్, ఉండూరుగూడ గ్రామ పంచాయతీలు, ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని తేజాపూర్., నిర్మల్‌జిల్లా దస్తాబాద్ మండలం పెర్కపల్లి పంచాయతీల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలవ్వలేదు. రిజర్వేషన్లు సరిగాలేవని, ఇతర కారణాలు చూపుతూ ఒక్క నామినేషన్ కూడా వేయకుండా ఆ గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. తొలి విడత ఎన్నికల్లో 37,440 వార్డు సభ్యుల స్థానాలకుఎన్నికలు జరగాల్సి ఉండగా వాటిల్లోని 9,331స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్ జిల్లాల పరిధిలోని 5గ్రామాలతోపాటు మరికొన్నిచోట్ల రిజర్వేషన్లు, ఇతర కారణాలతో 149 స్థానాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలవ్వలేదు. మిగిలిన 27,960వార్డు సభ్యుల స్థానాలకు67,893 మంది బరిలో నిలిచారు.

బరిలో ఎమ్మెల్యే సతీమణి

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ సతీమణి స్థానిక ఎన్నికల బరిలో నిలిచారు. ఎమ్మెల్యే కౌసర్ స్వగ్రామమైన మెదక్ జిల్లాలోని బస్వాపూర్ గ్రామ సర్పంచ్ స్థానానికి కౌసర్ సతీమణి నజ్మా సుల్తానా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఇక, పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం మంచరామి గ్రామ సర్పంచ్ స్థానానికి రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఉప్పు తిరుపతి సతీమణి లక్ష్మి గురువారం నామినేషన్ దాఖలు చేశారు. కాగా, తన భార్యకు ఓటేసి ఎన్నికల్లో గెలిపిస్తే వార్డులోని వారికి ఐదేళ్ల పాటు హెయిర్ కట్ ఉచితంగా చేస్తానని హామీ ఇచ్చాడో భర్త. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం రఘోత్తంపల్లికి చెందిన శ్రీకాంత్ తన భార్య కోసం ఇలా ప్రచారం చేస్తున్నాడు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం గంగాపూర్ సర్పంచ్ పదవి కోసం అన్నదమ్ముల కుటుంబాలకు చెందిన కోడళ్లు కవిత జ్ఞాన్‌రెడ్డి, ప్రమీల పాండు రంగారెడ్డి పోటీ పడగా.. కాంగ్రెస్ మద్దతుదారులంతా సమావేశమై రాజీకి యత్నించారు. ఫలితం లేకపోవడంతో టాస్ వేసి అందులో గెలిచిన కవిత జ్ఞాన్‌రెడ్డిని అభ్యర్థిగా నిర్ణయించుకున్నారు. ప్రమీల టాస్‌కు కట్టుబడి ఉంటారా ? లేదా ? అనేది తేలాల్సి ఉంది.

సర్పంచ్ ఎన్నికల్లో జోక్యం చేసుకోలేం

జనాభా లేకున్నా కొన్ని చోట్ల రిజర్వేషన్ల కేటాయింపు.. పిటిషనర్లు పేర్కొన్న అంశాల్లోనూ వాస్తవాలున్నాయ్

- నోటిఫికేషన్ వచ్చాక ఎన్నికలు ఆపలేం
- ఎస్ఈసీ తీరు సరిగ్గా లేదు: హైకోర్టు

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎలక్షన్ కమిషన్ ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసిందని, ఒకసారి ఆ ప్రకటన వచ్చిన తర్వాత ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 234(ఓ) ప్రకారం.. నోటిఫికేషన్ విడుదలయ్యాక న్యాయస్థానాలు కల్పించుకోలేవని.. అది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొంది. పిటిషనర్ల వాదనల్లో విషయం ఉన్నా.. నోటిఫికేషన్‌కు ముందు లేదా ఎన్నికలు పూర్తయిన తర్వాత మాత్రమే కోర్టులు జోక్యం చేసుకోగలవని వెల్లడించింది. కనీస జనాభాను పరిగణనలోకి తీసుకోకుండా సర్పంచ్, వార్డు మెంబర్ పదవులకు రిజర్వేషన్లను కేటాయించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్(ఎస్ఈసీ) తీరు సరిగా లేదని హైకోర్టు తప్పుబట్టింది. ఎన్నికలు పూర్తయ్యాక సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలు ఖాళీగా మిగిలిపోతే ప్రభుత్వంతో సంప్రదించి వీలైనంత త్వరగా మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఈసీకి ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు పిటిషన్ల విచారణను ముగిస్తున్నట్లు పేర్కొంది. వరంగల్ జిల్లా మహమూద్‌పట్నం పంచాయతీలో ఆరుగురు ఓటర్లు మాత్రమే ఉన్నప్పటికీ.. సర్పంచ్ పదవితో పాటు మూడు వార్డులను ఎస్టీలకు రిజర్వ్ చేయడాన్ని సవాల్ చేస్తూ గ్రామస్థులు హైకోర్టులో పిటిషన్ వేశారు. మరికొన్ని గ్రామాలకు సంబంధించి ఇలాంటి మరో నాలుగు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ శ్యామ్ కోషి, జస్టిస్ చలపతి రావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ ఎన్నికలు నిలిపివేయాలని తాము కోరడం లేదని.. రిజర్వేషన్ల ప్రక్రియను కొన్ని ప్రాంతాల్లో మార్చాలన్నదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు. ఈసీ నిర్ణయంతో ఎన్నికలు జరిగే అవకాశం లేకుండా పోయిందని తెలిపారు. ఒక ఊరిలో రిజర్వేషన్ వచ్చిన వర్గానికి చెందిన వారు ఒక్కరే ఉన్నారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 2011 నాటి జనాభా లెక్కలను ఈసీ పరిగణనలోకి తీసుకోవడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. 2014లోనే రాష్ట్రం విడిపోయిందని, అయినా 14ఏళ్ల క్రితం జనాభా లెక్కలను ఆధారంగా తీసుకుంటే ఎలా..? అని ప్రశ్నించారు. ఎస్ఈసీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం నోటీపై చేసిన రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయించామని.. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి 2011 జనాభా లెక్కలు తప్ప వేరే లెక్కలు తీసుకోవడానికి ఆస్కారమే లేదని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ దశలో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. రిజర్వేషన్ వచ్చిన వర్గం జనాభా లేకపోతే.. ఎన్నికలు నిలిచిపోయిన చోట వెంటనే ఎన్నికలు పెట్టాలని తెలిపింది. ముందస్తుగానే రిజర్వేషన్లు సరిగా కేటాయించాల్సి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించింది. పిటిషనర్ల వాదనలో విషయం ఉన్నా.. ఇలా పిటిషన్లు అనుమతిస్తూ పోతే ఎన్నికలు నిర్వహించడం సాధ్యంకాదని తేల్చి చెప్పింది.


29 మంది కలెక్టర్లను ఎందుకు చేర్చారు..?

బీసీ రిజర్వేషన్లను 17 శాతానికి తగ్గించారంటూ దాఖలైన మరో పిటిషన్‌లో న్యాయవాది తీరును ధర్మాసనం తప్పుబట్టింది. 29 జిల్లాల కలెక్టర్లను ప్రతివాదులుగా ఎలా చేరుస్తారని.. వారందనీ ఉద్యోగం నుంచి తొలగించాలని మీ ఉద్దేశమా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. రిజర్వేషన్లకు సంబంధించిన వ్యవహారంలో కో వారెంటో(ప్రభుత్వ ఉద్యోగికి ఆ పదవిలో కొనసాగే అధికారం లేదని) పిటిషన్ ఎలా దాఖలు చేస్తారని అసహనం వ్యక్తం చేసింది. 29 మంది ఐఏఎస్ అధికారులను ప్రతివాదులుగా చేర్చడం సరికాదని, పిటిషన్ కొట్టివేయాలన్న అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి విజ్ఞప్తితో ఏకీభవించిన ధర్మాసనం.. పిటిషన్‌ను కొట్టేస్తున్నట్లు ప్రకటించింది.



మరో రెండు దశాబ్దాలలో తెలంగాణను అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిపేందుకు అవసరమైన విజన్ డాక్యుమెంట్‌ను రేవంత్‌రెడ్డి సర్కారు సిద్ధం చేసింది. అందులో భాగంగా భారీ అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకుంది. రాష్ట్రాన్ని మూడు అభివృద్ధి మండలాలుగా విభజించి వాటి బలాల ఆధారంగా అభివృద్ధి వ్యూహాలను ఖరారు చేసింది. ఓఆర్ఆర్ లోపలి ప్రధాన నగరాన్ని అటు ఐటీరంగం కోసం, ఇటు నైట్ లైఫ్ ఆధారిత టూరిజం కోసం ప్రత్యేకించింది. ఆర్ఆర్ఆర్ లోపలి ప్రాంతాన్ని కాలుష్య రహిత పరిశ్రమల కోసం, ఫ్యూచర్ సిటీ కోసం నిర్దేశించింది. ఆర్ఆర్ఆర్ బయటి ప్రాంతాన్ని వ్యవసాయ ఆధార తెలంగాణగా తీర్చిదిద్దనుంది. రాష్ట్రం సరిహద్దుల్లోని ఏ పట్టణం నుంచయినా కేవలం రెండు గంటల్లో హైదరాబాద్ చేరుకొనే విధంగా తెలంగాణ అంతటా లక్షన్నర కిలోమీటర్ల రోడ్‌నెట్వర్క్ సిద్ధం చేస్తున్నారు.

TELANGANA RISING 2047



తలసరి ఆదాయం టార్గెట్

రూ.24 లక్షలు!

2047 కల్లా సాధించాలని సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యం..

నెట్ జీరో లక్ష్యం:

తెలంగాణను నెట్-జీరో కాలుష్య రాష్ట్రంగా మలచడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

- పునరుత్పాదక శక్తిపై భారీ పెట్టుబడులు
- హరిత మౌలిక వసతులు
- వనరుల పరిమిత వినియోగం, పునర్వినియోగం
- ప్రకృతి ఆధారిత పరిష్కారాలు
- పరిశ్రమల్లో కార్బన్ తగ్గిస్తే ప్రోత్సాహకాలు

విజయానికి 3 పునాది స్తంభాలు

- టెక్నాలజీ వినూత్న ఆవిష్కరణలు
- సమర్థ ఆర్థిక విధానం
- సుపరిపాలన

ప్రధాన ఆశయాలు

- మెరుగైన విద్య.. • ఉత్తమ వైద్యం
- పారిశుద్ధ్యం.. • స్వచ్ఛమైన వాతావరణం
- భద్రత.. • ఇంటి దగ్గరే అవకాశాలు
- భవిష్యత్తుకు అనుగుణంగా ఐటీ, ఏఐ, సైబర్ సెక్యూరిటీ, ఆంత్రప్రెన్యూర్‌షిప్
- ఆధునిక నైపుణ్యాలు

- ప్రస్తుత రూ.4.30 లక్షల నుంచి 6.2 రెట్లు పెరగాలి
- తెలంగాణ రైజింగ్-2047 విజన్ డాక్యుమెంట్లో ప్రస్తావన
- మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలి
- భారత జీడీపీలో 10 శాతం వాటా మనదే కావాలి
- 3 ప్రాంతాలుగా విభజించి తెలంగాణ అభివృద్ధి
- లక్షన్నర కిలోమీటర్ల రోడ్లు... మరో 2 రింగ్‌రోడ్లు
- భారత్ ఫ్యూచర్ సిటీలో 30లక్షల మంది జనాభా
- ఉద్యోగం, అధ్యయనం, వినోదం, నివాసం అక్కడే

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తలసరి ఆదాయం 2047 నాటికి రూ.24 లక్షలకు పెంచాలని తెలంగాణ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.4.30 లక్షలుగా ఉన్న తెలంగాణ పౌరుడి తలసరి ఆదాయాన్ని రెండు దశాబ్దాల్లో ఆరు రెట్లకు పెంచాలన్న బృహత్తర లక్ష్యాన్ని భుజానికి ఎత్తుకుంది. ఫ్యూచర్ సిటీ రాష్ట్రానికే కాకుండా దేశానికి భవిష్యత్తును చూపించే నగరంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోంది. రెండు దశాబ్దాల్లో 30 లక్షల మంది జనాభా ఆ నగరాన్ని ఆవాసంగా చేసుకుంటారని అంచనా వేస్తోంది. రాష్ట్రం మొత్తాన్ని భౌగోళిక పరిస్థితుల ఆధారంగా మూడు జోన్‌లుగా విభజించి, అక్కడి పరిస్థితులకు అనువైన పెట్టుబడులను ఆకర్షించి శరవేగంతో అభివృద్ధి సాధించాలని లక్ష్యాలు నిర్దేశించుకుంది. రాష్ట్ర ప్రజల్లో 90 శాతం మంది ఇంట్లో బయలుదేరిన రెండు గంటల్లో హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డును టచ్ చేసే విధంగా రాష్ట్రమంతటా విశాలమైన రోడ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనుంది. ఇప్పుడున్న రోడ్ నెట్‌వర్క్‌కు మరో 150 శాతం కొత్త రోడ్లను జోడిస్తారు. ఐటీ, ఏఐ, క్వాంటమ్ టెక్నాలజీల్లో ముందంజ వేయడమే కాకుండా ముందెన్నడూ లేనన్ని పెట్టుబడులు, ఉద్యోగాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి పౌరుడికి ఉత్తమ వైద్యం, అత్యుత్తమ విద్య, స్వచ్ఛమైన వాతావరణం, భద్రత, ఉపాధి అవకాశాలు, ఆధునిక నైపుణ్యాలు అందించేలా ప్రణాళికలు... తెలంగాణ రైజింగ్-2047 దార్శనిక పత్రంలోని ముఖ్య అంశాలివే. అందులో లక్ష్యాలు, వాటిని సాధించుకొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలను రూపొందించారు. 4 లక్షల మంది అభిప్రాయాలు తీసుకుని ఈ దార్శనిక పత్రాన్ని తీర్చిదిద్దారు. లక్ష్యాలే కాకుండా వాటిని సాధించే మార్గాలను కూడా పొందుపరిచారు. ఈ నెల 8, 9 తేదీల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'లో ఈ విజన్ డాక్యుమెంట్‌ను ప్రభుత్వం ఆవిష్కరించనుంది. మొత్తం ఎనిమిది రంగాలను-ఎనిమిది థీమ్‌లుగా చేసుకుని డాక్యుమెంట్‌ను రూపొందించారు.

యువత...రైతులు


యువతకు మంచి విద్యతో పాటు భవిష్యత్తు నైపుణ్యాలను అందిస్తారు. మూడు ఆర్థిక మండలాలకు తగిన నైపుణ్యాలను వారిలో అభివృద్ధి చేస్తారు. గ్లోబల్ ఇండస్ట్రీ భాగస్వామ్యాల ద్వారా విస్తృత ఉపాధి అవకాశాలను సృష్టిస్తారు. పంట వైవిధ్యం, అగ్రిటెక్ వాడకం, విలువ వృద్ధి ద్వారా రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తారు. లాజిస్టిక్స్, ఎఫ్‌పీఓలు, సాగునీరు, రియల్-టైమ్ సలహాలపై దృష్టి పెడుతుంది. ఆరోగ్యాన్ని ప్రధాన లక్ష్యంగా పరిగణిస్తారు. ప్రాథమిక వైద్యం, వ్యాధి నిరోధక విధానాలను బలోపేతం చేస్తారు. వృద్ధులు, దీర్ఘకాలిక రోగాల నిర్వహణ, చౌక ఆరోగ్య సేవలు, సామాజిక సంక్షేమంపై దృష్టిసారిస్తారు.

లక్షన్నర కిలోమీటర్లు... మరో 2 రింగ్ రోడ్లు

ఇరవయ్యేళ్లలో రాష్ట్ర రోడ్ నెట్‌వర్క్‌ను 150 శాతం వృద్ధి చేస్తారు. ఇప్పుడు 34,058 కిలోమీటర్ల రోడ్లు ఉండగా వీటిని 53,102 కిలోమీటర్లకు పెంచుతారు. వరుసలను కూడా లెక్కలో తీసుకుంటే ప్రస్తుతం ఉన్న రోడ్లు 46 వేల కిలోమీటర్లు. లక్షన్నర కిలోమీటర్లకు పెంచుతారు. జాతీయ రహదారుల నెట్‌వర్క్ 4983 కిలోమీటర్ల నుంచి 7,482 కిలోమీటర్లకు రాష్ట్ర రహదారుల్ని 1,687 కిలోమీటర్ల నుంచి 8,600 కిలోమీటర్లకు పెంచుతారు. ఆర్ఆర్ఆర్‌కు అనుబంధంగా మరో రెండు రింగ్ రోడ్లను ప్రతిపాదించారు. ఒకటి 1150 కిలోమీటర్లతో సరిహద్దులకు ఆనుకున్న పట్టణ ప్రాంతాలను అనుసంధానిస్తారు. ప్రజా వలయం పేరుతో 770 కిలోమీటర్లతో గ్రామీణ తెలంగాణను అనుసంధానిస్తారు. ఈ నెట్‌వర్క్‌తో పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉండే 90 శాతం మంది ప్రజలు రెండు గంటల వ్యవధిలో ఓఆర్ఆర్‌ను చేరుకుంటారు.

కోటి మంది మహిళలు... మిలియనీర్లు

జీవితంలోని ప్రతి దశలో మహిళలకు సహాయం చేస్తూ కోటి మంది మహిళలను మిలియనీర్లను తయారు చేస్తారు.



భారత్ ఫ్యూచర్ సిటీ

నివాసం, పని, వినోదం అక్కడే

భారత్ ఫ్యూచర్ సిటీని 13,500 ఎకరాల్లో నిర్మిస్తారు. నివాసం, పని, అధ్యయనం, వినోదం అన్నీ ఒకే చోట డిజైన్ చేస్తారు. తొలి నెట్‌జీరో కార్బన్ నగరం. కార్యాలయాలకు 15 నిమిషాల్లో నడుచుకుంటూ వెళ్లొచ్చు. ప్రధాన వాణిజ్య కేంద్రం చుట్టూ ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ హబ్, వినోద కేంద్రాలు వస్తాయి. 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో 25 నుంచి 30 లక్షల మంది జనాభా నివాసం ఉండేలా తీర్చిదిద్దుతారు. వినోదం కోసం వందల ఎకరాల్లో క్రికెట్ స్టేడియం, గోల్ఫ్ కోర్స్, థీమ్ పార్కులు, రిసార్టులు వస్తాయి.

వ్యవసాయానికి ఊతం

వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్‌లో ఆధునిక పరిశోధనకోసం భారత్ ఫ్యూచర్ సిటీలో ఏఐ కేంద్రాలు అభివృద్ధి చేస్తారు. తెలంగాణ అగ్రిటెక్ రీసెర్చ్- సర్టిఫికేషన్ సెంటర్(టీఏఆర్‌సీ)ను ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేస్తారు. నానో ఇన్‌పుట్ రీసెర్చ్ సెంటర్(ఎన్ఐఆర్‌సీ), తెలంగాణ అగ్రికల్చర్ బయో ఇన్‌ఫర్మాటిక్ గ్రిడ్(టీఏజీ) పెడతారు. మొబైల్ మృత్తిక పరీక్ష నెట్‌వర్క్, సామాజిక మృత్తిక మిషన్ ఏర్పాటు చేస్తారు. హెక్టారుకు వ్యవసాయ విద్యుత్ శక్తిని 3.5 కిలోవాట్ల నుంచి 9 కిలోవాట్లకు పెంచుతారు. 40 లక్షల ఎకరాలకు స్మార్ట్‌గా సాగునీరు అందిస్తారు. ఎప్పుడు, ఎంత తడి అవసరం అనేది సాంకేతికత ద్వారా గ్రహించి అందేలా చూస్తారు. దీనికోసం డిజిటల్ వాటర్ ఇంటెలిజెన్స్‌ను ఏర్పాటు చేస్తారు. పామాయిల్ విస్తీర్ణం 11.83 లక్షల ఎకరాలకు పెంచుతారు. 11 సీడ్ హబ్‌లు, సీడ్ కౌన్సిల్ ఏర్పాటును ప్రతిపాదించారు. 25 లక్షల ఎకరాలకు మద్దతుగా 500 అగ్రిటెక్ క్లస్టర్లు, 3.50 లక్షల టన్నుల గిడ్డంగి సామర్థ్యం, కోల్డ్ స్టోరేజీ విస్తరణ కూడా ప్రాధాన్యం ఇచ్చారు.

3 ప్రాంతీయ అభివృద్ధి మండలాలు

రాష్ట్రాన్ని మూడు ప్రాంతీయ అభివృద్ధి మండలాలుగా వర్గీకరించారు. అక్కడి అవకాశాలను బట్టి అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించారు.

ఎ) గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతం. 2,053 చదరపు కిలోమీటర్లు. టెక్నాలజీ, పెట్టుబడులకు గ్లోబల్ హబ్. దీన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ(క్యూర్) అని పిస్తున్నారు.

- టెక్నాలజీ, డీప్‌టెక్, ఏఐ, ఇండస్ట్రీ 4.0, మాన్యుఫాక్చరింగ్
- గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్(జీసీసీ)
- డిజైన్ స్టూడియోలు, ఆర్ అండ్ డీ ల్యాబ్స్
- స్టార్టప్‌లు, నాలెడ్జ్ ఎకానమీ ప్రధాన కేంద్రం
- గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా అభివృద్ధి

బి) ఓఆర్ఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతం. 9,281 చదరపు కిలోమీటర్లు. భారత్ ఫ్యూచర్ సిటీ ఇందులోనే. పెరి అర్బన్ రీజియన్(ప్యూర్)గా పిలుస్తారు. పారిశ్రామిక వాడలు, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు, నెట్‌జీరో టౌన్‌షిప్‌ల నిర్మాణం చేపడతారు.

- మధ్యస్థాయి అండ్ క్లస్టర్ ఆధారిత పరిశ్రమలు
- పర్యావరణ ప్రమాణాలతో ఆరెంజ్, ఎల్లో వర్గ పరిశ్రమలు
- ఎకో ఇండస్ట్రియల్ పార్కులు
- నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు
- గ్రామీణ ఉత్పత్తులను పట్టణ మార్కెట్లకు అనుసంధానించడం

సి) ఆర్ఆర్ఆర్ బయట.. గ్రామీణ వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ(రేర్)గా పిలుస్తారు. మిగిలిన 9,400 గ్రామాలు, 108 పట్టణ ప్రాంతాలు కలిపి 1,00,743 చదరపు కిలోమీటర్లు. వ్యవసాయం, అనుబంధ ఉత్పత్తులు, చేనేత, సాంస్కృతిక రంగాలు, పర్యాటకానికి పెద్దపీట వేస్తారు.

గ్రామీణ జీవనోపాధులు, ప్రకృతి ఆధారిత ఆర్థిక వ్యవస్థకు ప్రాధాన్యం ఇస్తారు.

- టెక్నాలజీ ఆధారిత వ్యవసాయం(ఏఐ, ఐఓటీ, ఫార్మింగ్)
- పశు సంవర్ధకం, పాలు, చేపల పెంపకం బలోపేతం
- అటవీ ఆధారిత జీవనోపాధులు, గిరిజన తెగలకు బాసట
- ఎకో-టూరిజం క్లస్టర్లు
- డిజిటల్ వ్యవసాయం, లాజిస్టిక్స్, ఎఫ్‌పీఓ నెట్‌వర్క్‌లు



3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ

ప్రజల జీవన ప్రమాణాలకు ఒక ప్రధాన సూచిక తలసరి ఆదాయం. ఈ విషయంలో ప్రస్తుతం దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. రెండు దశాబ్దాల్లో అభివృద్ధి చెందిన దేశాల స్థాయికి వెళ్లడం లక్ష్యంగా పెట్టుకుంది. 2024-25లో తెలంగాణ తలసరి ఆదాయం 5,100 డాలర్లు. 2046-47 నాటికి పెట్టుకున్న లక్ష్యం 28,800 డాలర్లు. రూ.4.30 లక్షల నుంచి రూ.24 లక్షలకు... అంటే దాదాపు 6.2 రెట్లు పెంచాలన్నది ఉద్దేశం. స్థూల రాష్ట్రోత్పత్తిని(జీఎస్‌డీపీ)ని 3 ట్రిలియన్ డాలర్లకు పెంచాలన్నది మరో లక్ష్యం. స్థూల దేశీయోత్పత్తిలో అది పది శాతంగా ఉండాలి. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డీజీ) ఆధారంగా దీన్ని సాధిస్తారు. అభివృద్ధి ఫలాలను ప్రజలందరికీ సమానంగా పంపిణీ చేస్తామని ప్రకటించారు. పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల రేటును 52 శాతం పెంచుతారు. వినూత్న ఆవిష్కరణల ద్వారా పరిశ్రమల ఉత్పాదకతను భారీగా పెంచుతూ వలస వెళ్లిన తెలంగాణ నిపుణులను వెనక్కి రప్పిస్తారు. డీప్‌టెక్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం, సైబర్ సెక్యూరిటీ, జీన్‌టెక్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై ప్రత్యేకంగా దృష్టి పెడతారు.



ఇప్పటికే లక్ష కోట్ల పెట్టుబడులు

తెలంగాణను తయారీ రంగం, నాలెడ్జ్-బేస్డ్ పెట్టుబడుల గమ్యస్థానంగా మలుస్తారు. అధునాతన తయారీ, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ప్రతిభను ఆకర్షించడం, జీవన ప్రమాణాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, అత్యాధునిక ఆర్ అండ్ డీ కేంద్రాలు, శక్తివంతమైన ఎకోసిస్టమ్‌ను నిర్మించడమే లక్ష్యం. ప్రగతిశీల విధానాలతో ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో పారిశ్రామిక దిగ్గజాలను ఆకర్షిస్తారు. ఇప్పటికే 14 సంస్థలు రూ.లక్ష కోట్లపెట్టుబడికి సిద్ధమయ్యాయి. మరో 35 సంస్థలు ప్రభుత్వంలో చర్చలు జరిపి ఒక అంగీకారానికి వచ్చాయి. మరో లక్షకోట్లు రావొచ్చని అంచనా.

మన బ్రాండ్ మాంసం

పరిశుభ్రమైన మాంసం ఉత్పత్తి, ప్రాసెసింగ్ కోసం 100 మాంసం హబ్‌లు ఏర్పాటు చేస్తారు. టీ-ఎగ్, టీ-మీట్ పేరుతో తెలంగాణ పౌల్ట్రీకి బ్రాండింగ్ కల్పిస్తారు. 42.86 లక్షల మంది మహిళలకు దేశీ కోడీ స్టార్టర్ కిట్లు ఇస్తారు. మహిళల ఆధ్వర్యంలో 259 ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తారు. చేపలు, రొయ్యల ఉత్పత్తిలో 5 రెట్లు వృద్ధి సాధిస్తారు. 22 లక్షల టన్నులకు పెంచుతారు. 23.5 లక్షల మందికి ఉపాధి కల్పిస్తారు.

3 పారిశ్రామిక కారిడార్లు

మూడు ప్రధాన జాతీయ రహదారులను పారిశ్రామిక కారిడార్లుగా తీర్చిదిద్దుతారు. హైదరాబాద్-బెంగళూరు కారిడార్, హైదరాబాద్-వరంగల్ కారిడార్, హైదరాబాద్-విజయవాడ కారిడార్లకు అటూ ఇటూ స్మార్ట్ పారిశ్రామిక నగరాలు, మెగాపార్కులు, సెమీకండక్టర్లు, గ్రీన్ హైడ్రోజన్, ఎరోస్పేస్, రక్షణ పెట్టుబడులను ఆకర్షిస్తారు. ఫార్మా రంగంలో ఇంటిగ్రేటెడ్ ఫార్మా హబ్‌లు, క్లినికల్ రీసెర్చ్‌లను ఏర్పాటు చేస్తారు.



నగరం ఇక నిద్రపోదు

రాత్రి ఉత్సవాలతో మరో కొత్త ఆర్థిక వ్యవస్థను సృష్టించాలని ప్రభుత్వం భావిస్తోంది. దాంతో లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. నైట్ బజార్లు, ఫుడ్ కోర్టులు, సాంస్కృతిక ప్రదర్శనలు ఇందులో భాగం. మూసీకి అటూ ఇటూ సాంస్కృతిక పునరుజ్జీవనం చేస్తారు. పర్యాటక రంగంలోనే 50 వేల కోట్ల పెట్టుబడులు అంచనా వేస్తున్నారు. రాత్రివేళ పనిచేసే లక్షల మంది ఐటీ, అనుబంధ నిపుణులకు అవసరమైన సౌకర్యాలను విస్తరిస్తారు. దక్షిణాసియా రాత్రి జీవిత రాజధానిగా హైదరాబాద్‌ను మలుస్తారు. 24 గంటలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తిరిగే పరిస్థితి కల్పిస్తారు. పోలీసులు, మహిళా శిశు సంక్షేమ శాఖలు ఇందులో భాగం పంచుకుంటాయి. మెట్రో, ఆర్టీసీ, హెచ్ఎండీఎ, రవాణా శాఖల సమన్వయంతో రవాణాను నిర్వహిసారు.



గ్లోబల్ సమ్మిట్‌లో కీరవాణి కచేరి

90 నిమిషాల పాటు ప్రత్యేక సంగీత కార్యక్రమం

జయలక్ష్మి వీణా కార్యక్రమం, కళాకృష్ణ పేరిణి ప్రదర్శన

10-13 తేదీల్లో రోజంతా మ్యూజికల్ ఆర్కెస్ట్రా



హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనే దేశ, విదేశీ ప్రతినిధులను తెలంగాణ సాంస్కృతిక కళారూపాలు అలరించనున్నాయి. ఆస్కార్ అవార్డు గ్రహీత, ప్రముఖ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి తన బృందంతో 90 నిమిషాల సంగీత కచేరీ అలరించనుంది. ప్రముఖ వీణా విద్వాంసురాలు పి.జయలక్ష్మి వీణా కార్యక్రమం, కళా కృష్ణ ఆధ్వర్యంలో పేరిణి నాట్యం అతిథులను ఆకట్టుకోనున్నాయి. ప్రముఖ ఇంద్రజాల మాంత్రికుడు సామల వేణు ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు. వీటితోపాటు తెలంగాణ సంప్రదాయ కళారూపాలు ఆహూతులను అలరించనున్నాయి. కొమ్ముకోయ, బంజారా, కోలాటం, గుస్సాడి, ఒగ్గుడోలు, మహిళల డప్పులు, పేరణి నృత్యం, బోనాల కోలాటం వంటి ప్రజా కళారూపాలతో అతిథులకు ఆహ్వానం పలికేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సమ్మిట్ డిసెంబరు 8 నుంచి ప్రారంభమవుతుండగా 10 నుంచి 13వ తేదీ వరకు ఈ వేడుకలను ప్రజలు కూడా వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. ఈ నాలుగు రోజుల పాటు రోజంతా మ్యూజికల్ ఆర్కెస్ట్రా నిర్వహిస్తారు.

'ఉచిత బస్సు'కు రూ.8402 కోట్లు!

రూ.500కు గ్యాస్ సిలిండర్ పథకానికి 700 కోట్లు.. ఈ పథకాలతో మహిళా సాధికారతకు అడుగులు

- ఉచిత విద్యుత్తుకు రూ.3438 కోట్లు
- రైతు భరోసాకు రూ.21426 కోట్ల వ్యయం
- రూ.20,616 కోట్లతో రైతులకు రుణమాఫీ
- ఇందిరమ్మ ఇళ్లకు రూ.3200 కోట్ల ఖర్చు
- రెండేళ్లలో సాధించిన విజయాలను వెల్లడించిన సర్కారు

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రెండేళ్లలో కోటికి పైగా కుటుంబాలకు ఆర్థిక చేయూత అందింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ల పథకాలతో మహిళా సాధికారతకు అడుగులు పడ్డాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచడంతో పేదల ఆరోగ్యానికి మరింత భరోసా లభించింది. గడిచిన రెండేళ్లలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు సాధించిన విజయాలను గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటనలో వివరించింది.

మహిళలకు ఉచిత ప్రయాణం..

రాష్ట్రంలోని మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచితంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారని.. సగటున రోజుకు 34.32 లక్షల మంది మహిళలు ఈ పథకాన్ని వినియోగించుకుంటున్నారని తెలిపింది. 'ఈ ఏడాది డిసెంబరు 1 నాటికి రూ.8402 కోట్లు మహిళలకు ఆదా అయ్యాయి.' అని వెల్లడించింది. 'పేదింటి మహిళలపై గ్యాస్ సిలిండర్ భారాన్ని తగ్గించాం. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇచ్చి, మిగతా మొత్తాన్ని భరిస్తున్నాం. ఇప్పటివరకు రాష్ట్రంలో 42.90 లక్షల కుటుంబాలు గ్యాస్ సబ్సిడీతో లబ్ధి పొందుతున్నాయి. వీరి పేరిట చెల్లించాల్సిన దాదాపు రూ.700 కోట్ల సబ్సిడీని ప్రభుత్వమే చెల్లిస్తోంది' అని వివరించింది. '200 యూనిట్లలోపు విద్యుత్తు వాడే గృహ వినియోగదారులందరికీ జీరో బిల్లులు జారీ చేశాం. దీంతో దాదాపు 52.28 లక్షల కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గింది. ఇప్పటి వరకు దాదాపు రూ.3438 కోట్ల సబ్సిడీని విడుదల చేశాం' అని ప్రభుత్వం వెల్లడించింది.

రైతు భరోసా పెట్టుబడి సాయం..

రైతుల సంక్షేమం, వ్యవసాయ పురోగతికి భారీ పథకాలను అమలు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. 'ఎకరానికి రూ.12 వేల చొప్పున రాష్ట్రంలోని రైతులందరికీ రైతు భరోసా నిధులు పంపిణీ చేశాం. మొత్తం 1,57,51,000 ఎకరాలకు 69,86,548 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో ఈ నిధులు జమ చేశాం. ఈ ఏడాది వానాకాలం పంటలకు రికార్డు వేగంతో రైతు భరోసా నిధులు ఇచ్చాం. గతంలో ఎన్నడూ లేనంత వేగంగా కేవలం 9 రోజుల్లోనే రూ.8744 కోట్లు జమ చేశాం. కాగా, భూమి లేని వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు ఆర్థిక సహాయం అందించే 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకాన్ని అమలు చేస్తున్నాం. సన్న ధాన్యం పండించే రైతులను ప్రోత్సహించేందుకు క్వింటాలుకు రూ.500 అదనంగా బోనస్ రూపంలో ఇస్తున్నాం. ఈ సీజన్‌లో ఇప్పటికే సన్నాలు అమ్మిన రైతులకు రూ.314 కోట్ల బోనస్ చెల్లించాం. రైతులకు ఒకేసారి రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేశాం. ఏకంగా 25.35 లక్షల మంది రైతు కుటుంబాలను రుణ విముక్తులను చేశాం. తొలి ఏడాదిలోనే రూ.20616 కోట్ల రుణమాఫీ చేశాం' అని వివరించింది.

ఇందిరమ్మ ఇళ్లు

ఇల్లు లేని నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమల్లోకి తెచ్చినట్లు ప్రభుత్వం వెల్లడించింది. 'ఈ పథకం కింద ఈ ఏడాది రూ.22,500 కోట్లతో నియోజకవర్గానికి 3,500 చొప్పున 4.50 లక్షల ఇళ్ల నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే మూడు లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభమై, వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటివరకు నిర్మాణాలు పూర్తిచేసుకున్న ఇళ్లకు రూ.3,200 కోట్లకు పైగా నిధులను విడుదల చేశాం.' అని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.



రూ.10 లక్షలకు ఆరోగ్యశ్రీ పెంపు..

పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పరిధిని రూ.10 లక్షలకు పెంచినట్లు రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో పేద విద్యార్థులకు నాణ్యమైన, ఉచిత విద్యను అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో ఒక యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తోందని తెలిపింది. ప్రస్తుతం 78 పాఠశాలలు నిర్మాణ దశలో ఉన్నాయని, వీటికి ప్రభుత్వం రూ.15600 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు వివరించింది.

ఆకాశాన్నంటిన విమాన టికెట్ ధరలు!

ఇండిగో సంక్షోభంతో రేట్లు పైపైకి.. ఢిల్లీ నుంచి న్యూయార్క్‌కు రూ.36,668

- ఢిల్లీ నుంచి ముంబైకి రూ.40,452
- పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్న పోటీ సంస్థలు.. ప్రయాణికులకు ఇక్కట్లు
- మూడో రోజు 550కి పైగా ఇండిగో సర్వీసుల రద్దు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

దేశంలోనే అతిపెద్ద పౌర విమానయాన సంస్థ ఇండిగోలో సంక్షోభం కొనసాగుతోంది. గురువారం ఏకంగా 550కి పైగా దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. రోజూ దాదాపు నాలుగు లక్షల మంది ప్రయాణికులు ఇండిగో విమానాల్లో ప్రయాణిస్తుంటారు. ఇండిగోలో నెలకొన్న అంతర్గత సమస్యల వల్ల రెండు మూడు రోజులుగా భారీ సంఖ్యలో విమానాలు రద్దవుతున్నాయి. పలు విమానాల రాకపోకల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఈ ప్రభావం టికెట్ ధరలపై పడింది. ఎంతలా అంటే.. ఢిల్లీ నుంచి అమెరికాలోని న్యూయార్క్‌కు వెళ్లడం కంటే ముంబై వెళ్లడానికే ఎక్కువ ఖర్చు పెట్టాల్సినంతగా ధరలు పెరిగిపోయాయి! ఢిల్లీ నుంచి న్యూయార్క్‌కు శుక్రవారం విమాన టికెట్ కనిష్ఠ ధర రూ.36,668. అదే సమయంలో ఢిల్లీ నుంచి ముంబైకి టికెట్ ధర రూ.40,452. ఇండిగో సంస్థ భారీగా విమాన సర్వీసులు రద్దు చేయడంతో దేశంలో విమాన టికెట్ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. పోటీ విమానయాన సంస్థలు ప్రస్తుత పరిస్థితిని సొమ్ము చేసుకుంటున్నాయి. టికెట్ ధరలు అమాంతం పెరగడంతో ప్రయాణికులు బెంబేలెత్తిపోతున్నారు. అత్యవసర ప్రయాణాలు చేయాల్సిన వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఇండిగో సిబ్బందితో ప్రయాణికుల వాగ్వాదం..

కొవిడ్ తర్వాత ఇండిగో సంస్థ ఇంత పెద్ద సంఖ్యలో సర్వీసులు రద్దు చేయడం ఇదే తొలిసారి. విమానాల రద్దు, ఇతర సమస్యలతో అనేక విమానాశ్రయాల్లో ప్రయాణికులు గంటలకొద్దీ పడిగాపులు కాస్తున్నారు. గురువారం 550కిపైగా సర్వీసులు రద్దయ్యాయి. ఇందులో హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగించే



72 సర్వీసులు, బెంగళూరులో 73, చెన్నైలో 39, విశాఖలో 6 ఇండిగో సర్వీసులు నిలిచిపోయాయి. ఉన్నపళంగా విమానాలను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎయిర్‌పోర్టు సిబ్బంది, ఇండిగో ఉద్యోగులతో వాగ్వాదానికి దిగారు. ఇక విమాన టికెట్ రేట్లు జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నాయి. హైదరాబాద్ నుంచి ఢిల్లీకి గురు, శుక్రవారాల్లో విమాన టికెట్ గరిష్ఠ ధర రూ.30వేల పైనే ఉంది. శుక్రవారం ఢిల్లీ నుంచి అమెరికాలోని న్యూయార్క్ వెళ్లే డెల్టా ఎయిర్‌లైన్స్ విమాన టికెట్ ధర రూ.36,668లు కాగా.. ఢిల్లీ నుంచి ముంబై నేరుగా వెళ్లే విమాన టికెట్ ధర గరిష్ఠంగా రూ.40,452 పలుకుతోంది. శుక్రవారం ఢిల్లీ నుంచి ముంబైకి ఉదయం 7.05 గంటలకు, సాయంత్రం 4, రాత్రి 7.40, 8.30 గంటలకు బయల్దేరే ఎయిర్ ఇండియా సర్వీసుల్లో టికెట్ ధర రూ.38,676 ఉండడం గమనార్హం. అలాగే ముంబై నుంచి ఢిల్లీకి రూ.36,222గా ఉంది. గురువారం రాత్రి 10 గంటల సమయంలో బుక్ చేసుకునే వారికి ఈ ధర ఉంది. ఇవి మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఢిల్లీతో పాటు ముంబై, బెంగళూరు నగరాలకు నేరుగా విమాన సర్వీసుల టికెట్ ధరలు కనిష్ఠంగా రూ.22 వేల నుంచి రూ.30 వేల వరకు ఉన్నాయి. సాధారణంగా ప్రధాన నగరాల మధ్య టికెట్ ధరలు రూ.6-10 వేల వరకు ఉంటాయి. ఢిల్లీ నుంచి విజయవాడకు కూడా విమాన టికెట్ ధరలు మోతెక్కుతున్నాయి. శుక్రవారం ఉదయం 5.45 గంటలకు విజయవాడ బయల్దేరే ఎయిర్ ఇండియా విమాన టికెట్ ధర రూ.34,987 ఉంది. ఇక విజయవాడ నుంచి ఢిల్లీకి నేరుగా వెళ్లే విమాన టికెట్ ధరలు గరిష్ఠంగా రూ.20 వేలకు పైగానే ఉన్నాయి.

గందరగోళానికి కారణమేంటి?

ఇండిగోలో నెలకొన్న సంక్షోభం వెనక అనేక కారణాలున్నాయి. వాటిలో ముఖ్యమైనది.. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తీసుకొచ్చిన నిబంధనలు. పైలట్లకు, ఇతర సిబ్బందికి తగినంత విశ్రాంతి లేకపోవడం కూడా విమాన దుర్ఘటనలకు కారణమని గుర్తించిన డీజీసీఏ గత ఏడాది జనవరిలో కొత్త నిబంధనలను తీసుకొచ్చింది. ఈ ఏడాది నవంబరు నుంచి ఈ నిబంధనలను పూర్తిస్థాయిలో అమల్లోకి తెచ్చింది. వీటి ప్రకారం.. విమాన సిబ్బందికి వారాంతపు విశ్రాంతి వ్యవధి గతంలో కంటే పెరిగింది. గతంలో డ్యూటీ షెడ్యూల్‌లో కనీసం ఆరు నైట్ షిఫ్టులు ఉండగా.. ప్రస్తుతం వాటిని రెండుకు కుదించారు. రాత్రి వేళల్ని గతంలో కంటే ఒక గంట అదనంగా పెంచారు. ప్రయాణికులకు చౌకగా సేవలు అందించడానికి వీలుగా ఇండిగో ఎక్కువగా రాత్రి సర్వీసులను (టికెట్ ధరలు తక్కువగా ఉంటాయి) నడుపుతూ వస్తోంది. కొత్త నిబంధనలతో రాత్రి వేళల్లో పని చేయడానికి తగినంత మంది సిబ్బంది లేకుండా పోయారు. ఇండిగో రోజుకు సగటున 2,200 దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులు నడుపుతోంది. భారీ సంఖ్యలో, అది కూడా రాత్రి వేళల్లో ఎక్కువగా విమానాలు నడపడంతో డీజీసీఏ నిబంధనల ప్రభావం ఇండిగోపై తీవ్రంగా పడింది. దీని ఫలితమే, విమానాల రద్దు, షెడ్యూళ్ల మార్పు, జాప్యం. ఇండిగోలో సంక్షోభం వెనక ఆ సంస్థ స్వయంకృతాపరాధం కూడా ఉందని పైలట్ల సంఘాలు విమర్శిస్తున్నాయి. 'ఫ్లయిట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్'ను అమలు చేయడానికి డీజీసీఏ రెండేళ్ల సమయం ఇచ్చినప్పటికీ ఇండిగో తగిన ప్రణాళికలు రూపొందించుకోలేదని, అందువల్లే ఈ గందరగోళం తలెత్తిందని 'ఎయిర్‌లైన్స్ పైలట్స్ అసోసియేషన్' వెల్లడించింది.

సరిదిద్దడానికి కృషి చేస్తున్నాం: ఇండిగో

రోజుకు సగటున 3.80 లక్షల మంది ప్రయాణికులకు తాము సేవలందిస్తుంటామని, ఇటీవల తమ వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారని, అందుకు క్షమాపణ కూడా చెప్తామని ఇండిగో సీఈవో పీటర్ ఎల్‌బర్స్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నిర్వహణపరమైన సవాళ్లు, మైనర్ టెక్నికల్ సమస్యలు, షెడ్యూళ్లలో మార్పులు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పెరిగిన విమానాల రద్దీ, కొత్తగా అమల్లోకి వచ్చిన ఫ్లయిట్ డ్యూటీ నిబంధనలు అన్నీ కలిసి ప్రస్తుత సంక్షోభానికి కారణమయ్యాయని వివరించారు. సంస్థ కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఇండిగో అంతరాయాలపై మంత్రి రామ్మోహన్ సమీక్ష

ఇండిగో విమానాల రాకపోకల్లో అంతరాయాలపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు గురువారం ఉన్నత స్థాయి సమీక్ష జరిపారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆ సంస్థకు సూచించారు. ఈ పరిస్థితిని సాకుగా తీసుకొని విమాన చార్జీలు పెంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనల కారణంగా సమస్య తలెత్తినట్లు ఆ కంపెనీ ప్రతినిధులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ వివరణతో రామ్మోహన్ సంతృప్తి చెందలేదు. సమయం ఇచ్చినా సిబ్బంది విధుల సమయాలను తగిన విధంగా రూపొందించకపోవడాన్ని ప్రశ్నించారు. సర్వీసుల రద్దుపై ప్రయాణికులకు ముందుగానే సమాచారం ఇవ్వాలన్నారు. విమానాశ్రయాల్లో చిక్కుకున్న ప్రయాణికులకు హోటల్, ఇతర సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు.

'సోషల్ మీడియా' వివరాలు వెల్లడించాల్సిందే

- హెచ్-1బీ, హెచ్-4 వీసా దరఖాస్తుదారులకు అమెరికా ఆదేశం

న్యూయార్క్/వాషింగ్టన్, డిసెంబరు 4: హెచ్-1బీ, హెచ్-4 వీసా దరఖాస్తుల స్ర్కీనింగ్, వెట్టింగ్ నిబంధనలను అమెరికా మరింత కఠినతరం చేసింది. దరఖాస్తుదారులకు సంబంధించిన అన్ని సోషల్ మీడియా ఖాతాల ప్రొఫైళ్ల ప్రైవసీ సెటింగ్‌లను పబ్లిక్ చేయాలని ట్రంప్ ప్రభుత్వం తాజా గా ఆదేశించింది. డిసెంబరు 15నుంచి హెచ్-1బీ దరఖాస్తుదారులతో పాటు వారిపై ఆధారపడినవారి ఆన్‌లైన్ యాక్టివిటీని క్షుణ్నంగా సమీక్షిస్తామని పేర్కొంటూ అమెరికా విదేశాంగశాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రకృతి సిద్ధంగా మురుగునీటి శుద్ధి

- వినూత్న వ్యవస్థను అభివృద్ధి చేసిన ఎన్‌ఐటీ రూర్కెలా

న్యూఢిల్లీ, డిసెంబరు 4: రూర్కెలాలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) పరిశోధకులు వ్యర్థ జలాల శుద్ధి కోసం ఒక వినూత్న, ప్రకృతి ఆధారిత మురుగునీటి శుద్ధి వ్యవస్థను అభివృద్ధి చేశారు. భారత్‌లోని ధోబీఘాట్‌ల పునరుద్ధరణకు, పట్టణాల్లో నీటి వనరుల సంరక్షణకు ఇది ఉపయోగపడనుంది. ఈ మేరకు పరిశోధకులు వ్యర్థ జలాలను శుద్ధి చేయడానికి సహజ సూర్యకాంతిని వినియోగించుకునే వినూత్న పునర్వినియోగ ఫొటోక్యాటలిస్ట్ వ్యవస్థను అభివృద్ధి చేశారు. 'కంకర, ఇసుక, మట్టి, మొక్కలు, సూక్ష్మజీవులు వంటి సహజ వస్తువులను ఉపయోగించి ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాం. ప్రకృతి నుంచి ప్రేరణ పొంది.. స్వచ్ఛమైన నీటి కోసం దీన్ని రూపొందించాం' అని రూర్కెలాలోని బయోటెక్నాలజీ, మెడికల్ ఇంజనీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ కస్తూరి దత్తా వెల్లడించారు. ఎన్ఐటీ రూర్కెలాలోని ధోబీ ఘాట్‌లో దీన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించగా.. ఈ వ్యవస్థ రోజుకు సుమారు 1400 లీటర్ల సబ్బునీళ్లను శుద్ధి చేసింది.

సాయుధ దళాలకు 'అర్బెల్' పవర్..!

- ఏఐ ఆధారిత ఆయుధ వ్యవస్థ కొనుగోలుకు భారత్ సై

న్యూఢిల్లీ, డిసెంబరు 4: మన సాయుధ దళాల సామర్థ్యం, శక్తిని మరింత బలోపేతం చేసే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. మెషిన్ గన్‌లు, రైఫిల్స్ సహా చిన్న ఆయుధాల సామర్థ్యాన్ని మెరుగుపరిచే ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత అర్బెల్ ఆయుధ వ్యవస్థను కొనుగోలు చేయాలని భావిస్తోంది. ఇజ్రాయెల్ వెపన్ ఇండస్ట్రీ (ఐడబ్ల్యూఐ) నుంచి అత్యాధునిక కంప్యూటరైజ్డ్ ఆయుధ వ్యవస్థ అయిన అర్బెల్ (ఏఆర్‌బీఈఎల్)ను కొనుగోలు చేయడానికి భారత్ చర్చలు జరుపుతోంది. ఈ విషయాన్ని ఐడబ్ల్యూఐ సీఈవో షుకి స్క్వర్ట్జ్ ధ్రువీకరించారు.

సుష్మా స్వరాజ్ భర్త స్వరాజ్ కౌశల్ కన్నుమూత

న్యూఢిల్లీ, డిసెంబరు 4: మిజోరం మాజీ గవర్నర్ స్వరాజ్ కౌశల్(73) కన్నుమూశారు. ఛాతిలో నొప్పితో ఢిల్లీ ఎయిమ్స్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారని ఆయన కుమార్తె, బీజేపీ ఎంపీ బాన్సురీ స్వరాజ్ తెలిపారు. దివంగత విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ భర్త అయిన స్వరాజ్ కౌశల్ 1990లో 37 ఏళ్ల వయసులో మిజోరం గవర్నర్‌గా పనిచేశారు. ఆయన మరణంపై ప్రధాని మోదీ సహా పలువురు నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఏడాదిలోగా ఎలక్ట్రానిక్ టోల్ వసూలు: గడ్కరీ

న్యూఢిల్లీ, డిసెంబరు 4: ఏడాదిలోగా ప్రస్తుతం అమల్లో ఉన్న టోల్ వసూలు విధానం స్థానంలో కొత్త ఎలక్ట్రానిక్ విధానం అమల్లోకి వస్తుందని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం పేర్కొన్నారు. దీని ద్వారా వాహనదారులు టోల్ ప్లాజాల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా ప్రయాణం సాగించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే కొత్త విధానం పది ప్రదేశాల్లో అమల్లో ఉందన్న ఆయన ఏడాదిలోగా దేశవ్యాప్తంగా దీనిని విస్తరించనున్నట్టు తెలిపారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఈ మేరకు కేంద్ర మంత్రి వెల్లడించారు.

పొగాకుపై అధిక సెంట్రల్ ఎక్సైజ్ సుంకం

- 60-70% మేర విధించే అవకాశం
- బిల్లుకు పార్లమెంటు ఆమోదం

న్యూఢిల్లీ, డిసెంబరు 4: పొగాకుపై అధిక సెంట్రల్ ఎక్సైజ్ సుంకాన్ని విధించేందుకు అవకాశం కల్పించే బిల్లును గురువారం పార్లమెంటు ఆమోదించింది. ప్రస్తుతం పొగాకుపై విధించిన జీఎస్టీ పరిహార సెస్సు వసూళ్లను నిలిపివేసిన అనంతరం ఎక్సైజ్ సుంకం అమల్లోకి రానుంది. ఈ బిల్లుకు బుధవారం లోక్‌సభ ఆమోదించగా, గురువారం రాజ్యసభ అంగీకారం తెలిపింది. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ ప్రస్తుతం పొగాకు ఉత్పత్తులను 'డీ మెరిట్' కేటగిరీగా పరిగణించి 40% జీఎస్టీ పరిధిలో ఉంచినట్టు చెప్పారు. ప్రస్తుతం 28% జీఎస్టీతో పాటు పరిహార సెస్సును వసూలు చేస్తున్నట్టు తెలిపారు. సిగరెట్లు, సిగార్లు, హుక్కా, జర్దా, సెంటెండ్ టుబాకో వంటి ఉత్పత్తులకు ఇది వర్తిస్తోందని వివరించారు. సెస్ వసూలును నిలిపివేసిన తరువాత ముడి పొగాకుపై 60-70% ఎక్సయిజ్ డ్యూటీ వసూలు చేసే అవకాశం ఉందని తెలిపారు. పొగాకు సాగును తగ్గించి ఇతర వాణిజ్య పంటలు పండించాలని రైతులను కోరుతున్నట్టు ఆమె తెలిపారు. మరోవైపు.. భారతదేశ వాస్తవమైన ఆర్థిక పరిస్థితిని పతనమవుతున్న రూపాయి విలువ తెలియజేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. అమెరికా డాలర్‌తో పోల్చితే రూపాయి విలువ గురువారం మరో రూ.28 పైసలు దిగజారి రూ.90.43పైనకు చేరిన నేపథ్యంలో ప్రధాని మోదీని విమర్శిస్తూ ఖర్గే 'ఎక్స్'లో ఒక పోస్టు పెట్టారు. రూపాయి విలువ పడిపోడానికి కారణం ఏమిటని ఖర్గే ప్రశ్నించారు. కాగా ఢిల్లీలో వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ డిమాండ్ చేశారు. ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రంగా ఉండటంపై వివిధ ప్రతిపక్ష పార్టీల నేతలు పార్లమెంటు భవనంలో గురువారం ఆందోళన నిర్వహించారు. పార్లమెంటు మకర ద్వారం వద్ద ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. కొందరు ఎంపీలు మాస్కులు ధరించి ఆందోళనలో పాల్గొన్నారు.



ఖమ్మం జిల్లా సరిహద్దులో భువనేశ్వరి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏపీ సీఎం సతీమణి వాహనం తనిఖీ

కూసుమంచి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి వాహనాన్ని ఖమ్మం జిల్లా సరిహద్దులో అధికారులు తనిఖీ చేశారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఖ మ్మం, సూర్యాపేట జిల్లాల సరిహద్దులో ఉన్న కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద అధికారులు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం నారా భువనేశ్వరి హైదరాబాద్ నుంచి ఖమ్మం, అశ్వారావుపేట మీదుగా ఏపీలోని జంగారెడ్డిగూడెం వెళుతుండగా నాయకన్‌గూడెం చెక్‌పోస్టు వద్ద ఖమ్మం జిల్లా పోలీసులు, అధికారులు వాహనాన్ని తనిఖీ చేశారు.

7న 'ప్రజా వంచన దినం'

- ఇందిరా పార్కు వద్ద మహాధర్నా
- కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతాం: రాంచందర్‌రావు

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఈ నెల 7న నిర్వహించ తలపెట్టిన ప్రజాపాలన దినోత్సవానికి వ్యతిరేకంగా అదే రోజు 'తెలంగాణ ప్రజా వంచన దినం' నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలిపారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జ్‌షీట్ విడుదల చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పాఠశాలలు, హాస్టళ్లను నిర్వహించలేని దుస్థితి నెలకొందని విమర్శించారు. యూనివర్సిటీలు మూతపడే పరిస్థితి నెలకొందని మండిపడ్డారు. అన్ని రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, దీనిని ప్రశ్నిస్తే కేంద్రాన్ని నిందిస్తున్నారని ధ్వజమెత్తారు. కాగా, ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణకు రావాలని సినీ నటుడు శుభలేఖ సుధాకర్.. రాంచందర్‌రావును ఆహ్వానించారు. గురువారం బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన సుధాకర్.. రాంచందర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

కోతుల సమస్యను పరిష్కరించేదెవరు: ఎంపీ కొండా

న్యూఢిల్లీ/వికారాబాద్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోతుల సమస్య తమ పరిధిలోకి రాదని ప్రభుత్వ శాఖలు తప్పించుకుంటున్నాయని, అది ఏ విభాగం కిందకు వస్తుందో వెల్లడించాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కేంద్రాన్ని డిమాండ్ చేశారు. గురువారం లోక్‌సభ జీరో అవర్‌లో ఆయన మాట్లాడారు. కోతుల సమస్యతో రైతులు తీవ్రంగా పంటలు నష్టపోతున్నారని తెలిపారు. దీనిని నివారించేందుకు జాతీయ స్థాయిలో కార్యక్రమం చేపట్టాలని అన్నారు. తెలంగాణలో సర్పంచ్ ఎన్నికల్లో కూడా కోతుల సమస్య ఒక ఎజెండా మారిందని ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు.

మేడారంలో గద్దెల పునఃప్రతిష్ఠ వాయిదా

ములుగు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క సారలమ్మల దేవస్థాన అభివృద్ధిలో భాగంగా 4న ప్రారంభించాలనుకున్న గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెల పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం వాయిదా పడింది. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీరస్వామి ఆధ్వర్యంలో పూజారులు గురువారం సమావేశం ఏర్పాటు చేసి, గద్దెల పునఃప్రతిష్ఠాపనను 24వ తేదీన నిర్వహించాలని నిర్ణయించారు.

ఏసీబీ వలలో అవినీతి 'శ్రీ'

- రంగారెడ్డి సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సు ఏడీ కె.శ్రీనివాసులు
- 6 ప్రాంతాల్లో భారీగా కూడబెట్టుకున్న ఆస్తులు
- తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటకలోనూ స్థిరాస్తులు
- 22 ఎకరాల వ్యవసాయ భూమి, 7 ఇళ్ల ప్లాట్ల గుర్తింపు
- రూ.1.83 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు

హైదరాబాద్/ ఆదిభట్ల/ రాయదుర్గం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తులున్నాయన్నట్లు గుర్తించిన రంగారెడ్డి జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్సు అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) కె.శ్రీనివాసులపై ఏసీబీ కేసు నమోదు చేసింది. ఆయన నివాసం ఉంటున్న రాయదుర్గంలోని మైహోం భూజా, కలెక్టరేట్‌లోని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్సు కార్యాలయం, ఆయన సొంత జిల్లా మహబూబ్ నగర్ సహా 6 ప్రాంతాల్లోని బంధు మిత్రులు, బినామీలు, ఇతర సహచరుల ఇళ్లపై గురువారం ఉదయం ఏకకాలంలో దాడులు చేసిన ఏసీబీ అధికారుల తనిఖీలు రాత్రి వరకూ సోదాలు కొనసాగాయి. ఈ తనిఖీల్లో బయటపడ్డ నగదు, చర, స్థిరాస్తులు, బంగారం, వెండి ఆభరణాలు చూసిన అధికారుల కళ్లు జిగేలుమన్నాయి. కె.శ్రీనివాసులు భారీగా అక్రమాస్తులు కూడబెట్టినట్లు ఈ సోదాల్లో ఏసీబీ గుర్తించింది. మైహోమ్ భూజాలో ఒక ఫ్లాట్, నారాయణపేట జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌తో కూడిన రైస్‌మిల్లు, 3 ఇళ్ల ప్లాట్లు, కర్ణాటకతోపాటు ఏపీలోని అనంతపూర్‌లలో 11 ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి, మహబూబ్‌నగర్‌లో 4 ప్లాట్లకు సంబంధించిన పత్రాలు గుర్తించినట్లు ఏసీబీ డీజీ చారు సిన్హా ఓ ప్రకటనలో తెలిపారు. రాయదుర్గంలోని శ్రీనివాసుల నివాసంలో రూ.5లక్షల నగదు, 1.6 కిలోల బంగారు ఆభరణాలు, 770 గ్రాముల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లు ఉన్నట్లు గుర్తించారు. స్థిరాస్తుల విలువ డాక్యుమెంట్, మార్కెట్ విలువకంటే పలు రెట్ల అధికమని ఏసీబీ డీజీ చారు సిన్హా తెలిపారు. గతంలోనూ శ్రీనివాసులుపై పలు ఫిర్యాదులొచ్చాయి. హైదరాబాద్ మహా నగర పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలకు అనుమతి ఇచ్చిన ఆరుగురు అధికారులపై గతేడాది సెప్టెంబరులో సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో ఈయన కూడా ఉన్నారు. ప్రస్తుతం శ్రీనివాసులు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

కలెక్టరేట్‌లో రాత్రి 7 గంటల వరకు సోదాలు

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని సర్వే, ల్యాండ్ రికార్డ్సు అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయంలో రాత్రి 7గంటల వరకు ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఏసీబీ డీసీపీ వీవీ చలపతి ఆధ్వర్యంలోని బృందం ఉదయం 9 గంటలకే ఏడీ కార్యాలయానికి చేరుకుని సోదాలు ప్రారంభించారు. ఇక్కడ భూ రికార్డులు, కంప్యూటర్, పెన్‌డ్రైవ్‌లను స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని మిగతా విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది.. ఏసీబీ దాడులతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఏడీ చాంబర్‌ను ఏసీబీ అధికారులు తన అధీనంలోకి తీసుకొని ఆయనకు సంబంధించిన డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలించారు.

ఏసీబీ ఫిర్యాదుకు క్యూఆర్ కోడ్!

స్కాన్ చేసి లాగిన్ అవ్వొచ్చు..అందుబాటులోకి ఆన్‌లైన్ వ్యవస్థ

హైదరాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక వారోత్సవాల సందర్భంగా ఏసీబీ డీజీ చారుసిన్హా గురువారం ఏసీబీ ఫిర్యాదులకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగులపై ఫిర్యాదు చేయాలంటే ఏసీబీకీ నేరుగా టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని లేదా బహిరంగ ప్రదేశాల్లో తాము ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఏసీబీకి లాగిన్ అవ్వచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేయవచ్చని వివరించారు. క్యూఆర్ కోడ్‌ను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలోనూ, బహిరంగ ప్రదేశాల్లోనూ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.